thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 246 కరీంనగర్ గురువారం, 13 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### రైల్వేలో 6,374 పోస్టుల భర్తీకి చర్యలు

న్యూఢిల్లీ : రైల్వేలో ఖాళీగా ఉన్న 6,374 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమ య్యాయి. సిగ్నల్, టెలికమ్యూనికేషన్ సహా 51 కేటగిరీల్లోని గ్రేడ్ -సి పోస్టులు భర్తీ కానున్నాయి. దేశంలోని 17 జోన్లు, ఉత్పాదక యూనిట్లలో ఈ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుతం పేర్కొన్న పోస్టుల సంఖ్య కన్నా ఇంకా ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. సిగ్నల్, టెలికాం విభాగంలో చివరిసారిగా 2017లో పోస్టుల భర్తీ జరిగింది.

# అంతు చిక్కని సైలెంట్ ఓటింగ్!

## జూబ్లీహిల్స్ ఎగ్జిట్ పోల్స్ వేళ కొత్త ట్విస్ట్

## గెలుపుపై అన్ని పార్టీల్లో అదే ఉత్కంఠ..!!




హైదరాబాద్ : జూబ్లీహిల్స్ లో పోలింగ్ ముగిసింది. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ కే అనుకూలంగా ఇచ్చాయి. ఇక తమదే గెలుపు అంటూ కాంగ్రెస్ మెజార్టీ లెక్కలు వేస్తోంది. పోలింగ్ తరువాత బీఆర్ఎస్ కే ఓటర్లు అనుకూల తీర్పు ఇచ్చారంటూ ఆ పార్టీ నేతలు విశ్లేషణ చేస్తున్నారు. బీజేపీకి మాత్రం గతం కంటే ఈ సారి ఓటింగ్ తగ్గినట్లు సర్వే సంస్థలు చెబుతున్నాయి. బీజేపీకి తగ్గిన ఓటు ఎవరికి మళ్లింది. అదే విధంగా సర్వేకు అంతుచిక్కని విధంగా కొంత ఓటింగ్ ఉన్నట్లు ప్రధాన పార్టీలు అంగీకరిస్తు న్నాయి. మరి.. ఆ ఓటింగ్ ఎవరికి మళ్లింది.. డివిజన్ల వారీగా పార్టీల లెక్కలు ఏంటీ.. ఇప్పుడు ఇదే అసలు ఫలితంలో కీలకంగా మారబోతోంది... ప్రతిష్ఠాత్మకంగా మారిన జూబ్లీహిల్స్ పోరులో ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ వైపే మొగ్గ చూపాయి. కాంగ్రెస్ కే ఓటర్లు పట్టం కట్టారని మెజార్టీ సంస్థలు తేల్చాయి. రెండు నుంచి ఎనిమిది శాతం వరకు కాంగ్రెస్ కు బీఆర్ఎస్ కంటే ఆధిక్యత ఉంటుందని అంచనా వేసాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 48.24 శాతం పోలింగ్ జరిగింది. కాంగ్రెస్ తొలి నుంచి ఇక్కడ వ్యూహాత్మకంగా వ్యవహరించటంతో పాటుగా ఎంఐఎం మద్దతుతో ఓటింగ్ శాతం పెరిగినట్లు కనిపిస్తోంది. అదే సమయంలో బీఆర్ఎస్ ఓటింగ్ కొంత కోల్పోయినట్లు అర్దమవుతోంది. ఇక.. బీజేపీకి గత ఎన్నికల్లో 14 శాతం ఓటింగ్ వచ్చింది. ఉప ఎన్నికల్లో మాత్రం అన్ని ఎగ్జిట్ పోల్స్‌కు 14 శాతం నుంచి 6 శాతానికి తగ్గినట్లు ఎగ్జిట్ పోల్స్ లెక్కలు చబుతున్నాయి. ఈ లెక్కన దదాపు గా 8 శాతం ఓట్లు క్రాస్ అయ్యాయి. అంటే సగానిపైగా ఓట్లు ఇతర పార్టీలకు బదిలీ అయ్యాయి. ఈ ఓటు ఎటు ఏకపక్షంగా కాంగ్రెస్ వైపు మళ్లిందా లేక, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చెరింత చీల్చుకున్నాయా అనేదే తుది ఫలితంలో కీలకం కానుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 47 శాతం పోలింగ్ నమోదైతే ఇప్పుడు అది 48.24 శాతానికి పెరిగింది. అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. పెరిగిన ఈ ఓటింగ్ కూడా గెలుపును డిసైడ్ చేసే ఫ్యాక్టర్‌గా మారనుంది. తగ్గిన బీజేపీ ఓట్ షేర్ ఏకపక్షంగా కాకుండా.. కాంగ్రెస్ - బీఆర్ఎస్ మధ్య చీలి ఉండే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయం. బీజేపీ ఓటు ఎవరికి ఎక్కవగా టర్న్ అయితే ఆ పార్టీకి మెజార్టీ ఖాయంగా కనిపిస్తోంది. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ 4 నుంచి 5 శాతం వరకు కాంగ్రెస్ కు లీడ్ ఉన్నట్లు మెజార్టీ అభిప్రాయపడ్డాయి. ఎర్రగడ్డలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కు సమానంగా ఓట్లు పడ్డాయని, బోరుబండలో తమకే అధిక్యం ఉంటుందని చెబుతున్న బీఆర్ఎస్ నేతలు.. షేక్ పేటలో వచ్చే మెజార్టీ మిగిలిన ప్రాంతాల్లో వచ్చిన నష్టం భర్తీ చేస్తుందని విశ్లేషిస్తున్నారు. కాగా, రెండు శాతం వరకు ఏ పార్టీకీ.. సంస్థకు అంతు చిక్కని సైలెంట్ ఓటింగ్ జరిగిందని పార్టీలు లెక్క లు వేస్తున్నాయి.

దీంతో.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమవుతాయా.. తుది ఫలితం ఏంటనేది మరింత ఉత్కంఠ పెంచుతోంది.




### ఢిల్లీ పేలుడు బాధితులను ఆసుపత్రిలో పరామర్శించిన మోదీ

న్యూఢిల్లీ: ఢిల్లీ పేలుడు ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  బుధవారంనాడు పరామర్శించారు. రెండ్రోజుల భూటాన్ పర్యటన ముగించుకుని వచ్చిన ప్రధాని ఆ వెంటనే లోక్‌నాయక్ జయప్రకాష్  ఆసుపత్రికి వెళ్లారు. బాధితులతో నేరుగా మాట్లాడి త్వరగా కోలుకోవాలని అభిలషించారు. వైద్యులు, అధికారులతో మాట్లాడారు. బాధితుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాని రాక కోసం ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద మీడియా వేచి ఉండటంతో ఆయన ఆసుపత్రిలో వెనుక వైపునున్న ప్రత్యేక గేటు ద్వారా లోపలకు వెళ్లారు. ఢిల్లీలో పేలుడుకు బాధ్యులైన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, వారిని చట్టం ముందు ఉంచుతామని పేలుడు ఘటన అనంతరం మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీ పేలుడు దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది.




### తవ్వే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.......

దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో తవ్వే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 26/11 ముంబయి దాడుల తరహాలో దేశ రాజధానిలో వరుస పేలుళ్లకు ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరిలో టార్గెట్ లిస్ట్‌లో ఎర్రకోటతో పాటు ఇండియా గేట్ వంటి ఇతర ప్రముఖ కట్టడాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఇందుకోసం భారీగా బాంబులను కూడా తయారుచేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులోభాగంగానే పలు అనుమానితులు, నిందితులను విచారించి వారి నుంచి కూపీ లాగుతున్నారు. పేలుడుకు కారణమైన వైద్యుల టెర్రర్ మాడ్యూల్ వెనక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దిల్లీలో వరుస పేలుళ్ల కోసం ఉగ్రవాదులు జనవరి నుంచి పథక రచన చేస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఈ టెర్రర్ మాడ్యూల్ అత్యంత శక్తిమంతమైన 200 ఐఈడీలను సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దిల్లీలోని ఎర్రకోట, ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం సహా దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్ వద్ద పేలుళ్లకు పాల్పడాలని వీరు కుట్ర  పన్నుతున్నట్లు తెలిపాయి. ఈ టెర్రర్ మాడ్యూల్‌పై ఇటీవల జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.  ఇక, దిల్లీలో పేలుడు జరిగిన ప్రాంతం నుంచి 40 నమూనాలను ఫోరెన్సిక్ అధికారులు సేకరించారు. ఇందులో కూడా అమ్మోనియం నైట్రేట్ ఆనవాళ్లతో పాటు అత్యంత శక్తిమం తమైన మరో పేలుడు పదార్థం కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. దిల్లీ పేలుడు కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఇందుకోసం 10 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసింది. జమ్మూకశ్మీర్, దిల్లీ, హరియాణా పోలీసుల నుంచి కేసు డైరీలను తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతోంది. నిందితుల కార్యకలాపాలు, వారికి అందిన ఆర్థిక సహకారం గురించి  ఆరా తీస్తోంది. ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌తో ఎన్ఐఏ డీజీతో కీలక భేటీ నిర్వహించనున్నారు.



# 50 శాతం రిజర్వేషన్లతోనే...

# 'లోకల్ ఫైట్'

## వచ్చే నెలలోనే ముహూర్తం!

హైదరాబాద్ :  వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఇందుకనుగుణంగా కసరత్తును వేగవంతం చేసింది.ఇందులో భాగంగానే ఈ నెల 12న కేబినెట్సమావేశం ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో హైకోర్టు సూచించిన విధంగా 50 శాతం రిజర్వేషన్‌లతో ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గ భేటీలో అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని ఇప్పటికే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

దీనిని సవాల్ చేస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లినా లాభం లేకుండా పోయింది. హైకోర్టులోనే తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం చెప్పడంతో ప్రభుత్వానికి మరో మార్గం లేకుండా పోయింది. దీంతో 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాల్సిన అనివార్య పరిస్థితి నెలకొన్నది.ఎన్నికల సంఘంపై పిటిషన్‌రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానం ఆదేశాలను రాష్ట్ర ఎన్నికల సంఘం పాటించడం లేదంటూ హైకోర్టులో పిటిషన్దాఖలైంది. కానీ, అంతకు ముందే ప్రభుత్వానికి ఎన్నికల సంఘం లేఖ రాసింది. కోర్టు సూచించిన విధంగా తమకు రిజర్వేషన్ల జాబితా అందించాలని అందులో పేర్కొంది. కానీ, ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దీంతో సర్కారు డెసిషన్ కోసం ఎన్నికల కమిషన్ ఎదురు చూస్తున్నది.

**నెలాఖరులోగా ఎన్నికల షెడ్యూల్..!** నిన్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. నేతలంతా ఖాళీ అయ్యారు. అతి త్వరలోనే మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. పాత విధానంలో (50 శాతం రిజర్వేషన్లతో) ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకోబోతున్నదని అధికార వర్గాల ద్వారా తెలిసింది. కేబినెట్తీర్మానం అనంతరం పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్లను మరోసారి కలెక్టర్ ద్వారా ఖరారు చేయనున్నది. అనంతరం ఆ జాబితా ఎన్నికల సంఘానికి అందిస్తారు. ఈ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ఎలక్షన్ షెడ్యూల్ విడుదలయ్యేలా కసరత్తు జరుగుతున్నది. ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ సిద్ధంగా ఉన్నందునా.. రిజర్వేషన్లు ఖరారు చేస్తే వెంటనే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో వచ్చే నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. ఇంకా స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం చేయడం సరికాదనే ఉద్దేశంతో ఉన్నట్టు సమాచారం. పార్టీ కేడర్ నుంచి ఒత్తిడి, కేంద్రం నుంచి నిధులు ఇలా అనేక విషయాలతో ఎన్నికలు ముడిపడి ఉన్నాయని మెజార్టీ మంత్రులు, ముఖ్యనాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే నేడు జరగాల్సిన కేబినెట్ భేటీని 12వ తేదీకి వాయిదా వేసినట్టు సమాచారం. చట్టప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాకుంటే పార్టీ పరంగా అమలు చేస్తామని ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించింది.




## మంత్రి పదవి కోరలేదు.. సీఎంతో గ్యాప్ లేదు: టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

సీఎం రేవంత్ రెడ్డి, తనకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టతనిచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తాను చాలా సంతోషంగా ఉన్నానని, మంత్రి పదవి కావాలని తాను ఎక్కడ అడగడం లేదని కూడా ఆయన వివరణ ఇచ్చారు. పార్టీ లో నేను ఆర్గనైజషన్ నుంచి వచ్చాను. పార్టీ అప్పగించే బాధ్యతను నిర్వర్తిస్తాను. నేను మంత్రి వర్గంలోకి వెళ్లాలని ఆరాటపడటం లేదు. నాకు సీఎంతో పాటు మంత్రివర్గం మొత్తం పూర్తిగా సహకారం అందిస్తున్నారు. నాకు, సీఎంకు ఎలాంటి గ్యాప్ లేదు'. అని మహేష్ గౌడ్ చెప్పారు. తెలంగాణలో కూడా ఓటు చోరీ జరిగిందన్న మహేష్ గౌడ్.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటు చోరీ చేసి ఎక్కువ సీట్లు గెలిచిందన్నారు. నిజామాబాద్‌లో ఓటు చోరీ చేసినట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీలో ఆధారాలను ఫిరోజ్ ఖాన్ బయట పెట్టాడని, ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తుందనుకోవడం లేదని కూడా టీపీసీసీ చీఫ్ చెప్పారు. 'ఫిరాయింపుల వ్యవహారం స్పీకర్ పరిధిలో ఉంది. దానం నాగేందర్ మా పార్టీ విధానాలు నచ్చి మాతో ప్రయాణిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కెసిఆర్ ఎందుకు ప్రచారం చేయలేదో ఆ పార్టీ నేతలే చెప్పాలి. ఇంపార్టెంట్ వ్యక్తులకు కెసిఆర్ ఫోన్ లు చేసినట్లు మాకు సమాచారం ఉంది. ఢిల్లీలో బాంబ్ బ్లాస్ట్ జరగడం దురదృష్టకరం. ఢిల్లీలో బాంబ్ బ్లాస్టింగ్, కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్యమని ఆయన అన్నారు.




## మేడారంలో తెలంగాణ మంత్రులు... పునర్నిర్మాణ పనుల పరిశీలన

ములుగు, నవంబర్ 12: మేడారంలో తెలంగాణ మంత్రులు పర్యటించారు. ఈరోజు (బుధవారం) మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ మేడారం చేరుకుని... అక్కడి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆపై వనదేవతలను దర్శించుకున్నారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పనులు జరుగుతున్నాయని.. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. పదికోట్ల మంది భక్తులు వచ్చినా దర్శనానికి ఇబ్బందులు లేకుండా పనులు చేస్తున్నామని తెలిపారు. ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తూ పనులు చేస్తున్నామని... ఆదివాసీ పూజారుల ఆలోచనతోనే పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు.

**జాతీయ పండుగా గుర్తించాలి: మంత్రి కొండా సురేఖ...** గతంలో మేడారంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మేడారం అభివృద్ధి జరుగుతోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని.. దీనిపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కలిసి ప్రధాన మంత్రిని నరేంద్ర మోడీని ఒప్పించాలని మంత్రి సీతక్క కోరారు. మేడారం మహాజాతర నాటికి పనులు పూర్తవుతాయని.. జాతర నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు.

**దేవుడిపై రాజకీయాలా?: మంత్రి సీతక్క...** మేడారం అంటే తమ బంధం, భక్తి, భావోద్వేగం, బాధ్యత అని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. మేడారంలో పది తరాలకు సరిపడ అభివృద్ధి చేస్తామన్నారు. దీక్షతో, బాధ్యతతో జాతరనాటికి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడిపై రాజకీయాలు చేయొద్దని హితవుపలికారు.


గతంలో వేసిన షెడ్లను తొలగించి పక్కకు పెట్టామన్నారు. మేడారంలో ఎలాంటి ప్రతిమలు లేకపోయినా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారన్నారు. సమ్మక్క – సారలమ్మ ఆదివాసీల అస్థిత్వానికి సంకేతమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## కాళేశ్వరం పునరుద్ధరణకు కసరత్తు: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణకు శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కసరత్తు జరుగుతోందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆనకట్టల పునరుద్ధరణ సహా నీటిపారుదలశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి హయాంలో భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మేడిగడ్డ ఆనకట్ట దెబ్బతినడానికి.. అన్నారం, సుందిళ్ల ఆనకట్టలో లీకేజీలకు గల కారణాలు, వైఫల్యాలను విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జ్యుడీషియల్ కమిషన్ నివేదికలు పేర్కొన్నాయని తెలిపారు. డిజైన్లు – నిర్మాణం – నిర్వహణలో లోపాలు, సరైన నమూనా అధ్యయనాలు లేకపోవడాన్ని ఎన్డీఎస్ఏ నివేదిక ప్రధానంగా ప్రస్తావించిందని.. ఆర్థికపరమైన అవకతవకలు, ప్రణాళికాలోపాలను జ్యుడీషియల్ కమిషన్ పేర్కొందని తెలిపారు. అవకతవకలు, నిర్లక్ష్యం వహించినందుకు కొందరు అధికారులు, ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫారసు చేసిందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ పరంగా, ఇంజనీర్ల స్థాయిలోనూ లోపాలు ఉన్నాయన్న మంత్రి.. ఆనకట్టలను సాంకేతిక విధానంలో సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీడీఓ లోపాలను కూడా విచారణ సంస్థలు ఎత్తిచూపినందున నైపుణ్యం కలిగిన సాంకేతిక సంస్థలు, కన్సల్టెంట్ల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కన్సల్టెన్సీ సేవల కోసం పలు సంస్థలు ముందుకొచ్చాయని, 3 తుదిదశకు అర్హత సాధించాయన్న మంత్రి.. ఐఐటీ లాంటి సంస్థలతో కలిసి పనిచేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడబ్ల్యూపీఆర్ఎస్ అవసరమైన పరీక్షలు చేస్తోందని, వరద ఉద్ధృతి తగ్గిన వెంటనే మరో 15, 20 రోజుల్లో జియోఫిజికల్, హైడ్రాలిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

## కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టులో విచారణ.. జనవరికి వాయిదా



హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు మరో 3 వారాలు గడువు ఇచ్చింది. కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కే జోషికి 3 వారాల గడువు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే.




ప్రముఖ నటుడు నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. తాను చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానన్నారు. ఈ మేరకు ఆమె ఓ పోస్టు పెట్టారు. "నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు–ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా" అని పేర్కొన్నారు.




హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. మంగళవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా హల్‌చల్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. పోలీసులు చెప్పినా వినకుండా యూసుఫ్‌గూడ వద్ద ఓ ఫంక్షన్‌హాల్లోకి అనుచరులతో ఆయన దూసుకెళ్లారని ఫిర్యాదు అందింది. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## స్టార్టప్‌లకు సాయం చేసేందుకు మా ప్రభుత్వం సిద్ధం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రాయదుర్గం టీ హబ్‌లో నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుందని పేర్కొన్నారు. ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తెచ్చినట్లు వివరించారు. "అంకుర పరిశ్రమలు రూ.వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలి. స్టార్టప్‌లకు సాయం చేసేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోంది. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఇతర దేశాల్లోని అవకాశాల కోసం చూడవద్దు. ఇతర దేశాలు మనపై ఆధారపడే స్థితిక మనం ఎదగాలి" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## ఎక్కడి సమస్యలు అక్కడే.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కవిత విసుర్లు



నల్లగొండ, నవంబర్ 12: గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో పూర్తి స్థాయిలో జిల్లాకు కృష్ణా జలాలు అందాయో లేదో ఆలోచించాలని అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట అనరని.. ప్రాజెక్టుల పరిశీలనలో తాము వెళ్తే నిర్వాసితులు కన్నీరు పెడుతున్నారన్నారు. ఇదేనా బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు. నల్గొండ జీజీహెచ్ మెటర్నిటీ వార్డులో కనీస వసతులు లేవన్నారు. ఐసీయూలో ఒక్కో బెడ్‌కు ఇద్దరిని పడుకోబెడుతున్నారని తెలిపారు. ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్ మందు లేకపోవడం బాధాకరమని కవిత అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఎప్పుడు పూర్తి అవుతుందని ప్రశ్నించారు. భూదాన్ భూములు ఎందుకు వెనక్కి తీసుకోలేదని నిలదీశారు. నాగార్జున సాగర్ రైట్ బ్యాంక్ ఏపీ చేతిలో ఉందని.. లెఫ్ట్ బ్యాంక్ పూర్తిగా సెంట్రల్ చేతులో పెట్టారన్నారు. సామాజిక తెలంగాణ రావాల్సి ఉందని... అందుకోసం తెలంగాణ జాగృతి పోరాడుతుందని స్పష్టం చేశారు. 20 శాతం తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులు పెడుతోన్న నిబంధనలను సడలించాలన్నారు. కాగా.. ఈరోజు నల్గొండ పట్టణంలో పర్యటించిన కవిత.. .జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అయితే కవిత పర్యటన నేపథ్యంలో నల్గొండలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను జాగృతి నాయకులు ఏర్పాటు చేశారు. కానీ రాత్రికి రాత్రే హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారు. దీనిపై కవిత స్పందిస్తూ.. నల్గొండలో కోమటిరెడ్డికి తనకు పంచాయతీ లేదని.. కానీ తన ఫ్లెక్సీలు తొలగించారని మండిపడ్డారు. అరెస్టు చేసిన జాగృతి నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించేందుకు నల్గొండ వచ్చానని... పాలిటిక్స్ చేసేటప్పుడు గట్టి వాళ్లనే జాగృతి పోటీలో నిలబెడుతోందని అన్నారు. జాగృతి నాయకులతో పెట్టుకున్నోళ్లు బాగుపడలేదని కవిత వ్యాఖ్యలు చేశారు.

## మూడు కోట్ల విలువైన వస్తువులు సీజ్.. విమానాశ్రయంలో కలకలం




హైదరాబాద్ : రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం రేగింది. ఇద్దరు ప్రయాణికుల నుంచి భారీ మొత్తంలో ఎలక్ట్రానిక్ పరికరాలను సీఐఎస్ఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3 కోట్లుగా గుర్తించారు. ఇద్దరు ప్రయాణికులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కాగా.. ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిత్యం హడావుడిగా ఉంటుంది. విమానాశ్రయంలో భద్రత ఎంతో కట్టుదిట్టంగా ఉంటుంది. ప్రతీ ప్రయాణికుడిని, వస్తువులను క్షుణ్ణంగా పరిశీలిస్తుంటారు అధికారులు. ఈ క్రమంలో అబుదాబీ నుంచి ఇద్దరు ప్రయాణికులు వచ్చారు. అయితే వారు అనుమానంగా కనిపించడంతో వెంటనే సీఐఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరి ప్రయాణికుల లగేజ్ బ్యాగ్‌లను తనిఖీలు చేయగా... మూడు కోట్ల విలువ చేసే డ్రోన్‌లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఐ ఫోన్‌లను గుర్తించారు. ఇంత పెద్ద మొత్తంలో ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తూ ఇద్దరు ప్యాసింజర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తులు సూర్య ప్రకాష్, మహమ్మద్ జాంగిర్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసిన విమానాశ్రయ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. అసలు ఎలక్ట్రానిక్ వస్తువులను ఎందుకు తీసుకువచ్చారు?.. ఎలా తీసుకువచ్చారు?.. ఎక్కడికి తీసుకెళ్తున్నారు అనే దానిపై ఎయిర్‌పోర్టు అధికారులు ఆరా తీసే పనిలో ఉన్నారు.




## దాడుల ఒత్తిడి తట్టుకోలేకనే.. ఇలా బ్లాస్టింగ్.!

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ–ఎన్సీఆర్, జమ్మూకశ్మీర్ పుల్వామాలోని పలు ప్రాంతాలలో భద్రతా సంస్థలు ఇటీవల దాడులు జరిపి భారీఎత్తున పేలుడు పదార్థాలను పట్టుకున్నాయి. దీంతో ఉగ్రవాదుల్లో ఒత్తిడి మరింత అధికమైంది. ఈ ఒత్తిడిని ఎదుర్కోలేకనే అనుమానితుడు తొందరపడి బ్లాస్టర్ చేశారని అధికారులు వెల్లడించారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో దాదాపు 3000 కిలోల పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, టైమర్లు సహా పలు బాంబు తయారీ సామగ్రినీ స్వాధీనం చేసుకున్నారు అధికారులు. భద్రతా సంస్థలు వాటిని పట్టుకోవడానికి జరిపిన దాడుల కారణంగా భయాందోళన, నిరాశ కారణంగా పేలుడు సంభవించిందని నిఘా వర్గాలు ప్రాథమికంగా అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో బాంబును పూర్తిగా తయారు చేయకుండానే పేలుడుకు పాల్పడినట్టు నిర్ధారణ అవుతోంది.

అయితే.. ఈ ఘటనలో పేలుడులో వినియోగించిన పదార్థాలేవో ఇంకా గుర్తించలేదని పోలీసులు తెలిపారు. అనుమానిత మాడ్యూళ్లపై నిఘా వర్గాలు దృష్టి సారించి అరెస్ట్ చేయడం వల్ల ఓ పెద్ద పెను ప్రమాదం తప్పిందంటూ అంచనా వేశారు.

# అనన్య సామాన్యం పురిపండా సాహిత్య సేవనం


**- బహు భాషావేత్త పురిపండా అప్పల స్వామి - నవంబర్ 13... కళాప్రపూర్ణ పురిపండా జయంతి**



తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించిన మహానుభావులలో పురిపండా అప్పల స్వామి ప్రముఖులు. రచయితగా, పాత్రికేయులుగా, పత్రికా నిర్వాహకులుగా, రచయితల సంఘం అధ్యక్షులుగా, గ్రంథాలయ స్థాపకులుగా, గ్రాంథిక తెలుగు భాషా వాదిగా, బహుభాషా కోవిదులు గానే గాక, మహాత్మ గాంధీ నేతృత్వంలో చేపట్టిన స్వాతంత్ర్య ఉద్యమ కార్యక్రమాలలో జాతీయ వాదిగా క్రియా శీలక పాత్రను పోషించారు. పురిపండా అప్పలస్వామి ( నవంబరు 13, 1904 – నవంబరు 18, 1982) విజయనగరం జిల్లా, సాలూరు గ్రామంలో నవంబరు 13, 1904 సంవత్సరంలో జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం కొంతకాలం జరిపి, పిదప స్వయంకృషితో ఆంధ్ర, సంస్కృతాలతో గాక ఒరియా, హిందీ, బెంగాలీ, ఆంగ్ల భాషలలో పాండిత్యాన్ని ఆర్జించారు. మహాత్మాగాంధీ నిర్వహించిన సహాయ నిరాకర ణోద్యమం, హరిజనోద్యమం, ఖాదీ ప్రచారము లలో అత్యంత శ్రద్ధతో పాల్గొన్నారు. విశాఖపట్నంలో అఖిల భారత చరఖా సంఘం వారి ఖాదీ భాండాగారంలో నిర్వాహకు డుగా కొంతకాలం పనిచేశారు. పత్రికా రంగంలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. విశాఖ పట్నం నుండి వెలువడిన 'స్వశక్తి' అను జాతీయ వారపత్రికకు సహాయ సంపాదకుడుగా కొంత కాలం పనిచేశారు. 'ఆంధ్రపత్రిక' కు విలేఖరిగా పన్నెండేళ్ళు వ్యవహరించారు. 'సత్యవాణి' పత్రికను నిర్వహిస్తూ, ఆయన రాసిన సంపాదక వ్యాసాలు పునర్ముద్రణ గౌరవాన్ని పొందాయి. ఆయన ప్రచురించిన 'వైశాఖి' మాసపత్రిక సారస్వత ప్రియుల మన్ననలను పొందింది. గ్రంథాలయోద్యమంలో ఆయన సాగించిన కృషి ప్రశంసనీయం. మంతెన ఆదినారాయణ స్వామి స్థాపించిన ఆంధ్రప్రదేశ్ ప్రథమ గ్రంథాలయాన్ని, 'కవితా సమితి' గ్రంథాలయాన్ని ఆయన అభివృద్ధి పరిచారు. శ్రీరామవరం, పార్వతీ పురంల లోని గ్రంథాలయాలను పెంపొందించారు. మరకాం గ్రామాన ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ యావజ్జీవ గౌరవ సభ్యులుగా ఎన్నుకో బడినారు. ఆయన సాహిత్య రంగంలో సాధించిన కృషి అనన్య సామాన్యం. 15 ఏళ్ళ ప్రాయంలోనే తెలుగులో గద్యపద్య రచనను శ్రీకారం చుట్టారు. 1928 వరకు ఆయన గ్రాంథిక భాషావాది. గిడుగు వెంకట రామమూర్తిని పరిచయంతో, ఆయనతో ప్రభావితుడై తన సాహిత్య కృషిని వ్యావహారిక భాషలోనే సాగించారు. కందపద్య మయమైన 'రాట్నం పతాకం' ఆయన తొలి రచన. ప్రముఖ రచనలలో 'సౌదామిని' ఆంగ్లంలోకి కాక హిందీ, ఒరియా భాషలలోకి కూడా అనువదింపబడి పెక్కు ముద్రణలను పొందింది. కేంద్ర సాహిత్య అకాడమీ కోరికపై 'అమృత సంతానం', 'మట్టి మనుష్యులు' అనే ఒరియా నుండి తెనిగించారు. వంగసాహిత్య చరిత్ర, ఒరియా సాహిత్య చరిత్రలను తెలుగులో రచించారు. అలాగే ఆంధ్ర సాహిత్య చరిత్రను ఒరియా భాషలో రచించి తెలుగు సాహిత్యంతో పరిచయాన్ని ఒరియా పండితులకు కల్పించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వ్యవహారిక భాషలో రచించుటకు పూనుకొన్న సంస్కృత భారతానువాదం శాస్త్రి మరణం వలన అసమగ్రంగా నిలిచిపోగా, మిగిలిన పదిహేను పర్వ పర్వాలను రచించి పూర్తిచేశారు. రాట్న పతాకంబీ మహమ్మద్ చరిత్రబీ సౌదామినిబీ ఒరియా పాటలుబీ జగద్గురు శంకరాచార్యులుబీ చైతన్యామ అరంగులుబీ విశ్వకళావిద్యబీ హంగేరీ విప్లవంబీ దేవీ భాగవతంబీ పురిపండా భాగవతముబీ పురిపండా వ్యావహారికాంధ్ర మహాభారతంబీ శ్రీమద్భాగవతముబీ వ్యావహారి కాంధ్ర వాల్మీకి రామాయణంబీ అమృత సంతానం (అనువాదం)బీ మట్టి మనుష్యులు (అనువాదం)బీ వంగ సాహిత్య చరిత్రబీ ఒడియా సాహిత్య చరిత్రబీ భగవద్గీత తదితరాలు పురిపండా ప్రముఖ రచనలు. ఆయన విశాఖ రచయితల సంఘానికి కొంతకాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో కార్యవర్గ సంఘాలలో సభ్యత్వాలను పొందారు. పురిపండా నవంబరు 18, 1982 సంవత్సరంలో పరమ పదించారు. ఆయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ పురస్కారం ప్రదానం చేసింది. ఆయన శతజయంతి ఉత్సవాలు విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించారు, ఆ సందర్భంగా ఆయన జీవితచరిత్ర, సాహిత్యం గురించిన ద్వా.నా.శాస్త్రి రచించిన పుస్తకం విడుదల చేశారు. పురిపండా విగ్రహాన్ని బీచ్ రోడ్డులో ప్రతిష్ఠించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అలనాటి మేటి సంపాదకులు పండితారాధ్యుల -నవంబర్ 13... పండితా రాధ్యుల నాగేశ్వరరావు వర్ధంతి




తొలితరం ఖ్యాతి గాంచిన పాత్రికేయులలో, సంపాద కులలో పండితారాధ్యుల నాగేశ్వరరావు ఎన్నదగిన వారు. గుంటూరు జిల్లా, ఇంటూరు గ్రామంలో 1912, మార్చి 26న మల్లయ్య, భైరవాంబ దంపతులకు జన్మించారు. గుంటూరు లోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో విద్యా భ్యాసం చేశారు. అనంతరం పత్రికా రచయితగా ప్రసిద్ధి గాంచారు. పిఠాపురం మహా రాజా వారి దేశబంధు పత్రికలో కొన్నాళ్ళు పనిచేసి, ఆచార్య రంగా నెలకొల్పిన వాహిని పత్రికలో 1932లో చేరారు. 1943 నుంచి 1959 వరకూ ఆంధ్రపత్రికలో పని చేశారు. 1960లో ఆంధ్రభూమి సంపాదకునిగా విశేషమైన సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వెలువడిన ఆంధ్ర జనతకు 1965లో ఏడాదిపాటు సంపాదకత్వం వహించారు. 1966 నుంచి మరణించే (1976) వరకూ ఆంధ్రప్రభ బెంగళూరు రెసిడెంట్ ఎడిటర్‌గా పని చేశారు. ఆ పత్రికలతో పాటుగా గోభూమి, క్రాంతి, సంజయ, ప్రజాప్రభ వారపత్రిక, %ఆవునరీతీఖులు% పత్రికలలో సంపాదకునిగా పని చేశారు. 1969–72 మధ్య కాలంలో రాష్ట్రంలో తలెత్తిన వేర్పాటు వాద ఉద్యమ సందర్భాలలో సమన్వయానికి, సంఘటిత తత్వానికి దోహదం చేయడం లో ప్రముఖపాత్ర నిర్వహిం చారు. పండిత పాత్రికేయులుగా ప్రఖ్యాతి గాంచిన పండితా రాధ్యుల నాగేశ్వర రావు 1976 నవంబరు 13న తుదిశ్వాస విడిచారు. పదునైన పదజాలంతో చెప్ప దలుచుకున్న తన భావాన్ని సూటిగా చెప్పంలో ఆయన కాయనే సాటి. రచనలో పటుత్వం, భాషలో పట్టు, ఆయన ప్రతిభను ఇనుమడింప చేస్తాయి. 19 వ శతాబ్దపు తొలి దశకంలో రచనలు ప్రజలలో చైతన్యాన్ని రగిల్చాయి. ఆనాటి పత్రికలూ, వారి చైతన్యాన్ని ఇనుమడింప చేసాయి. నాటి పత్రికాధిపతులు, పత్రికల దారా సామాజిక న్యాయాన్ని కాంక్షించి ప్రచురణ సాగించే వారు. ప్రధానంగా స్వతంత్రం పోరాటంలో ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే రచనలను, రచయితలను, ప్రోత్సహించే స్పందన సాంప్రదాయానికి గట్టి పునాది వేసారు. ఫలితంగా ముద్రణారంగం ఒక పరిశ్రమగా ఆవిర్భవించింది. ఆ పరిశ్రమ ఎందరికో ఉపాధి కల్పించడంతో పాటు సామాజిక ప్రగతికి సోపానాలుగా దినదినాభివృద్ధి చెందుతూ వచ్చాయి. నాగేశ్వరరావు పాత్రికేయ వృత్తికి ఒక గౌరవ ప్రదమైన స్థానాన్ని సంతరింప చేశారు. పత్రికా రంగంలో అలనాటి మేటి పాత్రికేయుల జాబితాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని స్వంతం చేసుకున్నారు. వర్తమాన పాత్రికేయులకు నాగేశ్వరరావు సంపాదకీయాలు, రచనలు ఎంతగానో తోడ్పడ గలవనేది నూటికి నూరుపాళ్ళ నిజం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దయతో నిండిన హృదయం - శాంతిమయ ప్రపంచానికి మార్గం

**ప్రపంచ దయ దినోత్సవం, మానవ సంబంధాల పునరుజ్జీవనం - నవంబర్ 13న... ప్రపంచ దయ దినోత్సవం**




ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం నవంబర్ 13న "ప్రపంచ దయ దినోత్సవం"ను జరుపుకుంటారు. ఈ రోజు మానవజాతి మధ్య ప్రేమ, సానుభూతి, కరుణ, పరస్పర గౌరవం వంటి విలువలను గుర్తు చేస్తూ, మానవతా స్ఫూర్తిని మరలా నూరిపోసే పుణ్యదినం. వేగంగా మారుతున్న ప్రపంచంలో మనిషి స్వార్థం, అసహనం, హింస వంటి ప్రవృత్తులకు లోనవుతున్న నేపథ్యంలో, ఈ దయ దినోత్సవం మానవ మనస్సును పునరుద్ధరించే స్మరణ దినంగా నిలుస్తుంది. దయ దినోత్సవ ఆవిర్భావానికి చరిత్రాత్మక నేపథ్యం ఉంది. 1997లో జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన ప్రపంచ మానవతా సంస్థల సమావేశంలో "వరల్డ్ కైండ్నెస్ మూవ్‌మెంట్" అనే అంతర్జాతీయ సంఘం స్థాపించ బడింది. ఈ సంస్థలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, భారతదేశం, సింగపూర్, యుకె, ఫ్రాన్స్ వంటి 30కిపైగా దేశాల సామాజిక సంస్థలు సభ్యులయ్యాయి. 1998లో ఈ సంఘం ప్రతిపాదన మేరకు నవంబర్ 13ను "వరల్డ్ కైండ్నెస్ డే"గా జరుపు కోవాలని నిర్ణయించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా ఈ దినాన్ని గుర్తుగా సేవా కార్యక్రమాలు, సాంఘిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దయ అంటే కేవలం సహాయం చేయడం మాత్రమే కాదు. ఇతరుల బాధను మన హృదయంలో అనుభూతి చెందడం, త్యాగానికి సిద్ధపడటం, మాటలతో ధైర్యం చెప్పడం కూడా దయలో భాగమే. చిన్న చిన్న దయా చర్యలు పెద్ద సామాజిక మార్పులకు కారణమవుతాయి. ఉదాహరణకు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి చేర్చడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, వృద్ధాశ్రమాల్లో సేవ చేయడం, పాఠశాలలలో పేద పిల్లలకు పుస్తకాలు ఇవ్వడం, ఇవన్నీ మనిషి మనసులో దయా విత్తనాలను నాటుతాయి. ప్రపంచ వ్యాప్తంగా జరిపిన సర్వేలు చెబుతున్నాయి, దయా చర్యలు ఎక్కువగా ఉన్న సమాజాల్లో నేరాల శాతం తక్కువగా ఉంటుందని. 2023లో "వరల్డ్ హ్యాపినెస్ ఇండెక్స్"లో ఫిన్లాండ్, డెన్మార్క్, ఐస్లాండ్ వంటి దేశాలు ముందంజలో ఉండటానికి కారణం అక్కడ ప్రజల మధ్య పరస్పర దయా భావం అధికంగా ఉండటమేనని నిపుణులు అభిప్రాయ పడ్డారు. మరోవైపు, యుద్ధాలు, ద్వేష రాజకీయాలు, సామాజిక అసమానతలు పెరుగుతున్న దేశాల్లో దయా సంస్కారం క్షీణిస్తున్నదని ఐక్యరాజ్య సమితి 2024లో విడుదల చేసిన "గ్లోబల్ హ్యూమానిటీ రిపోర్ట్"లో స్పష్టం చేసింది. భారతీయ సంస్కృతిలో దయను అత్యున్నతమైన మానవ ధర్మంగా పరిగణించారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు దయను మానవతకు మూల సూత్రంగా ప్రతిపాదించాయి. మహా భారతంలో "అహింసా పరమో ధర్మః" అని వాక్యం, దయను సర్వోన్నత ధర్మంగా స్థాపించింది. బౌద్ధ ధర్మం "కరుణ" అనే సిద్ధాంతాన్ని ఆచరణలోకి తెచ్చింది. గౌతమ బుద్ధుడు "సర్వభూతేషు కరుణా" అని బోధించిన మాటలు నేటికీ ప్రామాణ్యాన్ని కోల్పోలేదు. జైనమతం "అనుకంప" అనే భావనను ప్రతిపాదించి, ప్రాణికి హాని చేయరాదని బోధించింది. సాహిత్యకారులు, తత్త్వవేత్తలు కూడా దయను మానవ జీవితానికి మూల స్తంభమని ప్రతిపాదించారు. తులసీదాసు "దయా ధర్మ కా మూల హై" అని చెప్పగా, మన తెలుగు సాహిత్యంలో వేమన, పోతులూరి వీరబ్రహ్మం, త్యాగరాజు కీర్తనల్లోనూ దయా నాదాలు ప్రతిధ్వనించాయి. భారత దేశంలో ప్రతి రాష్ట్రంలోనూ ఈ దినోత్సవం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులలో సానుభూతి, సహానుభూతి విలువలను బోధించేందుకు ప్రత్యేక తరగతులు, చిత్ర ప్రదర్శనలు, సేవా శిబిరాలు జరుగు తున్నాయి. "రాండమ్ యాక్ట్ ఆఫ్ కైండ్నెస్" పేరుతో యువతలో యాదృచ్ఛిక దయా చర్యల ప్రాధాన్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఉదాహరణకు హైదరాబాద్ లోని కొన్ని విద్యా సంస్థలు ప్రతి సంవత్సరం ఈ రోజున నిరాశ్రయులకు ఆహారం అందించే కార్యక్రమాలు చేపడుతున్నాయి. కొన్నిచోట్ల రక్తదాన శిబిరాలు, వృక్షారోపణలు కూడా నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్‌లు విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఈ రోజు తమ దయా చర్యలను పంచుకుంటూ ప్రపంచ మానవతకు స్ఫూర్తి నింపుతున్నారు. అమెరికాలోని "Kindness Foundation" 2024లో విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల్లో ఈ దినోత్సవం గుర్తింపుతో కనీసం 25 మిలియన్ల మంది సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవలి కాలంలో యుద్ధాలు, జాత్యహంకారం, సాంకేతిక ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో దయ అనే మానవతా విలువ అత్యంత అవసరమైంది. మనిషి రోబోట్‌లా మారుతున్న ఈ యుగంలో మనసులో దయ అనే శక్తి ఉన్నంతకాలం మానవత్వం నిలుస్తుంది. కుటుంబంలో పెద్దవారిని గౌరవించడం, పిల్లలకు ప్రేమతో పాఠం చెప్పడం, పశువులను కాపాడటం, ప్రకృతిని సంరక్షించడం, ఇవన్నీ దయ యొక్క వివిధ రూపాలు. ఈ దినోత్సవం మనకు గుర్తు చేసే ప్రధాన పాఠం, మనలో దయ ఉంటేనే సమాజం శాంతియుతంగా ఉంటుంది. మనసులో ప్రేమ, చేతిలో దయ, చూపులో కరుణ ఉంటే ప్రపంచం స్వర్గంలా మారుతుంది. దయ కేవలం ఒక సద్గుణం కాదు, అది మానవజాతి ఉనికికి ఆధారం. ప్రతి మనిషి తన దైన జీవితంలో చిన్న దయా చర్యను ఆచరిస్తే సమాజం సుశీలంగా, సహనంతో, శాంతితో నిండిపోతుంది. అందుకే నవంబర్ 13 కేవలం ఒక తేదీ కాదు, అది మనిషి మనసును మానవత్వం వైపు మలిచే సంస్కార దినం. దయతో నిండిన మనసే నిజమైన భక్తి, సేవే నిజమైన పూజ. మనం ఇతరుల కోసం ఒక క్షణం ఆగితే, ఒక హృదయం సంతోషిస్తే, అదే ప్రపంచ దయ దినోత్సవానికి సార్థకత.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




# విశాఖ సీఐఐ సమ్మిట్.. చంద్రబాబు పర్యటన అప్‌డేట్స్

అమరావతి : ఈనెల 14,15 తేదీల్లో విశాఖలో నిర్వహించే 30వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సమ్మిట్ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ పర్యటన వివరాలు, ఎవరెవరిని కలువనున్నారు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు తదితర వివరాలను అధికారులు వెల్లడించారు. నేటి నుంచి నాలుగు రోజుల పాటు చంద్రబాబు షెడ్యూల్ ఖరారైంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు ఈరోజు సాయంత్రం అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి ముఖ్యమంత్రి నేరుగా విశాఖకు చేరుకున్నారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సన్నాహకాలపై అధికారులు, మంత్రులతో సీఎం సమీక్ష చేయనున్నారు. 4 రోజుల పాటు వరుసగా వన్ టు వన్ భేటీలు, సమావేశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో విశాఖ నుంచే ముఖ్యమంత్రి పాల్గొననున్నారు.

**నవంబర్ 13, 14, 15 తేదీలో సీఎం షెడ్యూల్ ఇదే.. నవంబర్ 13 (గురువారం):** భాగస్వామ్య సదస్సుకు తరలివస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో గురువారం వరుస భేటీలు. గురువారం నోవాటెల్ హోటల్‌లో ఉదయం 'ఇండియా-యూరోప్ బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశం'లో సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు. 'పార్ట్‌నర్స్ ఇన్ ప్రోగ్రెస్' – సస్టైనబుల్ గ్రోత్‌పై ప్రారంభ సెషన్‌లో సీఎం పాల్గొంటారు. తైవాన్, ఇటలీ, స్వీడన్, నెదర్లాండ్స్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు. 'వైజాగ్ ఎకనామిక్ రీజియన్'పై జరిగే కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. సీఐఐ నేషనల్ కౌన్సిల్ నిర్వహించే ప్రత్యేక సమావేశానికి హాజరు గురువారం చివరిగా నెట్వర్క్ డిన్నర్‌లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు.

**నవంబర్ 14 (శుక్రవారం):** నవంబర్ 14న సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం. సదస్సుకు ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. సమావేశానికి వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ విచ్చేయనున్నారు. మొదటగా ఏపీ పెవిలియన్‌కు ప్రారంభోత్సవం. 'ఏఐ ఫర్ వికసిత్ భారత్' సెషన్‌లో సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రసంగం. సదస్సు నుంచే ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల ప్రారంభం. సింగపూర్‌కు నేరుగా విమాన సర్వీసులపై ఒప్పందం. ఏపీ రీఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్ సమ్మిట్‌లో సీఎం ముఖ్య ప్రసంగం. విశాఖలో లులూ మాల్‌కు శంకుస్థాపన. శుక్రవారం చివరిగా బిజినెస్ టుడే ఇంటర్వ్యూ, గాలా డిన్నర్‌కు సీఎం వెళ్లనున్నారు.

**నవంబర్ 15 (శనివారం):** నవంబర్ 15న జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి వరుసగా సమావేశాలు కానున్నారు. గూగుల్, శ్రీ సిటీ, రేమండ్, ఇండోసోల్ వంటి ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమాలు. బ్రెజిల్, న్యూజిలాండ్, జపాన్, కెనడా, మెక్సికో ప్రతినిధులతో సీఎం భేటీలు. 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ', 'సస్టైనబుల్ సిటీస్', 'ఆంధ్ర టూరిజం విజన్' సెషన్లు. మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన 'ఏఐ అండ్ ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్'పై ముఖ్య చర్చ. 'ఇన్వెస్టింగ్ ఫ్రమ్ అబ్రాడ్ : ఎన్ఆర్ఐస్ ఫర్ వికసిత్ భారత్' పై సీఎం సమీక్ష. సదస్సులో చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా బ్రీఫింగ్, వాలెడిక్టరీ సెషన్ నిర్వహణ. మొత్తంగా సదస్సులో 100కి పైగా అంతర్జాతీయ ప్రతినిధులతో సమావేశాలు, 30కి పైగా ఒప్పందాలపై సంతకాలు జరుగనున్నాయి. అలాగే ఏఐ, స్పేస్, గ్రీన్ హైడ్రోజన్, టూరిజం, ఎంఎస్ఎంఈ, ఫైనాన్స్ రంగాలపై కీలక చర్చలు జరుగనున్నాయి. ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడంతో పాటు, భారీఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సదస్సు నిర్వహించనున్నారు. విశాఖ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సన్నద్ధం చేశారు. సదస్సుల్లో రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఇతర మంత్రులు ఇప్పటికే దేశ విదేశాల్లో పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తూ రోడ్ షోలు, పర్యటనలు చేసిన విషయం తెలిసిందే.

# మాదక ద్రవ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం: మంత్రి అనిత



పాయకరావుపేట: మాదక ద్రవ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. దీనికోసం ఈగల్ అనే వ్యవస్థను ఏర్పాటుచేశామని చెప్పారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ ర్యాలీని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వద్దు– జీవితమే ముద్దు అంటూ నినదించారు. అనంతరం విద్యార్థులతో మంత్రి మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ యువత భవిష్యత్ చాలా ముఖ్యమని.. పాఠశాల, కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. గంజాయి మత్తులో జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. ఎన్డీపీఎస్ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని చెప్పారు. "మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీస్‌శాఖ ఎంతో కృషి చేస్తోంది. ప్రస్తుతం నిఘా పెరిగింది. కఠినతరమైన శిక్షలు, చట్టాలు ఉన్నాయి. గంజాయి రవాణా చేసినా.. దాన్ని తీసుకుంటున్నా వెంటనే 1972 నంబర్‌కు కాల్ చేయండి. వెంటనే పోలీసులు వచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు" అని అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.




ఆమదాలవలస : శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళ మస్కట్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. ఆమదాలవలస మండలం వెదుళ్ల వలసకు చెందిన సవలాపురపు నాగమణి మస్కట్‌లో మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఆమె మృతిపై తల్లి సరోజిని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా మస్కట్‌లో నాగమణి పనిచేస్తోందని ఆమె తల్లి తెలిపారు. ఏజెంట్ ద్వారా అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. ఇటీవల నాగమణి ఇంటికి వచ్చి నాలుగు నెలల క్రితం తిరిగివెళ్లినట్లు వివరించారు. పని ప్రదేశంలో గత మూడు రోజులుగా తీవ్ర వేధింపులకు గురవుతున్నట్లు ఆమె చెప్పిందని.. స్వస్థలానికి వచ్చేస్తానని తెలిపిందన్నారు. ఇంతలో ఏం జరిగిందో తెలియదని.. అక్కడి ఏజెంట్ ఫోన్ చేసి నాగమణి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో ఆయన ఫోన్‌లో మాట్లాడి మృతదేహం ఇక్కడికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారని సరోజిని తెలిపారు.




విశాఖ: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా విశాఖ నగరంలో ఏక్తా రన్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏక్తా రన్‌లో విద్యార్థులు, నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చురకలు

## సంపాదకీయం

# ‘సాఫ్ట్ స్కిల్స్’..

## ఏఐ యుగంలో విజయానికి ఇదే కీలకం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఉద్యోగులు, విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ కీలక సమయంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ మాట్ గార్మన్ యువతకు ఒక విలువైన సలహా ఇచ్చారు. భవిష్యత్తులో విజయానికి కేవలం సాంకేతిక (టెక్నికల్) జ్ఞానం మాత్రమే కాక సాఫ్ట్ స్కిల్స్ అత్యంత అవసరం అని నొక్కి చెప్పారు. గార్మన్ అభిప్రాయం ప్రకారం.. ఏఐ టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా.. మానవులకు మాత్రమే సొంతమైన కొన్ని సామర్థ్యాలను యంత్రాలు అనుకరించలేవు. అవేంటంటే.. క్రిటికల్ థింకింగ్.. క్లిష్టమైన సమస్యలను విశ్లేషించడం, లోతైన ఆలోచనతో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఏఐతో సాధ్యం కాదు. అడాప్టబిలిటీ అవసరం. మారుతున్న పరిస్థితులకు, కొత్త టెక్నాలజీలకు త్వరగా అలవాటు పడగల సామర్థ్యం అవసరం.. కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం, ఇతరులతో సమర్థవంతంగా సంభాషించడం ముఖ్యం.. గార్మన్ ఇదే విషయాన్ని చెబుతూ “మానవుల ఆలోచనా సామర్థ్యం, క్రియేటివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం మాత్రం యంత్రాలు చేయలేవు.” అందుకే యువత ఏ విభాగంలో చదువుతున్నా, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

**మానవీయ నైపుణ్యాల ప్రాధాన్యత...** అనేక సంస్థలు తమ కస్టమర్లతో మానవీయంగా మాట్లాడగలిగే.. వారి భావనను పంచుకోగలిగే వ్యక్తులను కోరుకుంటాయి. ఏఐ యుగంలోనూ ఈ మానవీయ నైపుణ్యాలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటాయని అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ స్పష్టం చేశారు.

**జోహో కార్ప్ కూడా అదే సూచన...** ఈ అభిప్రాయాన్ని జోహో కార్పొరేషన్ ఏఐ రీసెర్చ్ చీఫ్ రాంప్రకాశ్ రామమూర్తి కూడా బలపరిచారు. ఇంటర్నెట్ వచ్చినప్పుడు ఉద్యోగాల రూపురేఖలు మారినట్లే, ఇప్పుడు ఏఐ కారణంగానూ ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ రీసనింగ్, క్రిటికల్ థింకింగ్ వంటి నైపుణ్యాలలో మానవులకే ఎప్పటికీ ఆధిక్యం ఉంటుందని తెలిపారు. మానవ మేధస్సు ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికత అగ్రస్థానంలో ఉన్నప్పటికీ.. ఉద్యోగాలను భద్రపరుచుకోవాలంటే టెక్నాలజీ నైపుణ్యాలకు తోడు మానవీయ నైపుణ్యాలు, లోతైన ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార దృక్పథం అత్యంత అవసరం. భవిష్యత్తులో విజయవంతం కావాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ‘సాఫ్ట్ స్కిల్స్’పై దృష్టి సారించడం తప్పనిసరి.

# దేశ విదేశాల్లో రాణించిన టంగుటూరి సకల కళానిధి టంగుటూరి - నవంబర్ 13.. సూర్య కుమారి జయంతి




భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్య కారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొంద డానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె. టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 - ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రి లో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏట నుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని, పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయం లోనే సినీరంగ ప్రవేశము చేసి, ‘రైతుబిడ్డ’ సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడం చేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూం డడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్టలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనే వారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ’ ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్త పోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్ట దీపుడు, మరదలి పెళ్లి, భక్త రామదాసు తదితర తెలుగు చిత్రాల్లో ఉడన్’, ‘ఖటోలా’ తదితర హిందీ చిత్రాల్లో, ‘కటకం’, ‘నేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతి’లో, ఆంగ్ల చిత్రం ‘బాంటే వయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికా దేవిగా నాటకాల్లో నటించేది. లలిత గీతాలు యాభై, దేశభక్తి గీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి.

నటన కంటే సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలిత గీతాలు, అష్టపదులు వంటివాటికి ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది. పేరు ప్రతిష్టలు, ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వ లేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీక రించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది. పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకు రాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో, వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు ‘స్వప్నజగతిలో ఛాయావీణ’ మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు ‘ప్రభువు గారికీ దణ్ణం పెట్టు’, ‘రావోయి చిన్నవాడా’ మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకు రావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరం బాడి సుందరాచారి రచించిన ‘మా తెలుగుతల్లికి మల్లె పూదండ..’ పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది. వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వం దోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ’ అంటూ నటిస్తూ పాడిన ‘దేవత’ చిత్రంలోని పాట, నారదుడుగా ‘శ్రీకృష్ణ ప్రేమ’లో నటిస్తూ ‘రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...’ ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూని వర్సిటీ ట్యూటర్ గా వెళ్లి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది. సూర్యకుమారి ఆరోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో సిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్’ అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది. ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటీషు రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ సెయింట్ పాల్ కెథెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె. నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారులను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని ‘కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్’ నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలల పాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి ‘ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంజర్’ నాటకంలో నటించింది. ఆ నాటకానికి దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొనే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యా సంస్థలలో, బ్లాక్ థియేటరులోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది. 1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది. ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలంగాణ విప్లవ తేజం కాళోజీ” - నవంబర్ 13... కాళోజీ వర్ధంతి



“ఏ భాష నీది ఏమి వేషమురా, ఈ భాష ఈ వేషమెవరి కోసమురా,ఆంగ్లమందున మాటలనగానే ఇంత కుల్కెదవెందుకు రా, తెలుగు వాడివై తెలుగు రాదనుచు, సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు, సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా,”!...పర భాషలపై మోజుతో మాతృ భాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరనేది వాస్తవం. అందుకే ఆయన జయంతి ‘తెలంగాణ భాషా దినోత్సవం’ అయింది. ఎక్కడో మరాఠాల కుటుంబంలో పుట్టి, వరంగల్‌కు వచ్చి స్థిరపడి ‘నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు’ అని ఎలుగెత్తిన పోరాట యోధుడు. భయం అనేది ఎరుగని కలం వీరుడు కాళోజీ. ఆయన తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచాడు. ఎన్నో సార్లు నిజాం ప్రభుత్వం కాళోజీని వరంగల్లు నుంచి బహిష్కరించింది. “నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తు వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో ఉన్న స్టేటుమెంట్లే.” అలాంటి కలం వీరుడిని జ్ఞాపకం చేసుకుని నివాళులు అర్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914 - నవంబరు 13, 2002) “కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న” గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసినా, హక్కులడిగినా, ఉద్యమం నడిపినా, ప్రజా వాణికి ప్రతిధ్వనిగా నిలిచాయన. మొత్తంగా తెలంగాణ జీవిత చలన శీలి కాళోజి. ఆజన్మాంతం తెలంగాణ ప్రజల అన్యాయాల గురించే తపించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమ కారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది. ‘అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి...అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు’ అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ఆయన 1914, సెప్టెంబరు 9 న (కర్ణాటక) రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడపడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయిత గా ప్రఖ్యాతి గాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. ‘నా గొడవ’ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహ మాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపు కడతాయి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం, గళం ఎత్తిన ఈ శతాబ్దపు మేటి కవి కాళన్న. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్ న్యాయ పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండ లోని కాలేజియేట్ ఉన్నత పాఠశాల లోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదు లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయ రానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షర జ్యోతిని వ్యాపింప జేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహా సభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసు కుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వ విద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై, 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన “ఆంధ్ర సారస్వత పరిషత్” వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యుడు. ఆయన తెలంగాణ రచయితల సంఘం అధ్యకునిగా, 1957-61 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యునిగా ఉన్నారు. 1977లో సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పై పోటీ చేశాడు, కానీ ఓడి పోయాడు. కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. ‘హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు’ అంటూ “సామాన్యుడే నా దేవుడు” అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు. ఆయన మరణా నంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంద జేసారు. 1992లో పద్మ విభూషణ్ - భారత రెండవ అత్యున్నత పురస్కారం1972 లో తామ్రపత్ర పురస్కారంబీ 1968లో “జీవన గీత” రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారంబీ బూర్గుల రామకృష్ణా రావు మెమోరియల్ మొదటి పురస్కారంబీ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చే 1981లో సత్కారంబీ “ప్రజాకవి” బిరుదుబీ ఆంధ్ర ప్రదేశ్ లో అనేక సాహితీ సంఘాలచే సన్మానాలుబీ రామినేని ఫౌండేషన్ అవార్డుబీ గాడిచర్ల ఫౌండేషన్ అవార్డుబీ కాకతీయ విశ్వ విద్యాలయంవరంగల్ వారు 1992 లో డాక్టరేట్‌బీ 1996లో సహృదయ సాహితీ విశాఖ వారి గురజాడ అవార్డుబీ 1996లో కళసాగర్ మద్రాస్ వారి విశిష్ట పురస్కారం పొందారు. ఆయన మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులో అనువదించాడు. 1943 లోనే ఆయన కథల్ని “కాళోజీ కథలు” పేరుతో అప్పట్లో హైదరాబాదులో ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీకి చెందిన అణా గ్రంథమాల సంస్థ తన పద్నాలుగో ప్రచురణగా ప్రచురించింది. ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది. పాములపర్తి నరసింహారావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు. విశాలాంధ్ర సమస్యలు గమనించి ఆయన 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు. అన్ని సందర్భాలలో అసలుసిసలైన తెలంగాణ వాదిగా జీవించాడు. పర భాషా జ్ఞానాన్ని సంపాదించు కోవడం అవసరమే. కానీ, ఆ సాకుతో అమ్మ లాంటి మన భాషను నిర్లక్ష్యం చేయడం ఎంత తప్పు. నేటి తరం. తెలుగు పదాలనే మర్చిపోతోంది. ఈ పరిస్థితి పోవాలి. మన తేట తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి అని పరితపించాడు. తెలంగాణ పలుకు బడితో ప్రజల మాట, వ్యథలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శప్రాయం. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలుగు సినీ పరిశ్రమకు డి.వి.ఎస్. రాజు ఎనలేని సేవలు - నవంబర్ 13...డాట్ల వెంకట సూర్యనారాయణ రాజు వర్ధంతి



డాట్ల వెంకట సూర్యనారాయణ రాజు (డి.వి.ఎస్. రాజు) తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలు అమూల్యమైనవి. ఆయన ఒక ప్రఖ్యాత నిర్మాత, విజనరీ వ్యాపారవేత్త, తెలుగు సినీ పరిశ్రమకు మార్గదర్శకులు. డి.వి.ఎస్. రాజు 1928 డిసెంబర్ 13న ఆంధ్ర ప్రదేశ్‌లో తూర్పుగోదావరి జిల్లా అల్లవరంలో జన్మించారు. చిన్నప్పటి నుండే ఆయనకు సినిమాలపై ఉన్న మక్కువే ఆయనను సినీ రంగంలోకి నడిపించింది. తెలుగు సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించడంలో కీలక పాత్ర అప్పట్లో తెలుగు సినిమాల ప్రధాన కేంద్రం మద్రాస్ (ప్రస్తుతం చెన్నై)గా ఉండేది. అయితే తెలుగు సినిమాలకు ప్రత్యేకతను చాటేందుకు, తెలుగు సంస్కృతి ప్రతిబింబించేందుకు హైదరాబాద్ ఒక ముఖ్యమైన స్థలం అని డి.వి.ఎస్. రాజు భావించారు. దీంతో తెలుగు చిత్ర పరిశ్రమను మద్రాస్ నుండి హైదరాబాద్‌కు తరలించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ నిర్ణయం తరువాతి కాలంలో తెలుగు సినీ రంగాన్ని కొత్త ఎత్తులకు చేర్చింది.

**సినీ జీవిత ప్రారంభం...** ఆదిలో ప్రముఖ నిర్మాతల వద్ద సహాయకుడిగా పని చేసిన డి.వి.ఎస్. రాజు, అటు తరువాత 1960లలో తన స్వంత చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించి నిర్మాతగా తొలి అడుగులు వేశారు. ఆయన నిర్మించిన సినిమాలు తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచు కున్నాయి. సప్తపది, సంకల్పం వంటి సినిమాలు ఆయన సృజనాత్మకతకు, సినిమాటిక్ విజన్‌కు ప్రతీకలుగా నిలిచాయి. వీటిలో సప్తపది సినిమా ఆయన ప్రతిభను, సాంకేతికతను విస్తరించడంలో కీలక పాత్ర పోషించింది. విజయవంతమైన చిత్రాలు... సప్తపది: ఇది డి.వి.ఎస్. రాజు నిర్మించిన అత్యంత ప్రఖ్యాత చిత్రం, ఇది ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ పొందింది. సంకల్పం: ఈ చిత్రం కూడా విజయవంతమై తెలుగు చలనచిత్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందింది. తీన్మార్ మరియు జగన్మోహిని వంటి చిత్రాలు ఆయనకు మరింత పేరును తెచ్చాయి.

**పరిశ్రమలో పాత్ర..** డివిఎస్ రాజు ఇండియన్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు అధ్యక్షులుగా కూడా వ్యవహరించారు. ఆయన పరిశ్రమలో ఉన్న సాంకేతికత, నాణ్యత పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. తెలుగు చిత్ర పరిశ్రమను అంతర్జాతీయ స్థాయికి చేర్చడంలో డి.వి.ఎస్. రాజు పాత్ర అగ్రగణ్యమైనది.

**అవార్డులు, గౌరవాలు...** భారత ప్రభుత్వం ఆయనకు కల్పించిన అత్యున్నత గౌరవమైన పద్మశ్రీ అవార్డు ఆయన కృషికి ప్రతీక. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన సేవలకు గుర్తింపుగా నంది అవార్డును అందించింది. సినీ రంగానికి చేసిన కృషికి గుర్తింపుగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును కూడా అందుకున్నారు.

తెలుగు చలనచిత్ర రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్టాత్మక రఘుపతి వెంకయ్య అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.

**డి.వి.ఎస్. రాజు సేవలు...** హైదరాబాద్‌లో తెలుగు సినీ పరిశ్రమను స్థాపించడంలో అభివృద్ధి పరచడంలో ఆయన చేసిన కృషి నేటికీ నిలిచి వుంది. ఆయన చలనచిత్ర రంగానికి పెట్టిన సాంకేతిక మద్దతు, ప్రమాణాలకు పెట్టిన పునాదులు పరిశ్రమకు అత్యంత విలువైనవి. ఫిల్మ్ నగర్ అభివృద్ధి చెందడానికి ఆయన తీసుకున్న చర్యల వల్ల హైదరాబాద్ భారతదేశంలో అతిపెద్ద సినీ నగరాలలో ఒకటిగా నిలిచింది. డాట్ల వెంకట సూర్యనారాయణ రాజు తెలుగు సినీ పరిశ్రమలో ఒక ప్రతిష్టాత్మకమైన వ్యక్తిగా స్థిరపడ్డారు. ఆయన కృషి లేకుండా తెలుగు సినీ రంగం ప్రస్తుత స్థాయికి చేరుకునే అవకాశం చాలా తక్కువ. ఆయన జీవితం, కృషి నేటికీ కొత్త తరాల సినీ అభిమానులకు, నటీనటులకు, మరియు సాంకేతిక నిపుణులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



## అదనపు యూనిట్లు.. అందుబాటులో సేవలు

గోదావరిఖని : ప్రతి బోధనాసుపత్రిలో అదనంగా రెండు డయాలసిస్ యూనిట్లు(మిషన్లు) ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకోవడంతో అత్యవసరమైన వారికి సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహా ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, బోధనాసుపత్రుల్లో 102 రక్తశుద్ధి కేంద్రాలున్నప్పటికీ అత్యవసరమైన వారికి డయాలసిస్ సేవలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసర సమయంలో మాత్రమే వినియోగించేలా ప్రతి బోధనాసుపత్రిలో అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడంతో అత్యవసర విభాగంలో రక్తశుద్ధి సేవలు అందుబాటులోకి రానున్నాయి.


సాధారణంగా రక్తశుద్ధి కేంద్రాల్లో షిఫ్టుల వారీగా సమయాన్ని



కేటాయిస్తారు. కేటాయించిన సమయం ప్రకారం కేంద్రాలకు వచ్చి రక్తశుద్ధి చేయించుకొని వెళ్తుంటారు. ఈ సమయంలో ఎవరికైనా రక్తశుద్ధి అవసరమైతే చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. రెగ్యులర్‌గా చేయించుకునేవారిని ఆపాల్సి ఉంటుంది. ఇది వారి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారనుంది. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసరమైన వారికి మాత్రమే అదనపు యూనిట్లలో రక్తశుద్ధి చేసే అవకాశం ఉండగా రెగ్యులర్ రోగులకు ఎలాంటి ఇబ్బందులుండవు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆరు కేంద్రాల్లో 40 యూనిట్లు అందుబాటులో ఉండగా 287 మంది రెగ్యులర్‌గా రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు.

## టీకా శక్తి.. పోషకాల యుక్తి

మిర్యాలగూడ : సాధారణంగా పిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్యానికి గురవుతుంటే వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందంటారు. దీనిని పెంచేందుకు వైద్యులు మందులు సూచిస్తారు. అయితే కేవలం పిల్లలు, వృద్ధులే కాకుండా అన్ని వయసుల వారిలోనూ ఈ శక్తి తక్కువగా ఉండొచ్చు. ఇది తక్కువగా ఉన్న వారిలో వాతావరణ మార్పులు, కొత్త ఆహార పదార్థాలు తినడం తదితర సమయాల్లో తీవ్ర అనారోగ్యం, ఇన్‌ఫెక్షన్ల బారిన పడతారు. రోగనిరోధక శక్తి, టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఏటా నవంబరు 10న 'ప్రపంచ రోగనిరోధక దినోత్సవం' నిర్వహిస్తున్నారు. రోగనిరోధక శక్తి పెంచేందుకు పోషకాలతో పాటు మందులు వినియోగిస్తారు. అయితే కొన్ని రకాల వ్యాధుల నిరోధానికి ప్రత్యేకంగా కొన్ని టీకాలను తయారు చేస్తారు. పిల్లల్లో నిరోధకతను పెంచేందుకు వయసుల వారీగా జాతీయ రోగనిరోధక ప్రణాళిక,



ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ సంస్థలు సిఫారసు చేసిన టీకాలను అందిస్తారు. వీటిలో ఏటా మార్పులు చేయడం, కొత్త వ్యాధులకు టీకాలు చేర్చడం వంటివి జరగవచ్చు. ఈ టీకాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది.

**అన్ని వయస్సుల వారికి అవసరమే...**

డాక్టర్ నితిన్ ప్రసాద్ రాయ్, ఆర్బీఎస్కే వైద్యాధికారి, మిర్యాలగూడ


రోగనిరోధక శక్తి అన్ని వయసుల వారికి అవసరమే. ఇది తక్కువగా ఉండే వారిలో వాతావరణం మారిన ప్రతిసారి జలుబు, ఇన్‌ఫెక్షన్లు వంటివాటితో పాటు.. దీర్ఘకాలిక వ్యాధులు సైతం సంబవించే ప్రమాదం ఉంది. దీని కోసం సరైన వయసులో రోగనిరోధక టీకాలతో పాటు అన్ని పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి.

## భుజ బలంతోనే బాహు బిలం

నల్గొండ : వెలుగుమట్ల వద్ద 60 అడుగుల లోతుతో ప్రారంభమై మధ్యలో అత్యధికంగా 105 అడుగుల వరకు లోతు ఉండటం గమనార్హం. దీనిలో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉంటుంది.

నాడు ఆధునిక యంత్రాలు లేవు.. కొండల్ని పిండిచేసే సామగ్రి లేదు. భుజ బలమే శ్రమజీవుల ఆయుధం. తమ రెక్కల కష్టంతోనే అతి లోతైన కాల్వను తవ్వేశారు. ఏళ్లు గడుస్తున్నా అక్కడి దృశ్యాలు నేటికీ గగుర్పాటుకు గురిచేస్తూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పూర్వ ఏపీలోని ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో సాగునీటి అవసరాలు తీర్చేందుకు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా 1975లో పాలేరు చెరువు నుంచి ఏపీ నూజివీడు వరకూ కాల్వ నిర్మాణం ప్రారంభించారు. ఖమ్మం నగరానికి చేరువగా ఉన్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామం వద్ద ఎత్తైన నేలను తొలిచే క్రమంలో భాగంగా సన్నని లోతైన కాలువ (డీప్‌కట్) నిర్మాణం చేపట్టారు. వెలుగుమట్ల వద్ద నుంచి వి.వెంకటాయపాలెం గ్రామ శివారు వరకు కిలోమీటరు పొడవున దీన్ని నిర్మించారు. పూర్తిగా మానవ వనరులతోనే దీన్ని తవ్వారు. నగర, పరిసర వాసులు గతంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొన్న సమయంలో ఈ డీప్‌కట్‌లో జలాలే అవసరాలను తీర్చాయి. స్థానిక పొలాలకు మాత్రం ఈ జలాలు అందే పరిస్థితి లేకపోవటంతో రైతులు కాల్వకు ఇరువైపులా విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ డీప్‌కట్ ఆధారంగా గతంలో కొదుమూరు–వందనం, ఇటీవల మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

# సర్దు'బాట'..!



భువనగిరి : జిల్లా విద్యాశాఖలోని మిగులు ఉపాధ్యాయుల సంఖ్య తేలింది. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లు 334 మంది ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అవసరానికి మించి ఉన్న ఉపాధ్యాయులను అవసరం ఉన్న పాఠశాలల్లో గత జులై నెల నుంచి సర్దుబాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు 187 మందిని అవసరం ఉన్న పాఠశాలలకు పంపించారు.

జిల్లాకు ప్రభుత్వం 1366 ఎస్జీటీ, 1864 స్కూల్ అసిస్టెంట్లు, 163 ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1023 ఎస్జీటీ, 1660 స్కూల్ అసిస్టెంట్లు, 150 మంది ప్రధానోపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం 334 మంది సర్‌ప్లెస్‌గా ఉన్నట్లు గుర్తించారు. హిందీ, బయోసైన్స్, సోషల్ సైన్స్ ఉపాధ్యాయులు మిగులు ఉండటంతో పూర్తి స్థాయిలో సర్దుబాటు చేస్తున్నారు. గణితం, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ బోధించే వారి పోస్టులు అధికంగా ఖాళీ ఉండటంతో మిగులు ఉపాధ్యాయుల్లో ఆయా సబ్జెక్టులు బోధించే వారు లేకపోవడంతో ఇంకా మిగులు ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేకపోతుండటం గమనార్హం. అయితే మిగులు ఉపాధ్యాయుల లెక్కల్లో అశాస్త్రీయత చోటు చేసుకుందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. జీవో 25 ప్రకారం కాకుండా ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే మిగులు ఉపాధ్యాయులు ఉండరని చెబుతున్నారు.

95 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తారని నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఉన్న ఉపాధ్యాయుల్లో క్లరికల్ పనితో పాటు నివేదికలు రూపొందించేందుకు ఒక ఉపాధ్యాయుడు పూర్తిగా పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో రెండో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పుడు నాలుగు పాఠ్యాంశాల బోధన ఎలా కొనసాగుతుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

**నిరంతర ప్రక్రియ**సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగులు ఉపాధ్యాయులను అవసరాన్ని బట్టి సర్దుబాటు చేశాం. ప్రతి నెలా ఉద్యోగ విరమణలు, దీర్ఘకాలిక, అనారోగ్యంతో సెలవులు తీసుకుంటున్న ఉపాధ్యాయుల స్థానంలో అవసరం ఉన్న పక్షంలో నెలనెలా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం.

**గణాంకాలు ఇలా...**

ప్రభుత్వ పాఠశాలలు : 715

విద్యార్థులు : 38,277

మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు: 3,393

పనిచేస్తున్న వారు : 2,833

మిగులు : 334

# 'పూచీ'కత్తిమీద సామే..



ఖమ్మం : జిల్లాలో 325 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రానికి 22 కేంద్రాల్లో 229 మంది రైతుల నుంచి రూ.3.43 కోట్ల విలువైన 1435.800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 848.5 మెట్రిక్ టన్నులు మిల్లులకు రవాణా చేశారు. రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.35 లక్షలు జమ చేశారు. మరో రూ.3.08 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు అప్పగించేందుకు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. జిల్లాలో 6 బాయిల్డు, 65 రా రైస్ మిల్లులు మొత్తం 71 మిల్లులకు ధాన్యం కేటాయించాలని నిర్ణయించారు. కేటాయించిన ధాన్యం విలువలో పది శాతం సొమ్ముకు మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ పత్రాలు పౌరసరఫరాల సంస్థ అధికారులకు అప్పగించి ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ తర్వాతే మిల్లులకు ధాన్యం రవాణా చేస్తారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 20మంది మిల్లర్లు మాత్రమే బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించినట్లు తెలిసింది. మిగతావారు వెనకంజ వేస్తుండటంతో అధికారులు వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇంకోపక్క ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా మొదలయ్యాయి. కేంద్రాలకు వద్దకు వచ్చిన ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో పూర్తిగా ఆరపెట్టే పనిలో రైతులున్నారు. మరోవైపు పొరుగున ఏపీ వ్యాపారులు అక్టోబరు లోనే కల్లూరు మండలం నుంచి 10 వేల క్వింటాళ్లు పైగా ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

'ఇప్పటికే 325 కేంద్రాలు తెరిచాం. గ్యారెంటీ ఇచ్చి, ఒప్పందం చేసుకున్న మిల్లులకు ధాన్యం రవాణా చేస్తాం. చాలా ప్రాంతాల్లో వరి కోతలు మొదలు కాలేదు. ఈ నెల 15 తర్వాత కేంద్రాలకు ధాన్యం వస్తుంది. రైతులు వడ్లు ఆరబోశారు. పూర్తిగా ఆరిన తర్వాత విక్రయిస్తారు. సన్నరకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది.' చందన్‌కుమార్, డీఎస్ఓ, ఖమ్మం.

# ఆక్రమం.. ఆపై అధిక ధరలకు విక్రయం



సుల్తానాబాద్ : ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు వస్తే.. సుల్తానాబాద్‌లో అక్రమ మట్టి రవాణాదారులకు చేతినిండా పని ఉంటుంది. నీరుకుళ్ల శివారులోని సర్వే నంబర్ 51 ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు పొక్లెయిన్‌లతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా వందల ట్రిప్పుల మట్టి దోపిడీ చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వాదాయానికి గండి కొడుతూనే.. గృహ అవసరాల నిమిత్తం సామాన్యులకు అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో అధికారులెవరూ ఉండరనే ఉద్దేశంలో అక్రమ మట్టి రవాణా జోరుగా సాగింది.

**నిఘా కరవు**

ప్రభుత్వ భూములపై అధికారుల నిఘా లేకపోవడంతో కాట్నపల్లి, కోమండ్లపల్లికి చెందిన కొంత మంది బృందాలుగా ఏర్పడి పొక్లెయిన్లతో సర్వే నంబర్ 51 ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఇందుకు రెవెన్యూ, మైనింగ్ అధికారులను మచ్చిక చేసుకుంటున్నారు. పోలీసుల ముందు నుంచే మట్టి టిప్పర్లు వెళ్తున్నా తనిఖీ చేయటం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. శనివారం పగలు, రాత్రి వందల టిప్పర్ల మట్టిని ఒక వర్గం వారు సుల్తానాబాద్ పట్టణంలో గృహ అవసరాలకు అమ్ముకోగా.. మరో వర్గం పలు ప్రాంతాల్లో డంపు చేశారు. ఆదివారం సైతం ఈ తంతు యథావిధిగా కొనసాగింది. తవ్విన చోట భారీ గుంతలు ఏర్పడ్డాయి. వరదనీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఇవి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. అక్రమ మట్టి తవ్వకాలపై కొంత మంది ప్రశ్నిస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తరలిస్తున్నామని అంటున్నారు. అధికార పార్టీ నాయకుల అండాదండలు ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**కృత్రిమ కొరత సృష్టిస్తూ..**అక్రమార్కులు ఒక చోట మట్టిని డంపు చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఇలా వారం పాటు నిల్వ చేసి మట్టి దొరకడం లేదనే సాకుతో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టే వారికి అధిక ధరలకు విక్రయి స్తున్నారు. పది రోజుల క్రితం 200 క్యూబిక్ మీటర్ల మినీ టిప్పర్‌కు రూ.2700 వసూలు చేయగా.. తాజాగా రూ.3200 వరకు అమ్ముకున్నారు. రెండు రోజుల వ్యవధిలో సదరు అక్రమార్కులు 500 టిప్పర్ల మట్టిని అమ్ముకున్నట్లు సమాచారం. సుల్తానాబాద్ శివారు ప్రాంతాల్లో భారీగా మట్టి డంపులు ఉన్నాయి. కాట్నపల్లి, పూసాల, నీరుకుళ్లరోడ్డు, ఎస్సారెస్పీ డి86 కాలువల గుండా డంపులు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

## లంచాల 'బీమా'రి

సూర్యాపేట: ఆపత్కాలంలో అన్నదాతల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకంలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బాధిత రైతు కుటుంబాలు సదరు పరిహారం కోసం అవస్థలు పడుతున్నారు. రైతు మృతి చెందితే ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం ఇస్తుంది. దానికోసం వారి కుటుంబం దరఖాస్తు చేసిన వారం రోజుల్లోనే పరిహారం అందించేలా సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు చూడాలి. కానీ, కొందరు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో) కాసులు ఇచ్చిన వారి దరఖాస్తులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిసింది. చేయి తడిపితే చాలు.. మరోమాట మాట్లాడకుండా ఆన్‌లైన్ చేసి, ఉన్నతాధికారులకు నివేదికలు అందించి బాధితులకు సకాలంలో పరిహారం చెక్కు అందేలా పనులు చక్కబెడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. లేకుంటే వారి దస్త్రాన్ని ఆన్‌లైన్ చేయకుండా ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**ఇలా జరుగుతోంది**




నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్యాలయ ఖర్చుల పేరుతో రూ.2 వేల నుంచి రూ.5 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట డివిజన్ పరిధిలోని కొన్ని మండలాల్లో రూ.5 వేలు, ఇంకొన్ని మండలాల్లో రూ.10 వేల చొప్పున తీసుకుంటున్నారు. యాదాద్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే తంతు కొనసాగుతున్నట్లు తెలిసింది.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని ఓ మండలంలో మూడు నెలల కిందట రైతు మృతి చెందగా బీమా పరిహారం కోసం దరఖాస్తు చేయగా సంబంధిత అధికారి ఆన్‌లైన్ పేరుతో రూ.10 వేల డిమాండ్ చేయడంతో బాధిత కుటుంబం ఇచ్చారు.

**కార్యాలయ ఖర్చుల పేరుతో...**

డబ్బులు డిమాండ్ చేస్తున్న అధికారులు తాము పనిచేసినందుకు కాదని కార్యాలయ ఖర్చులుంటాయని కొందరు.. మీరు ఇచ్చే మామూళ్లు మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులందరికీ ఇవ్వాల్సిందేనంటూ ఇంకొందరు చెబుతున్నారు. ఇప్పటికే కుటుంబంలో ఒకరిని కోల్పోయిన బాధలో ఉన్న బాధితులు ఆ కారణాలేమి పట్టించుకోకుండా వారు అడిగినంత ముట్టజెపుతున్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో అధికారులు తమకు అనుకూలంగా ఉన్న గ్రామంలోని వ్యక్తుల ద్వారా ఒప్పందం కుదుర్చుకుని పరిహారం అందేలా పనులు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ఈ విషయమై యాదాద్రి జిల్లా వ్యవసాయాధికారి వెంకటరమాణరెడ్డిని వివరణ కోరగా మండల స్థాయిలో అధికారులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకురావాలని, వసూళ్లకు దిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## హద్దుల్లేని ఇసుక దందా..!

కోదాడ : ఇసుక అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కొత్త పోకడలతో ప్రణాళికలను అమలు చేసి రాష్ట్ర సరిహద్దులు దాటేస్తున్నారు. అధికారుల కళ్లుగప్పి నకిలీ పత్రాలు సృష్టిస్తున్న అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం దీని ప్రభావం అంతగా కనిపించడం లేదు. ఇదివరకు మూడు షిఫ్టుల్లో ముగ్గురు ఎస్సై స్థాయి అధికారుల బృందం తనిఖీలు నిర్వహించేది. కానీ ప్రస్తుతం షిఫ్టునకు ముగ్గురు కానిస్టేబుళ్లకు పరిమితం చేశారు. దీంతో తనిఖీల్లో పారదర్శకత లేకుండా పోయింది. ఉన్నతాధికారుల జోక్యం లేకపోవడంతో అధికారులు, సిబ్బంది తప్పటడుగులు వేస్తున్నారు. గతంలో ఇసుక అక్రమ రవాణాదారుల నుంచి అధిక మొత్తంలో లంచాలు తీసుకున్న ఎనిమిది మంది కానిస్టేబుళ్లు సస్పెండ్ కాగా, ఇద్దరు ఎస్సైలు, ఓ సీఐపై బదిలీ వేటు పడింది. కొన్ని రోజులు చీకటి వ్యాపారానికి తెరపడినా.. నెల రోజులుగా ఏపీ ఇసుక సరిహద్దులు దాటుతోంది.

**అర్ధరాత్రి దాటాక జోరు**

ఏపీలోని ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లోని మున్నేరు, పాలేరు వాగులు, కృష్ణా, గోదావరి నదుల నుంచి అక్రమార్కులు ఇసుకను తెలంగాణకు తరలిస్తున్నారు. ఒక రాష్ట్రంలోని ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు అధికారుల నుంచి అనుమతులు లభించవు. దీంతో అక్రమార్కులు ఏపీలోని సరిహద్దు ప్రాంతాల వరకు ఇసుకను రవాణా చేసేందుకు ఆ ప్రభుత్వానికి సెస్సు చెల్లిస్తున్నారు. అక్కడి నుంచి తెలంగాణలో తిరిగేందుకు ఇసుకాసురులు అక్రమ



మార్గాలను ఎంచుకుంటున్నారు. అనుమతులు ఉన్నాయంటూ తప్పుడు బిల్లులు, పత్రాలు చూపిస్తూ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేస్తున్న సిబ్బందికి అవగాహన లేకపోవడంతో అక్రమార్కులకు లైన్ క్లియర్ అవుతోంది. ఈనెల 4న మోతె మండలం మామిళ్లగూడెం వద్ద ఇదే తరహాలో ఆరు లారీలకు అనుమతులు ఉన్నాయంటూ నకిలీ వే బిల్లులు చూపించి పోలీసులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తుండగా పోలీసులకు చిక్కారు. గత నెలలో కోదాడ పోలీసుస్టేషన్ పరిధిలోని నల్లబండగూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నాలుగు ఇసుక లారీలను పట్టుకున్నారు.

రాష్ట్రంలోకి ప్రవేశం లేదు

ప్రతాప్ లింగం, కోదాడ గ్రామీణ సీఐ

ఏపీలోని ఇసుకను రాష్ట్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోం. అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. గత నెలలో పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలించాం. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది పకడ్బందీగా తనిఖీలు చేసేలా చర్యలు చేపడుతున్నాం.

# నకిలీ దందా.. అడ్డుకునేదుందా?

జగిత్యాల : సాగునీటి లభ్యతతో ఈ యాసంగిలోనూ జిల్లాలో గరిష్ఠ విస్తీర్ణంలో రైతులు అన్నిరకాల పంటలను సాగు చేస్తున్నారు. అక్టోబరు నుంచి వేరుసెనగ, మక్క, జొన్న, సజ్జ, ఆవాలు, పెసర, మినుము తదితర పంటలను విత్తుకుంటుండగా.. ఈ నెల రెండో వారం నుంచి వరినార్లు పోస్తారు. ఇప్పటినుంచి జనవరి నెలాఖరు వరకు వరితోపాటు.. మక్క, నువ్వులు తదితర పంటలను రైతులు పెద్దఎత్తున సాగుచేస్తారు. ఇదే తరుణంలో నకిలీ పంట ఉత్పాదకాల బారినుంచి రైతులను కాపాడేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. నకిలీ ఉత్పత్తులను అమ్మినవారిని గుర్తించి వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలి.

**ఎలాంటి బిల్లుల్లేకుండానే..**

గత సీజన్లలో జిల్లాలో చాలాచోట్ల నకిలీ సేంద్రియ ఎరువులను తరలిస్తున్న వాహనాలను అధికారులు పట్టుకున్నారు. కేవలం ఒకటి రెండుచోట్ల మాత్రమే ఇలా పట్టుబడుతుండగా.. గుట్టుగా చాలారకాలైన నకిలీ పంట ఉత్పాదకాలు రైతులను చేరి నిండా ముంచుతున్నాయి. వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు మాత్రమే తమ దుకాణాలు, గోదాముల నుంచి బిల్లులపై విక్రయాలు జరపాల్సి ఉంది. కానీ చాలామంది నకిలీ ఉత్పాదకాలను ఎలాంటి బిల్లుల్లేకుండా నేరుగా విక్రయిస్తున్నారు.

**చొరవ తీసుకుంటేనే నివారణ**

సదరు కంపెనీల ప్రతినిధులు రైతులనుంచి అడ్వాన్సులను తీసుకొని



గుట్టుగా సేంద్రియ ఎరువుల బస్తాలను సరఫరా చేస్తున్నారు. మిశ్రమ ఎరువులు, గంటగోళీలు, జింక్ సల్ఫేట్, వర్మివాష్, వర్మి కంపోస్టు, బయో ఫర్టిలైజర్స్, పోషక మందుల పేరిట నకిలీ, మోసపూరిత ఉత్పత్తులను రైతులకు అంటగడుతున్నారు. కొన్నిచోట్ల నకిలీ ఉల్లి, మిరప, కూరగాయల విత్తనాలు.. కలుపు నివారణ రసాయనాలను నేరుగా విక్రయిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని ఎఫ్‌పీవోలు, రైతు సంఘాలు, అభ్యుదయ రైతులను అప్రమత్తంచేసి నకిలీల అమ్మకాలను అరికట్టాల్సి ఉంది.

**సమాచారమివ్వండి**

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పోషకాలు, కలుపు నివారణ రసాయనాలు సహా అన్నిరకాల పంట ఉత్పాదకాలను వ్యవసాయశాఖ అనుమతి ఉన్న దుకాణాల్లోనే కొనాలి. తప్పనిసరిగా బిల్లులను తీసుకొని పంట పూర్తయ్యేవరకు వాటిని భద్రపరచాలి. బిల్లులివ్వకుండా నేరుగా జీరోగా విక్రయించే వాటిని కొనుగోలు చేయొద్దు. విక్రయాలపై తగిన సమాచారమిస్తే వారిపై పోలీసు కేసులు నమోదు చేయిస్తాం.
భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

# అక్రమిద్దాం.. అమ్మేసుకుందాం

కోరుట్ల : స్థిరాస్తి వ్యాపారులు యథేచ్ఛగా అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ భూములు, ఎస్సారెస్పీ కాలువలు, నాలాలు, రోడ్లను ఆక్రమిస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శివారులోంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) ప్రధాన కాలువ ప్రవహిస్తుంది. దానికున్న డీ-36 కాలువ ద్వారా పెద్దాపూర్, చింతలపట, కిషన్‌రావుపల్లె, తిమ్మాయి పల్లె, కోరుట్ల పట్టణ శివారు ప్రాంతం గుండా ప్రవహించి వ్యవసాయ భూములకు 40 ఏళ్లకుపైగా సాగు నీరందిస్తుంది. కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్ వద్దకు చేరిన డీ-36 కాలువకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములను కొంతకాలంగా స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేశారు.

**చదునుచేసి కలిపేసుకొని**

ఎస్సారెస్పీ కాలువకు ఇరువైపులా 33 అడుగుల వెడల్పుగల భూమిని చదును చేసి కలిపేసుకున్నారు. ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేపట్టారు. కొన్నిచోట్ల కాలువ భూమిలో పునాదులు, ప్రహరీ నిర్మించారు. కాలువకు ఇరువైపులా ఉన్న 33 అడుగుల వెడల్పు రోడ్డు పూర్తిగా కుంచించుకుపోయి రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. కల్లూర్ రోడ్డులోని రహదారి నుంచి



పాతమాదాపూర్ రోడ్డు వరకు సుమారు కిలోమీటరు పొడవునా కాలువ నామారూపాలు లేకుండా పోయింది.

**నీరంతా వృథా**

మూడేళ్ల క్రితం డీ-36 కాలువను ఆధునీకరించడంతో కాలువలో సమృద్ధిగా నీరు కింది ప్రాంతానికి ప్రవహించేది. కల్లూర్‌రోడ్ వద్ద ఎస్సారెస్పీ నీరు ప్రవహించేందుకు కాలువ లేకపోవడంతో ఇరువైపులా ఉన్న ఖాళీ భూముల్లో వృథాగా పారుతోంది. కాలువకు దగ్గర్లోనున్న ఓ కాలనీల్లోకి ఎస్సారెస్పీ నీరు చేరి రోడ్లు జలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంట కాలువలో నీరు ప్రవహించిన రోజులు.. సాగు నీరు వృథాగా పోవడంతోపాటు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఆక్రమణకు గురైన ఎస్సారెస్పీ కాలువను యథావిధిగా తీయించి, ఇరువైపులా భూమిని రోడ్డుగా మార్చాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

# బస్ పాట్లు.. బాస్ చివాట్లు




హైదరాబాద్ : నగరంలో సుదూర ప్రాంతాలకు రెండు లేదా మూడు బస్సులు మారాల్సి వస్తోంది. నిత్యం మూడు గంటలు ప్రయాణానికే వెచ్చించాల్సి వస్తోందని, వర్షం కురిస్తే, ట్రాఫిక్‌తో ఆలస్యమైతే ఆఫీసులో చివాట్లు తప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. సుదూర మార్గాల్లో ఒకే బస్సు సర్వీసు నడపాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.


**ప్రయాణికులు కోరుతున్న సర్వీసులు**

మెహిదీపట్నం నుంచి బాచుపల్లి వయా ఆల్విన్ కాలనీ, మియాపూర్ క్రాస్ రోడ్స్
మీర్‌పేట్ నుంచి సికింద్రాబాద్ మార్గంలో వయా కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ మీదుగా బస్సులు నడపాలి.
తార్నాక నుంచి మెహిదీపట్నం
అఫ్జల్‌గంజ్ నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్
హయత్‌నగర్ నుంచి కేపీహెచ్‌బీ కాలనీ
బోరబండ నుంచి కూకట్‌పల్లి, మేడ్చల్, పటాన్‌చెరు, వేవ్‌రాక్
మల్లాపూర్, నాచారం నుంచి ఎల్బీనగర్ మీదుగా బస్సులు నడిపితే చర్లపల్లి రైల్వేస్టేషన్ వెళ్లేవారికి వెసులుబాటు ఉంటుంది.
ఐటీ ఉద్యోగుల కోసం సుచిత్ర నుంచి హైటెక్ సిటీ
ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి మియాపూర్ వయా కొండాపూర్

వరుస ట్రిప్పులు: ఆర్టీసీ కొన్ని మార్గాల్లో వరుసగా సర్వీసులను నడుపుతోంది. సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరు మార్గంలో 1400 ట్రిప్పులు.. మెహిదీపట్నం నుంచి ఉప్పల్ 950.. సికింద్రాబాద్ - కొండాపూర్ 650.. సికింద్రాబాద్ - మేడ్చల్ 600.. చార్మినార్ నుంచి సికింద్రాబాద్ మార్గంలో 550 ట్రిప్పులు నడుపుతోంది.

# తెప్పలపై.. ఇసుక తిప్పలు

మోతె : ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగులో ఇసుక కోసం తెప్పలతో వేట సాగిస్తున్నారు మండలంలోని నర్సింహాపురం మత్స్యకారులు. ఉర్లుగొండ-నర్సింహాపురం గ్రామాల మధ్య వంతెన సమీపంలో ఇరువైపులా పదడుగుల లోతున ప్రవహిస్తున్న నీటిలో ప్రమాదకర పరిస్థితుల్లో మునిగి ఇసుక తీస్తున్నారు.
వాగులో చేపల వేటకు ఉపయోగించే తెప్పలపై వెళ్లి.. ప్లాస్టిక్ తట్టల్లో నింపుకుని ఒడ్డుకు చేరి పై రెండు గ్రామాల మధ్యనున్న వంతెనపై కుప్పలు పోసి విక్రయిస్తున్నారు. ఏటికి అవతల ఉన్న నర్సింహాపురం గ్రామస్థులు ఈ దందాలో ఆరితేరారు. సుమారు 22 ట్రాక్టర్లు అక్రమ ఇసుక రవాణాకే వినియోగిస్తున్నారు. ఇలా ఒడ్డున పోసిన ఒక్కో ట్రాక్టరు ఇసుకను రూ. 3 వేల వరకు సదరు వ్యక్తులు ట్రాక్టరు యజమానులకు విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకను వీరు రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు దూరాన్ని బట్టి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.
ప్రధాన రహదారిలోని వంతెనపై కుప్పలు పోస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. నియంత్రించాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



ఈ విషయాన్ని తహసీల్దార్ వెంకన్న దృష్టికి తీసుకెళ్లగా.. అనుమతు లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# విదేశాల్లో ఉద్యోగం కావాలా?



మేడిపల్లి : నకిలీ ఏజెంట్ల బారిన పడి గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న యువత రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్)ను ఉపయోగించుకోవచ్చు. గల్ఫ్ సహా పలు దేశాల్లో ఉద్యోగావకాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థను ఏర్పాటు చేసింది. ఏజెంట్ల మోసాలు లేకుండా దరఖాస్తుదారులు మధ్యవర్తుల ద్వారా మోసపోకుండా ఈ సంస్థ పని చేస్తుంది. అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి వివిధ దేశాల్లో ఉద్యోగాల్లో కుదురుకునేలా తోడ్పాటు అందిస్తోంది.

**టామ్‌కామ్ ద్వారా ఈ దేశాలకు వెళ్తున్నారు..**

సౌదీ అరేబియా, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, ఖతర్, కువైట్ సహా ఇటీవల జర్మనీ, జపాన్, పోర్చుగల్, ఇజ్రాయిల్ దేశాలకు నైపుణ్యం కలిగిన వారిని టామ్‌కామ్ పంపుతోంది. ఆయా దేశాల సంస్థలు ఉద్యోగ నియామకాల కోసం టామ్‌కామ్‌ను సంప్రదిస్తున్నాయి.

**వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే..**

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబింగ్, ఫార్మా, నర్సింగ్, బిల్డింగ్ వర్క్ తదితర విభాగాల్లో నైపుణ్యం కలిగిన వారిని టామ్‌కామ్ ఎంపిక చేస్తుంది. ఆయా దేశాల్లో ఖాళీలను బట్టి టామ్‌కామ్ దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసిన వారికి అర్హతలను బట్టి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఇటీవల జర్మనీ, ఇజ్రాయిల్ తదితర దేశాల్లో ఉద్యోగ ఖాళీల కోసం టామ్‌కామ్ దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఈ సర్టిఫికెట్ విదేశాల్లోనూ గుర్తింపు ఉండటంతో సులువుగా ఎంపిక జరుగుతోంది.

**శిక్షణకూ అవకాశం**

జర్మనీ, జపాన్ దేశాలకు ఎంపికైన వారికి ఆయా దేశాల భాషలు నేర్పించి పంపిస్తారు. హైదరాబాద్‌లో ఇందుకోసం శిక్షణ ఇస్తారు. ఇందుకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన దేశాల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆంగ్లభాషలో కనీస పరిజ్ఞానం ఉంటే సరిపోతుంది. అది కూడా తక్కువ ఉన్నవారికి జిల్లా కేంద్రాల్లోనే ఆంగ్లంలో శిక్షణ ఇచ్చి వివిధ దేశాలకు పంపుతున్నారు.
వెబ్‌సైట్ : %www.tomcom.telangana.gov.in

**దరఖాస్తు చేసుకుంటే ఆహ్వానం**

నైపుణ్యం కలిగిన వారు విదేశాల్లో ఉద్యోగం కోసం టామ్‌కామ్ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఖాళీలు, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను బట్టి దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తారు. కొన్నిసార్లు ప్రత్యేక శిబిరాల ద్వారా నియామక ప్రక్రియ చేపడతారు. మరికొన్ని సార్లు అర్హతలను బట్టి నేరుగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో నియమిస్తారు. దళారుల ప్రమేయం లేకుండా మంచి ఉద్యోగం కోరుకునే వారికి టామ్‌కామ్ వారధిలా పనిచేస్తుంది.
సత్యమ్మ, నోడల్ అధికారి, టామ్‌కామ్

# పేదల కడుపు కొడుతున్నారు!

భగత్‌నగర్ : జిల్లాలోని కొందరు రేషన్ డీలర్లు బియ్యం తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. కొన్నేళ్లుగా జిల్లావ్యాప్తంగా డీలర్ల మోసాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మోసంపై నిలదీస్తే.. ఉచితంగా వచ్చే బియ్యానికి గొడవెందుకు చేస్తున్నారని, మండల స్థాయి బియ్యం నిల్వల కేంద్రం నుంచి తూకం వేయకుండా తక్కువ ఇస్తుండటంతో తామే నష్టపోతున్నామంటూ బుకాయిస్తున్నట్లు తెలుస్తోంది.

**రిమోట్‌తో బరువు నియంత్రిస్తూ..**

గోనె సంచుల మోసంతోపాటు తెలివిగా తూకం యంత్రాల్లో ఆధునిక చిప్‌లు బిగించి వాటిని రిమోట్ ద్వారా నియంత్రిస్తూ బరువు ఎక్కువ చేసి చూపిస్తున్నారు మరికొందరు. కిలో నుంచి రెండు కిలోల వరకు తక్కువ తూకం వేస్తున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. తూనికలు కొలతల శాఖాధికారులు ప్రతి రేషన్ దుకాణంలోని యంత్రాన్ని పరిశీలించాల్సి ఉండగా పట్టించుకున్నవారే లేరు. డీలర్లు అడ్డూఅదుపు లేకుండా సాంకేతికతతో కొత్త మోసాలకు తెరదీస్తూ ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని దండుకుంటున్నారు.
**గోనె సంచితో తూకం వేసి..** సన్న బియ్యం పంపిణీ చేస్తున్నప్పటి నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వరుస కడుతున్నారు. లబ్ధిదారుడు తీసుకొచ్చిన ప్లాస్టిక్ సంచితో తూకం వేయాల్సి ఉండగా, కొందరు ప్రభుత్వం నుంచి బియ్యం సరఫరాకు ఉపయోగించిన జనపనార(గోనె) సంచితో తూకం వేస్తున్నారు. ఈ సంచి సుమారు 550 గ్రాములు ఉంటుంది. ఇలా ప్రతి కుటుంబానికి సరఫరా చేసిన బియ్యంలో అర కిలో తక్కువగా వెళుతుంది. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా ప్రతి నెల సుమారు 1,72,225 కిలోల బియ్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది.
**దుకాణంలోనే కొనుగోలు** ఇటీవల మంజూరైన రేషన్ కార్డుల్లో కొందరు



ఆర్థికంగా స్థిరపడ్డవారూ ఉన్నారు. వీరు బియ్యం తీసుకొని తినకుండా అదే పౌరసరఫరాల దుకాణంలో డీలర్‌కు అమ్ముతున్నారు. మధ్య తరగతి కుటుంబాలు కూడా ఇలాగే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తీరును ఆసరాగా తీసుకున్న డీలర్లు లబ్ధిదారుల నుంచి కిలోకు రూ. 15 చొప్పున బియ్యం కొనుగోలు చేస్తూ నల్ల బజారుకు తరలిస్తున్నారు.
**తనిఖీలు చేయిస్తా..** రేషన్ బియ్యం గోనె సంచులతో తూకం వేయొద్దు. లబ్ధిదారులు తీసుకొచ్చిన సంచులలోనే తూకం వేయాలి. దీనిపై విచారణ చేయిస్తా. తూకం యంత్రాలను రిమోట్ సహాయంతో ఆపరేట్ చేస్తున్నారన్న విషయం నాకు తెలియదు. యంత్రాలను తనిఖీ చేయాలని తూనికలు కొలతల శాఖాధికారులకు లేఖ రాస్తాను.

# అసంపూర్తి పనులు.. ఎన్నాళ్లీ అవస్థలు

వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంలోని రోడ్డు ఇది. ఇక్కడి నుంచి నాలుగు వందల మీటర్‌ల వరకు రోడ్డు నిర్మాణం ఆగిపోవడంతో మట్టి రోడ్డుతో ఇబ్బందులు తప్పడం లేదు. కాలువలు తొలగించడంతో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. భారీ వాహనాలొస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అంబేడ్కర్‌నగర్‌లో విస్తరించిన రహదారి ఇది. ఇరువైపులా మురుగు కాలువలు తొలగించారు. నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా మంజూరుకు నోచుకోలేదు. డివైడర్ నిర్మించాల్సి ఉంది. రోడ్డుపై చేరిన దుమ్మును తొలగించకపోవడంతో వాహనాల వేగానికి ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు.
అభివృద్ధిపై ఆశగా ఎదురుచూసిన జనాలకు అసంపూర్తి పనులు 'దారి'ద్ర్యంగా మారాయి. వీర్నపల్లి మండల కేంద్రంలో రహదారి విస్తరణ అసంపూర్తిగా నిలిచిపోయింది. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తవకపోవడంతో అటు జనాలు.. ఇటు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కదలిక లేని పనులతో తిప్పలు తప్పడం లేదు.

**రూ. 25 కోట్లు మంజూరైనా..**



వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల నుంచి తూకమర్రె వాగు వరకు ఉన్న ఒక వరస రహదారిని విస్తరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.
ఎల్లారెడ్డిపేట నుంచి మరిమడ్ల వరకు వంతెనలు, వీర్నపల్లిలో రహదారి విస్తరణకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. దీనికోసం రూ. 25 కోట్లు మంజూరయ్యాయి.
1.6 కిలోమీటర్‌ల వ్యవధిలో 80 ఇళ్లు పాక్షికంగా దెబ్బతింటున్నాయి. రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలని భావించారు కానీ.. ఇంటి యజమానుల ఆందోళనలతో నాలుగుసార్లు కొలతలను తగ్గించారు. బాధితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని 52 అడుగుల మేర విస్తరణకు ఒప్పించి తీర్మానం చేశారు.
అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల నుంచి సుభాష్‌నగర్ అమరవీరుల స్తూపం వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. స్తూపం వద్ద నుంచి తూకమర్రె వరకు విస్తరించే క్రమంలో ఇంటి యజమానులు పనులను అడ్డుకున్నారు.
400 మీటర్‌ల మేర ఆగిన రహదారి విస్తరణ ఏడాదిన్నర కావొస్తున్నా కదలిక లేదు. ప్రజాప్రతినిధుల హామీతో ఇళ్లు తొలగించి నిర్మించుకున్న వారికి బిల్లులు మంజూరు కావడం లేదు.

# అరణ్యంలో 'ఆడపులులు'

దేవరకొండ : ఈ చిత్రంలో కన్పిస్తున్న ఆటో ఇటీవల నల్లమల అటవీ ప్రాంతంలోనిది. వేటగాళ్లు అడవి పందులను వేటాడి ఆటోలో తరలిస్తున్న సమాచారం తెలుసుకొని.. దేవరకొండ మహిళా అటవీశాఖాధికారి శ్రీదేవి తన సిబ్బందితో కలిసి ఆటోను వెంబడించి పట్టుకొని కేసు నమోదు చేశారు.
ఒకప్పుడు మహిళలు వంటింటికే పరిమితమయ్యేవారు. కానీ ఇప్పుడు సాఫ్ట్‌వేర్ కొలువులు చేస్తున్నారు.. అంతరిక్షంలోకి వెళ్తున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తూ.. అడవి సంరక్షణ బాధ్యతల్ని సైతం వారి భుజాన వేసుకుంటున్నారు. క్రూరమృగాలు, చిరుత పులులు తిరిగే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ.. వేటగాళ్లు, స్మగర్ల బారి నుంచి వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. ప్రాణాలు లెక్కచేయకుండా అడవిలో ఆడపులుల్లా తిరుగుతూ జంతువుల, పులుల కదలికలను కనిపెడుతున్నారు. భారతదేశంలో అతి పెద్ద అరణ్యాల్లో రెండోస్థానంలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతం కృష్ణపట్టి ఏరియాల్లో ధైర్య సాహసాలతో ముందుకెళ్తున్నారు మహిళా అటవీ ఉద్యోగులు.

**ధైర్య సాహసాలతో ముందుకు...**

రాష్ట్రంలో అత్యంత దట్టమైన అడవుల్లో నల్లమల అటవీ ప్రాంతం ఒకటి. కృష్ణ పరివాహక ప్రాంతంలో నల్లమల అటవీ ప్రాంతం ఉమ్మడి రాష్ట్రమైన గుంటూరు, ప్రకాశం, కర్నూలు, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాలను ఆవరించి ఉంది. ఇక్కడ ప్రాథమిక అంచనా ప్రకారం చిరుతపులులు 26, ఎలుగుబంట్లు 50 వరకు, రేసుకుక్కలు 105 వరకున్నాయి. పులుల ఆనవాళ్లు లేవు. దీంతోపాటు చుక్కల దుప్పి, నెమలి, మనుబోతు, ముళ్లపంది, కొండగొర్రెలు తదితర వన్యప్రాణులు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటి సంరక్షణలో మహిళా ఉద్యోగులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నిత్యం విధి నిర్వహణలో మగవారికి దీటుగా ప్రాణాలు లెక్కచేయకుండా 11 మంది మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కడో చోట చిరుతపులులు, ఎలుగుబంట్లు వారికి ఎదురైనా వెనకడుగు వేయకుండా పగలు, రాత్రుళ్లు పనిచేస్తూ జంతువుల సంరక్షణలో ముందుంటున్నారు.

**నిత్యం పర్యవేక్షణ**



సంగీత, నాగార్జునసాగర్ డీఎఫ్‌వో
నల్లమల ప్రాంతానికి సంబంధించి నాగార్జునసాగర్ డివిజన్‌లో దేవరకొండ, కంబాలపల్లి అడవి విస్తరించి ఉంది. వీటిలో మహిళా బీట్ ఆఫీసర్లు, సెక్షన్ అధికారులు, ఇన్‌ఛార్జి ఎఫ్‌ఆర్‌వో ప్రతి నిత్యం అడవి సంరక్షణ కోసం పనిచేస్తున్నాం. ఉదయం, రాత్రి నిఘా పెంచుతున్నాం.

**అనుక్షణం రక్షణ**

శ్రీదేవి, ఇన్‌ఛార్జిఎఫ్‌ఆర్‌వో, దేవరకొండ
నల్లమల అటవీ ప్రాం తంలో పనిచేస్తూ నిత్యం మొక్కలు, జంతువుల సంరక్షణలో ఉంటాం. తమకు ప్రతినిత్యం ఎక్కడో చోట జంతువులు ఎదురవుతూనే ఉంటాయి. భయపడకుండా విధులు నిర్వహిస్తున్నాం.
అటవీ విస్తీర్ణం: 26785 హెక్టార్లు
ఫారెస్టు బీట్లు: 28
బీట్, డీఎఫ్‌వో, ఇన్‌ఛార్జి ఎఫ్‌ఆర్‌వో, సెక్షన్ అధికారులు కలిపి మహిళా అటవీ ఉద్యోగులు: 11 (నల్గొండ జిల్లాలో)

చురకలు



# ఇందిరమ్మ పేరు.. ఇసుకాసురుల తీరు

రామడుగు: రామడుగు పరిధి గుండా ప్రవహించే మోతెవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నామని చెబుతూ.. సమీప మండలాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోరిటపల్లి, వన్నారం, రామడుగు, రుద్రారం తదితర గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఈ దందా సాగుతోంది.

**మూడు మండలాలకు తరలిస్తూ..**

గత జూన్ వరకు రామడుగు మండలంలో 750 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే మోతెవాగు నుంచి సేకరించే ఇసుకకు అధికారులు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ఇదే అదనుగా అక్రమార్కులు కొత్తపల్లి, గంగాధర, పెగడపల్లి మండలాలకు తరలించి అధిక ధరకు విక్రయించుకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సమీప మండలాలకు తరలిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

**పడిపోయిన భూగర్భ జలాల మట్టం**

ఇసుక అంతరించి భూగర్భ జలాల మట్టం పడిపోతుందని రైతులు వాపోతున్నారు. గతంలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసేందుకు మైనింగ్ శాఖ అధికారులు సర్వే చేశారు. కానీ ఇసుక అక్రమ రవాణాదారులు



స్థానికులను పురమాయించి క్వారీ ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. మరోవైపు డ్రైవర్లు అతి వేగంగా వెళ్తుండటంతో గ్రామాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**అధికారుల కళ్లు గప్పి..**

ఇసుక నింపిన ట్రాక్టర్ మోతె వాగు నుంచి బయలుదేరిన స్థలం నుంచి గమ్యం చేరేవరకు సెల్‌ఫోన్ల ద్వారా అక్రమ వ్యవహారాన్ని అధికారుల కంట పడకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం 25 క్యూబిక్ మీటర్ల(10ట్రాక్టర్ల) ఇసుకను అనుమతించింది. ఈ లెక్కన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన నెల రోజుల్లోనే రామడుగు మండలానికి సరిపడా ఇసుక రవాణా పూర్తవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ అక్రమ రవాణా అరికట్టాలని మోతె వాగు పరిసర రైతులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ రాజేశ్వరిని వివరణ కోరగా.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల అవసరాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఇసుక టోకెన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు.

# గంటలో వైద్యం.. ప్రాణాలు భద్రం

గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో రహదారి ప్రమాదాల్లో సగటున రోజుకు ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోతున్నారు. నిత్యం ఏదో ఒక చోట రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గాయపడ్డ వారికి గంట వ్యవధిలో అత్యవసర చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుంది. ఏదైనా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో వైద్య సేవలందించేందుకు 'ట్రామా' కేంద్రాలు పనిచేస్తాయి. సురక్షితమైన భవిష్యత్తు నిర్మించాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

**ప్రతి 25 కి.మీ.కు ఒకటి**

హైవేలు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో ప్రతి 25 కి.మీ.కు ఒక ట్రామా కేంద్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. దీని వల్ల ప్రమాదం ఎక్కడ జరిగినా కేవలం అరగంట వ్యవధిలోనే ట్రామా కేంద్రానికి క్షతగాత్రులను చేర్చే అవకాశం ఉంటుంది. ట్రామా కేంద్రంలో అత్యవసర చికిత్సకు సంబంధించిన వైద్య సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటంతో ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుంది.

**ప్రమాద తీవ్రత ఆధారంగా చికిత్స**

ప్రమాదాలు చోటుచేసుకునే సమయంలో చాలా సందర్భాల్లో అవయవాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. తీవ్రరక్తస్రావం కావడంతో పాటు ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడతారు. ఆ సమయంలో వైద్యం అందించేందుకు అందుబాటులో ఆస్పత్రులు ఉండవు. ఒకవేళ ఉన్నా అందులో అధునాతన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు ఉండరు. ఇలాంటి సమయాల్లోనే ట్రామా కేంద్రాలు ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో అత్యవసర చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంది.

**క్రిటికల్ కేర్‌తోనే సరి**

అత్యవసర వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. గోదావరిఖని, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించేందుకు పనులు తుది దశకు చేరుకొన్నాయి. సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంకా క్రిటికల్ కేర్ సేవలు అందించేందుకు పనులు మొదలు పెట్టలేదు.

**ఉమ్మడి జిల్లాలో ఒక్క కేంద్రం లేదు**

ఉమ్మడి జిల్లాలో ఒక్క ట్రామా కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. గుండ్లపల్లి నుంచి గోదావరిఖని వరకు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మీదుగా రాజీవ్ రహదారి 100 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇటు కరీంనగర్ నుంచి వరంగల్ వరకు 65 కిలోమీటర్లు, జగిత్యాల నుంచి కరీంనగర్, మెట్‌పల్లి నుంచి జగిత్యాల, కరీంనగర్ నుంచి సిరిసిల్ల, జగిత్యాల నుంచి రాయపట్నం వరకు ప్రధాన రహదారులున్నాయి. కరీంనగర్ నుంచి చొప్పదండి మీదుగా రాయపట్నం వరకు ప్రధాన రహదారి ఉంది. పెద్దపల్లి నుంచి మంథని వరకు ఉన్న రహదారుల్లో ఒక్క కూడా ట్రామా కేంద్రం లేదు. కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్, జగిత్యాల జిల్లాలో వెల్గటూరు వద్ద ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు.

**మన చేతుల్లోనే**

కారు డ్రైవింగ్ చేసే సమయంలో సీటుబెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి మద్యం తాగి, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపకూడదుఅపసవ్య దిశలో ప్రయాణం చేయొద్దు

# పీలిస్తే రోగాలే!



జవహర్‌నగర్ : జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ప్రజల ప్రాణాలు హరించుకుపోతున్నాయి. పరిసర ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకుని పీల్చేగాలి విషంగా మారిపోతుంది. బతకడం గగనంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా డంపింగ్ యార్డు కాలుష్యం నుంచి ఉపశమనం లభించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడటం లేదు. నగరంలోని కోటిన్నర ప్రజల నుంచి వచ్చే చెత్తను ఒకే ఒక్క డంపింగ్ యార్డుతో నెట్టుకొస్తున్నారు.

తీవ్ర ప్రభావిత ప్రాంతాలు

కీసర, కాప్రా, ఘట్‌కేసర్, ఉప్పల్ మండల పరిధిలోని సుమారు 20 ప్రాంతాలకుపైగా డంపింగ్ యార్డు కాలుష్యంతో కొట్టుమిట్టాడుతున్నాయి. జవహర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, ప్రగతినగర్, కార్మికనగర్, రాజీవ్‌గాంధీనగర్, మల్కారం, గబ్బిలాలపేట, చీర్యాల, హరిదాస్‌పల్లి, తిమ్మాయిపల్లి, అహ్మద్‌గూడ, బండ్లగూడ, రాజీవ్ స్వగృహ, డబుల్‌బెడ్ రూం నివాసాలు, దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది.

రాత్రిళ్లు విషవాయువులతో సతమతం.. యార్డు నుంచి రాత్రిళ్లు గాఢమైన దుర్గంధం వెలువడుతోందని పరిసర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సామర్థ్యం తగ్గిపోవడంతో ఇబ్బందులు పెరుగుతున్నాయి. పక్కనే ఉన్న మరో గుట్టపై తాజాగా వ్యర్థాలను వేస్తున్నారు. వాయు కాలుష్య తీవ్రత అధికమవుతుంది. దుర్వాసనలతో ఊపిరి పీల్చలేని పరిస్థితి. చర్మ సంబంధిత వ్యాధులు, శ్వాసకోస ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**దోమలు, ఈగల బెడద ఎక్కువైంది– అరుణ, గబ్బిలాలపేట**

ఇటీవల దోమలు, ఈగలు ఎక్కువయ్యాయి. డంపింగ్ యార్డు నుంచి తీవ్ర దుర్గంధం వస్తుంది. రాత్రిళ్లు కనీసం నిద్రపోలేని పరిస్థితి. అటు మున్సిపల్ అధికారులు, డంపింగ్ యార్డు నిర్వాహకులు మా సమస్యలు పట్టించుకోవడం లేదు.

**పదుల సంఖ్యలో బాధితులు వస్తున్నారు– డా.విజయ్, వైద్యాధికారి, ఆరోగ్యకేంద్రం**

డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల నుంచి శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరం బాధితులు పదుల సంఖ్యలో నిత్యం ఆసుపత్రికి వస్తున్నారు. తీవ్రమైన చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న కేసులు ఇటీవల గుర్తించాం. విషవాయువుల గాఢత ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ఉపశమన చర్యలు తీసుకునేలా చూస్తాం– వసంత, మున్సిపల్ కమిషనర్**

రాంకీ, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపశమన చర్యలు తీసుకునేలా చూస్తాం. రాత్రిళ్లు విష రసాయనాలు వెలువడుతున్నాయని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి.

# రూ.కోట్లు వెచ్చించి.. నిర్వహణ విస్మరించి..




పరిగి : పల్లెల్లో పచ్చదనం– పరిశుభ్రత పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లను సమకూర్చింది. ఇందుకోసం రూ.కోట్లలో వెచ్చించి వాటిని కొన్నది. సర్పంచుల పదవీకాలం ముగిసిన తరవాత వాటి నిర్వహణ గాడి తప్పింది. అసలైన లక్ష్యాన్ని విస్మరించి ఇతర పనులకు వాడుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. గతంలో యాలాల, పెద్దేముల్ మండలాల్లో కొన్ని ట్రాక్టర్లు ఇసుక తరలించగా.. వికారాబాద్ ప్రాంతంలో కరెంటు స్తంభాలను పాతడానికి వినియోగించుకున్నారు. పరిగి ప్రాంతంలో వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారు. అప్పట్లో కొందరు సర్పంచులు సైతం నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరించారు. ఇప్పటికీ గ్రామాల్లో జరుగుతున్న విందులకు సంబంధించిన పనులకు వినియోగిస్తున్నారు.

**జీపీఎస్ విధానంతో మేలు..**

పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని పంచాయతీల్లో ప్రతినెలా సుమారు 90– 100 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడితేనే పల్లెలు పరిశుభ్రంగా తయారవుతాయి. పురపాలికల్లో ఇప్పటికే గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) విధానాన్ని అమలు చేస్తున్నారు. పంచాయతీల్లోనూ వీటిని వ్యక్తిగత అవసరాలకు వినియోగించకుండా ఉండేందుకు ఇది ఎంతగానో దోహదపడనుంది.

**పేరుకుపోతున్న బకాయిలు..**

పంచాయతీ ట్రాక్టర్లపై ఉన్న రుణాలకు సంబంధించిన బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రతినెలా ఒక్కో పంచాయతీ రూ.10వేల దాకా చెల్లించాలి. 18 నెలలుగా బకాయిలు పేరుకుపోయాయి. డీజిల్ పోసేందుకూ కాసులు లేకపోవడం, నిర్వహణ లోపంతోనూ అవి ఉన్నచోటే పాడవుతున్నాయి. వాటి నిర్వహణకు ప్రతినెలా రూ.5– 10వేల దాకా ఖర్చు చేయాల్సి ఉంది. ఆశించిన మేరకు సెస్సులు వసూలు కాకపోవడం, వచ్చిన వాటితోనే పారిశుద్ధ్య కార్మికుల జీతభత్యాలతో నెట్టుకొస్తున్నారు.

**వ్యక్తిగతంగా వాడుకుంటే చర్యలు తప్పవు..– పి.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి** పంచాయతీ ట్రాక్టర్లను వ్యక్తిగతంగా వినియోగించుకుంటే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. వాటి పర్యవేక్షణ బాధ్యత గ్రామ కార్యదర్శులదే. పంచాయతీలకు నిధులు విడుదలయ్యాక జీపీఎస్‌ను అమలు చేస్తాం.

# వరి కోతలు.. వర్రీ లేకుండా కొనుగోలు!



వికారాబాద్ : కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయించడం ఒక ఎత్తయితే, ధాన్యం డబ్బులు రైతుల చేతికందడం మరో ఎత్తు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో అన్నదాతల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, పలు కారణాలతో ఈ హామీ ఆచరణలో అమలు కావడం లేదు. జాప్యం లేకుండా డబ్బులు అందించేందుకు జిల్లా పౌర సరఫరాలశాఖ చర్యలు తీసుకుంటోంది. దీంతో రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ప్రయోజనం కలుగనుంది. **తప్పనున్న ఇబ్బందులు...**

పాత విధానంతో రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో చెల్లించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఏ చిన్న సమస్యకైనా హైదరాబాద్‌కు వెళ్లి పరిష్కరించుకోవాల్సి ఉండేది. ఈ క్రమంలో ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యేవారు. ప్రస్తుతం కొనుగోళ్లు, చెల్లింపుల వ్యవహారాలను ఆయా జిల్లాలకే ఇవ్వడంతో వరి రైతులకు అవస్థలు తప్పనున్నాయి.

**1.52 లక్షల ఎకరాల్లో సాగు**

వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.52 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. డీసీఎంఎస్, ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల(పీఏసీఎస్) ఆధ్వర్యంలో కేంద్రాలు పని చేస్తాయి. ధాన్యం కొనుగోలు చేసిన నిర్వాహకులు ట్యాబ్లెట్ పీసీల ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌కు పంపుతారు. ఆయన పరిశీలించి విడుదల చేస్తారు. ఇందుకోసం పౌర సరఫరాల కార్యాలయంలో ప్రత్యేక కంప్యూటర్లు, ఆపరేటర్లను నియమించుకొని అంతర్జాల సౌకర్యాన్ని సమకూర్చుకున్నారు. తేమ యంత్రం సాయంతో ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,389, 'బీ' గ్రేడ్‌కు రూ.2,369 మద్దతు ధర చెల్లించనున్నారు.

**జాప్యం లేకుండా డబ్బులు జమ...– మోహనకృష్ణ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్**వరి కోత, నూర్పిళ్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. మరో 20 రోజుల్లో కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురానున్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ డబ్బులను ప్రభుత్వ మార్గదర్శకాలకు జమ చేస్తాం.

# వెలుగుల పర్వం.. రక్షణే కీలకం

జగిత్యాల : దీపావళి అంటేనే బాణసంచా వెలుగులు. చిన్నాపెద్దా ఆనందంగా జరుపుకొనే పండగకు టపాకాయల కొనుగోళు భారీగా జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా ఏటా దాదాపు 50 తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. జగిత్యాలలో 30, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, మల్యాల తదితర ప్రాంతాల్లో కలిపి మరో 20 దుకాణాల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 45 వరకు దరఖాస్తులు రాగా మరిన్ని వచ్చే అవకాశం ఉంది. ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు దుకాణాల ద్వారా బాణసంచా విక్రయాలు జరపనున్నారు

**ఏటా రూ.2 కోట్ల వ్యాపారం**

పండగ సమయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొనే దుకాణాలతో పాటు శాశ్వత విక్రయాల కోసం జగిత్యాలలో 4, కోరుట్లలో 1, మెట్‌పల్లిలో 1 చొప్పున బాణసంచా దుకాణాలున్నాయి. అన్ని చోట్లా కలిపి ఏటా దాదాపు రూ.2 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. దీపావళిని మూడు రోజుల పాటు జరుపుకుంటారు. వీటితో పాటు దుకాణాలు, ఇళ్లలో లక్ష్మీ పూజలు నిర్వహిస్తారు. ఈ వేడుక సమయంలో భారీగా బాణసంచా కాలుస్తారు. పండగ సందర్భంగా టపాకాయల కొనుగోలు కోసం పట్టణాల్లో ఒక్కసారిగా జనం వచ్చే అవకాశం ఉండగా అగ్ని ప్రమాద నివారణ చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. పట్టణాల్లో జనావాసాలకు దూరంగా క్రీడా మైదానాల్లో తాత్కాలిక టెంట్లలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.



**ఇవీ నిబంధనలు**

అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం తాత్కాలిక దుకాణం కోసం రేకులతో షెడ్డు వేసుకోవాలి.

దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి. అయితే పక్కపక్కనే ఏర్పాటు చేస్తుండటం ప్రమాదకరంగా మారింది.

ప్రతి దుకాణం ముందు 100 లీటర్ల నీళ్ల డ్రమ్ము అందుబాటులో ఉంచాలి. ఇసుకతో నింపిన బకెట్ ఉండాలి. దుకాణంలో సిగరెట్, బీడీలు తాగరాదు.

విద్యుత్తు లైట్లు దుకాణంలో కాకుండా ముందు భాగంగా ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన ఉన్నా నిర్వాహకులు పాటించడం లేదు.

దుకాణాల వద్ద అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచుతున్నా మిగతా నిబంధనల అమలుపై పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

తాత్కాలిక దుకాణాల్లో రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రమాద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**నిరంతరం పర్యవేక్షిస్తాం**

–సైదులు, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి

జిల్లాలో నిబంధనలు పాటించని టపాకాయల విక్రయదారులపై చర్యలు తీసుకుంటాం. దుకాణాల వద్ద నీళ్ల డ్రమ్ము, ఇసుక బస్తా అందుబాటులో ఉంచాలి. రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో దుకాణం లోపలికి తక్కువ మందినే అనుమతించాలి. నిర్వహణపై మేం నిరంతరం పర్యవేక్షిస్తాం. టోకు దుకాణాలను మరోసారి పరిశీలించి నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# చక్కెర పరిశ్రమలో మట్టి దొంగలు

మల్లాపూర్: మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర పరిశ్రమకు చెందిన స్థలంలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎకరాలకొద్దీ భూమిలో మట్టి తవ్వుతూ రవాణా చేస్తున్నా చర్యలు తీసుకోకపోవడం సందేహాలకు తావిస్తోంది. పదేళ్లుగా లేఆఫ్ కారణంగా పరిశ్రమను మూసివేశారు. క్వార్టర్ల వెనుక పరిశ్రమకు చెందిన భూములున్నాయి. అందులో నుంచి కొందరు మట్టిని తరలిస్తుండగా మరికొందరు భూమిని చదును చేసి సాగు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు గానీ, పరిశ్రమ యాజమాన్యం గానీ పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రింబవళ్లు దర్జాగా..**

పరిశ్రమ పరిధిలో ప్రస్తుతం 204ఎకరాల భూమి ఉంది. ఇందులోనే పరిశ్రమతో పాటు రహదారికి ఉత్తరం వైపు క్వార్టర్లు నిర్మించారు. వాటి వెనకాల దాదాపు 60 ఎకరాల వరకు ఖాళీ స్థలం ఉంది. రహదారికి దూరంగా ఉండటం, నిర్మానుష్యంగా ఉండటంతో రాత్రింబవళ్లు హుస్సేన్‌నగర్ వైపు డి–29 కాలువ వైపు నుంచి మట్టిని తరలిస్తున్నారు.

**సూత్రధారులు ఎవరు?**



పరిశ్రమకు చెందిన దాదాపు మూడు ఎకరాల భూమి నుంచి నిత్యం వేల ట్రిప్పుల మట్టిని తరలిస్తుండటంతో ఆ ప్రాంతం చెరువును తలపిస్తోంది. ఒక్కో చోట 4 మీటర్ల లోతు వరకు మట్టిని పొక్లెయిన్లతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించడంతో భారీగా గోతులు ఏర్పడ్డాయి. రోజుల తరబడి మట్టి తరలిస్తున్నా అధికారులు 'మామూలు'గా తీసుకోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఇటీవల మొరానికి ఏర్పడిన డిమాండ్ దృష్ట్యా పలువురు అక్రమార్కులు రేయింబవళ్లు మట్టిని తరలిస్తున్నారు.

పరిశ్రమ పరిధిలోని ముత్యంపేట, వేంపేట, చిట్టాపూర్, యుసుఫ్‌నగర్ గ్రామాలకు మట్టిని తరలిస్తున్నారు.

పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. మట్టి దందా వెనుక సూత్రధారులు ఎవరు? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం

–ప్రవీణ్, ఇన్‌ఛార్జి మేనేజర్, ముత్యంపేట పరిశ్రమ

మట్టి తరలింపుపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశాం. వారు పట్టించుకోకపోవడంతో శివారు గ్రామాల వారు తరలిస్తున్నారు. అక్రమార్కులను గుర్తించి కేసులు పెట్టినా తీరు మార్చుకోవడం లేదు.

## పెరిగిన ధరలు.. వ్యాధుల బెంబేలు

పలమనేరు : పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు అనూహ్యంగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గూళ్ల ధర ప్రస్తుతం కిలో రూ.720 పలుకుతోంది. వారం రోజుల నుంచి ఈ ధరలో ఏమాత్రం తగ్గుదల లేదు. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల వాతావరణ మార్పులతో పట్టుపురుగులకు తెగుళ్లు సోకడంతో చనిపోతున్నాయని.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**9కి 3 మాత్రమే..**ధర అశాజనకంగా ఉన్నా.. పట్టు పురుగులకు మాత్రం వ్యాధుల బాధ తప్పటం లేదు. ప్రస్తుతం మస్కాడిన్ అనే(సున్నపు కట్టు) వ్యాధి పురుగులకు సోకుతోంది. చాలా చోట్ల ఈ వ్యాధి



కారణంగా పట్టు పురుగులు చనిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. పలమనేరు మార్కెట్‌కు నిత్యం 9 టన్నులు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం మూడు టన్నులకే పరిమితమైంది.

**జాగ్రత్త పాటించాలి..**

షెడ్లలో తగిన ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలని.. పట్టు పురుగులున్న బెడ్లలో తేమ లేకుండా చూడాలని ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

## నిండి.. అడుగంటి

బంగారుపాళ్యం : తుంబ ప్రాజెక్టు నిండినా.. రైతన్నలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.. ఆ ప్రాజెక్టు మరమ్మతులకు అటవీశాఖ దశాబ్ద కాలంగా మోకాలడ్డుతోంది.. బంగారుపాళ్యంలోని తుంబపాళ్యం అటవీ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టు రెండువేల ఎకరాల విస్తీర్ణంలోని ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. తుంబపాళ్యం అటవీ ప్రాంతంలో పదేళ్ల క్రితం తుంబ ప్రాజెక్టు(కొత్తచెరువు) నిర్మించారు. దీనికి రెండు వైపులా సుమారు రెండు కిలోమీటర్ల పైగా కాలువలు నిర్మించారు. అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు తూము(గేట్) కొట్టుకుపోయింది. అప్పటి నుంచి వర్షాలకు వచ్చిన నీరు ఈ ప్రాజెక్టులో నిల్వ ఉండక వృథాగా పోతోంది. తెదేపా హయాంలో ప్రాజెక్టు మరమ్మతులకు జపాన్ నిధులు రూ.2.50 కోట్లు



మంజూరయ్యాయి. తర్వాత అధికారంలోని వచ్చిన వైకాపా ప్రభుత్వం హయాంలో కడపకు చెందిన గుత్తేదారు.. మరమ్మతులు చేపట్టగా ఇది తమ పరిధిలో ఉందని అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. అప్పటి అటవీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ సమస్యను అసలు పట్టించుకో లేదు. నిధులు మంజూరైనా ప్రయోజనం లేకపోయింది.

**మరమ్మతులు చేపడితేనే..**

తుంబపాళ్యం, ఈచనేరపల్లె, పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం, నల్లంగాడు కోటూరు సదకుప్పం గ్రామ పంచాయతీల పరిధిలోని ఆయకట్టు భూములతో పాటు చెరువుల్లో నీటిమట్టం పెరుగుతోంది. ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవ చూపి అటవీశాఖ అటవీశాఖ సమన్వయంతో తుంబ ప్రాజెక్టు మరమర్మతులు చేపట్టాలని, తద్వారా తమ కష్టాలు తీర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

## కూలి అందుకుని.. గుట్టుగా జారుకుని

నంద్యాల : ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో నమోదైన పలువురు దీనికి దూరంగా ఉంటున్నారు. గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో రావడం లేదు.

**క్షేత్రస్థాయిలో కానరాక..**

ఉమ్మడి జిల్లాలో సుమారు 4 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 66, నంద్యాల జిల్లాలో 72 శాతం ఈకేవైసీ పూర్తైనట్లు చెబుతున్నా వాస్తవంగా అంతకన్నా తక్కువగానే ఉంది. శ్రామికులుగా దస్త్రాల్లో చూపినవారి జాడ క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. వీరు పనులకు రాకున్నప్పటికీ వేతనాలు మాత్రం అందుకోవడం గమనార్హం.

**రూ.కోట్లు పక్కదారి**

కర్నూలు జిల్లాలో పత్తికొండ, కోసిగి, మద్దికెర, నందవరం, కోడుమూరు, హాలహర్వి, దేవనకొండ, కృష్ణగిరి తదితర మండలాల్లో, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కోవెలకుంట్ల, గోస్పాడు, వెలుగోడు, ఆత్మకూరు, గడివేముల తదితర మండలాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

**విషయం బయటపడుతుందని..**

ఉపాధి హామీ పథకంలో భాగంగా చేయని పనులు చేసినట్లు కొన్నిచోట్ల నమోదు చేశారు. పనికి రాకున్నప్పటికీ వచ్చినట్లు చాలా ప్రాంతాల్లో దొంగ మస్టర్లు వేశారు. పని ప్రదేశంలో అందరినీ గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమలులోకి తెచ్చినప్పటికీ దొంగ మస్టర్లకు మాత్రం అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్ల కిందట కేవలం హాజరు పట్టిక మాత్రమే ఉండగా.. అక్రమాలు భారీగా జరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చేస్తున్నవారి పేర్లతోనూ రెండు జిల్లాల్లోని పలు గ్రామాల్లో నమోదు చేసి వేతనాలు స్వాహా చేశారు. సోషల్ ఆడిట్‌లో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

**ఈకేవైసీ పూర్తైతేనే..**

ఈకేవైసీ పూర్తైన తర్వాత వీరికి పనులు కల్పిస్తారు. పని జరిగే ప్రాంతంలో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది.

జాబ్‌కార్డు ఉండి పనులకు రాని కొందరు ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈకేవైసీ చేయించుకుంటే గతంలో చేసిన తప్పులు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో గుట్టుగా జారుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈకేవైసీ పూర్తి కానివారు 2 లక్షల మందికిపైగా ఉన్నారు. వీరి వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

జాబ్‌కార్డులు తీసుకున్న కుటుంబాలు

హాజరవుతున్న కుటుంబాలు పనులు చేస్తున్నవారు

# స్వర్ణ పంచాయతీకి మకిలీ!



కంభం: గ్రామపంచాయతీల్లో సాధారణ నిధులు దుర్వినియోగమవుతున్న నేపథ్యంలో ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియలో పారదర్శకతకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. పంచాయతీల వారీగా ప్రతి ఆస్తికి కేటాయించిన ఇంటి పన్ను అసెస్‌మెంట్ నంబరుతోపాటు యజమాని చరవాణి సంఖ్యను అనుసంధానం చేయాలి. తద్వారా ఇంటి పన్ను బకాయిల నుంచి చెల్లించాల్సిన వివరాలు నేరుగా ఇంటి యజమాని చరవాణికి వాట్సాఫ్‌కు సమాచారం పంపిస్తారు. అనంతరం పన్ను బకాయిలు చెల్లించాక కూడా రసీదు వాట్సాప్‌కు వెళ్లనుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా జమ చేసిన నగదు కూడా పంచాయతీ ఖాతాకు జమవుతోంది. ఈ విధానం పూర్తిగా అమల్లోకి వస్తే ఇంటి, నీటి పన్ను చెల్లింపుల విధానంలో పారదర్శకత రానుంది. పోర్టల్‌లో నమోదు ప్రక్రియంతా గతేడాదిగా కార్యదర్శులతోపాటు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. క్షేత్రస్థాయిలో కొన్ని గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించకుండానే అందుబాటులో ఉన్న చరవాణి సంఖ్యలను అనుసంధానం చేసేశారు.

**వెలుగులోకి తప్పులు...**

పంచాయతీరాజ్‌శాఖ 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌లో పన్నుల చెల్లింపు వివరాలు పరిశీలిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తప్పులు వెలుగులోకి వచ్చాయి. కార్యదర్శుల నిర్లక్ష్యంతో జిల్లాల వారీగా చోటుచేసుకున్న తప్పులను జిల్లా పంచాయతీ కార్యాలయానికి పంపించారు. జిల్లావ్యాప్తంగా వందలాది అసెస్‌మెంట్లకు ఒకే చరవాణి సంఖ్య లింక్ చేసినట్లు గుర్తించారు. ప్రతి జిల్లాలోనూ అత్యధికంగా తప్పులు చేసిన ఒక కార్యదర్శిని ఇప్పటికే సస్పెన్షన్ చేయగా, మరికొందరికి తాఖీదులు జారీ చేశారు. అసెస్‌మెంట్ల వారీగా అనుసంధానమైన చరవాణి సంఖ్యను పరిశీలించి దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. **4,75,474 అసెస్‌మెంట్లు...**జిల్లాలోని 38 మండలాల పరిధిలో 729 గ్రామ పంచాయతీలు న్నాయి.మొత్తం 4,75,474 అసెస్‌మెంట్లు ఉండగాబీ వీటికి సదరు యాజమాని చరవాణి సంఖ్య అనుసంధానం చేశారు. తాళ్లూరు మండలం తురకపాలెం పంచాయతీలో మొత్తం 608 అసెస్‌మెంట్లు ఉండగా, 583 ఆస్తులకు ఒకే చరవాణి సంఖ్యను అనుసంధానం చేసినట్లు అధికారులు గుర్తించారు. వైపాలెం మండలం వి.గంగపాలెంలో 891 అసెస్‌మెం ట్లకు 505, తాళ్లూరు మండలం శివరాంపురంలో 954 అసెస్‌మెంట్లకు 476 అసెస్‌మెంట్లదీ ఇదే పరిస్థితి. పొదిలి మండలం మల్లవరంలో 340 అసెస్‌మెంట్లు ఉండగా, పోర్టల్‌లో మొత్తం వివరాలే తొలగించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లును ఇప్పటికే సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# పంట నష్టం.. లెక్కింపు ముఖ్యం



కంభం: మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సోమవారం కేంద్ర బృందం జిల్లాలోని ఎన్‌కేపాడు, కొత్తపట్నంలలో పర్యటించబోతోంది. ఈ సందర్భంగా పశ్చిమ ప్రకాశంలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను కూడా బృందం పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

**27 మండలాల్లో 516.98 హెక్టార్లలో నష్టం**

నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల్లో నష్టపోయిన పంటలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించి నష్టం అంచనా వేయనున్నారు. జిల్లాలోని 27 మండలాల్లో ఉద్యాన పంటలైన మిరప, టమాట, అరటి, పసుపు, కూరగాయలు, పూలు, ఉల్లి, జామ, బొప్పాయి, తదితర పంటలు 516.98 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 959 మంది ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అత్యధికంగా త్రిపురాంతకం మండలంలో 152.58, దోర్నాల 93.03, వై.పాలెం 43.59, పెద్దారవీడు 40 హెక్టార్లలో ఎక్కువగా పంటలకు నష్టం వాటిల్లింది.

**4,5 తేదీల్లో కురిసిన వర్షానికి పొలాల్లోనే నీరు**

అర్థవీడు మండలంలోని వెలగలపాయ, గన్నేపల్లి, మాగుటూరు, కాకర్ల తదితర గ్రామాల్లో మొంథా తుపాను తర్వాత ఈ నెల 4, 5న కురిసిన వర్షానికి మిరప, టమాట పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లోనే నీరు నిలిచి ఉంది. ఆయా గ్రామాల్లో మళ్లీ కురిసిన వానలకు సుమారు 150 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. గుండ్లకమ్మ ప్రవాహం కొనసాగుతుండడంతో పశ్చిమ ప్రాంతంలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కంభం చెరువు అలుగు 13 రోజుల నుంచి పారుతుండడంతో పలు పంటల పైనుంచే ప్రవాహం వెళ్తోంది.దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

ఈ నెల 4, 5 తేదీల్లో కురిసిన వర్షానికి సాగులో ఉన్న మిరప, టమాట పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. ఉన్నతాధికారులకు ఇప్పటికే ఈ విషయం తెలియజేశాం.శ్వేత, ఉద్యానశాఖ అధికారిణి, కంభం, గిద్దలూరు

# ఖాళీగా ఉంచారు.. రూ.కోట్లు మింగారు



కర్నూలు : కర్నూలు నగరంలోని బళ్లారి రోడ్డులో రేడియో స్టేషన్ వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఏపీ ఎస్‌డబ్ల్యూసీ) గోదాములు గత ఐదేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ గోదాములను గత ప్రభుత్వ హయాంలో అద్దెకు కూడా ఇవ్వకుండా నిరుపయోగంగా మార్చారు. రేషన్ బియ్యం నిల్వకు అవకాశం ఉన్నా.. వీటిలోకి తరలించకుండా నాయకులు పావులు కదిపారు. ఈ గోదాము సమీపంలోనే పదేళ్లుగా ఓ ప్రైవేటు గోదామును పౌర సరఫరాల సంస్థ అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం బఫర్ స్టాక్ నిల్వ చేస్తోంది. పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన దీనికి నెలకు రూ.10 లక్షల మేర అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. ఐదేళ్ల పాటు గోదాములను ఖాళీగా ఉంచడంతో ఎస్‌డబ్ల్యూసీకి రూ.3.60 కోట్ల నష్టం జరిగింది.

**ప్రైవేటులో నిల్వ చేసి..**ప్రైవేటు గోదాముల్లో రేషన్ బియ్యం నిల్వ చేయడంతో గతంలో అనేక అక్రమాలు జరిగాయి. బియ్యాన్ని పెద్దఎత్తున బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఆదోనిలోని ఓ ప్రైవేటు గోదాములో బఫర్ స్టాక్ నిల్వలు ఉంచారు. ఎఫ్‌సీఐ గోదాములున్నా.. వైకాపా ప్రభుత్వంలో నేతల అండదండలతో ప్రైవేటు గోదాముల్లోనే బియ్యం నిల్వలు ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థ గోదాముల్లోనే రేషన్ బియ్యం నిల్వ ఉంచాలని ఆదేశించింది. ఇకపై ఎస్‌డబ్ల్యూసీ గోదాములను వినియోగించనున్నా రు. ఫలితంగా రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది.

**ఎట్టకేలకు వినియోగించుకునేలా..**జిల్లాకు ప్రతినెలా నాలుగు వ్యాగన్ల రేషన్ బియ్యం వస్తోంది. వీటిలో రెండు వ్యాగన్లను ప్రైవేటు గోదాములో, మరో రెండు వ్యాగన్ల బియ్యాన్ని ఎస్‌డబ్ల్యూసీ గోదాములో నిల్వ చేసేందుకు రంగం సిద్ధమైంది. రేడియోస్టేషన్ సమీపంలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాము ఆవరణను ఆదివారం శుభ్రం చేయించారు. ఇటీవల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వారం రోజుల్లో ఈ గోదాముల్లో 5 నుంచి 6 వేల టన్నుల నిల్వలు ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆదుకునేనా.. ఆదరవయ్యేనా!

పెదపాడు : తుపానులు, ప్రకృతి విపత్తుల కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటలు అన్నదాతల చేతికందడం లేదు. ఏటా నష్టాలు ఎదురైనా, పెట్టుబడులు దక్కకున్నా.. ప్రత్యామ్నాయ ఆలోచన లేకుండా సాగు వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది అక్టోబరు చివరి వారంలో విరుచుకుపడిన మొంథా తుపానుతో స్వర్ణ రకం వరి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు.



**అత్యధికంగా ఉంగుటూరులో..**తుపాను కారణంగా ఉంగుటూరు మండలంలో అత్యధికంగా సుమారు వెయ్యి ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. దెందులూరు 629, పెదపాడు 336, పెదవేగి 255 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తేల్చారు. క్షేత్ర స్థాయిలో నష్ట తీవ్రత మరింత ఎక్కువే ఉందని రైతులు చెబుతున్నారు. 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితేనే నష్టపరిహారం దక్కుతుందని అధికారులు చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. **ఆశలన్నీ వారిపైనే..**జిల్లాలో కేంద్ర బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో.. రైతులు ఆశలన్నీ వారిపైనే పెట్టుకున్నారు. షెడ్యూల్ ప్రకారం కేవలం అర గంట మాత్రమే పంట నష్టాన్ని పరిశీలించనున్నారు. కేంద్ర బృందం రైతులను ఆదుకొని ఆదరవుగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## రాకపోకలకు ఆయ'కట్ట'మే

నంద్యాల: ఉమ్మడి జిల్లాలో పంట పొలాలకు వెళ్లే ఆయకట్టు రోడ్లు ఛిద్రమయ్యాయి. దశాబ్దాల తరబడి వీటిని పట్టించుకోకపోవడం.. నిర్వహణ కరవవడంతో అధ్వానంగా మారింది. కనీసం రైతులు నడిచేందుకు వీలులేని విధంగా మారింది. ఇటీవల మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి.

తెలుగుగంగ ఆయకట్టు పరిధిలోని వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే రహదారులు రూపు కోల్పోయాయి. ప్రత్యేకించి నల్లరేగడి భూముల్లో సమస్య తీవ్రంగా ఉంది. లక్షకుపైగా ఎకరాలు సాగులో ఉండగా.. భారీ వర్షాల కారణంగా లింకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. కేసీ కాలువ ఆయకట్టు పరిధిలోని బండిఆత్మకూరు, నంద్యాల, గోస్పాడు, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లో పెద్దఎత్తున వరి సాగవుతోంది. ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు తమ పొలాలకు ఎరువులు తరలించలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సార్బీసీ ఆయకట్టు పరిధిలోని పాణ్యం, బనగానపల్లి, కోవెలకుంట్ల, సంజామల, అవుకు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ, కేసీ పరిధిలో వరి కోతకు సిద్ధమైంది. కొన్ని ప్రాంతాల్లో చివరి విడతగా ఎరువులు వేస్తున్నారు. పొలాలకు వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఆయకట్టు రోడ్లే. ఇవి బురదతో నిండిపోయాయి.

**అదనపు ఖర్చులతో...**

తెలుగుగంగ ఆయకట్టు పరిధిలో గాజులపల్లె-బసవాపురం, మహానంది-శ్రీనగరం, తిమ్మాపురం-కృష్ణనంది మార్గంలో 9 వేల ఆయకట్టు ఉంది. పొలాలకు వెళ్లే లింకు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ పొలాల్లో పనులకు రావాలంటే కూలీలు ఎక్కువ అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు వ్యయం పెరిగిందని.. ఈ క్రమంలో ఆయకట్టు రహదారులు అధ్వానంగా ఉండటంతో ఖర్చు మరింత ఎక్కువైందని పేర్కొంటున్నారు.

**నిధుల్లేక.. నిర్వహణ కానరాక**

మార్కెట్ యార్డులకు వసూలయ్యే సెస్సులో 10 శాతం నిధులను ఆయకట్టు రోడ్లకు కేటాయించాలన్న నిబంధన ఉంది. రెండు దశాబ్దాలుగా జరగడం లేదు. గ్రావెల్ తోలడంతోపాటు మెటల్ చిప్స్ లాంటివి వేస్తే గుంతలు పడడం.. వర్షాలకు రహదారులు కోతకు గురవడం లాంటివి ఉండవు. మరోవైపు ఇటీవల కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సాగునీటి సంఘాలు ఏర్పడ్డాయి. ఈ కమిటీలకు నిధులు కేటాయించి పనులు చేయించొచ్చు.. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## ఆ'దారం' తెగుతోంది

ఎమ్మిగనూరు : నేత కార్మికులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పట్టు మగ్గాలపై ఆధారపడిన కార్మికులు, మాస్టరు వీవర్లకు ఇప్పుడు కొత్త సమస్య ఎదురైంది. పట్టు చీరల తయారీకి ఉపయోగించే వార్పు, సప్పూరి ధరలు మూడు నెలల వ్యవధిలో కిలోకు రూ.1,200కుపైగా పెరిగింది. పట్టు ఉత్పత్తి తగ్గడంతో ముడి పట్టుకు డిమాండు ఏర్పడింది. జిల్లాలో చేనేత మగ్గాలకు అవసరమైన ముడిసరకు రాక తగ్గిపోయింది. వాస్తవంగా ధర్మవరం, హిందూపురం, బెంగళూరు నుంచి ఎమ్మిగనూరు, కోడుమూరుకు చెందిన వ్యాపారులు పట్టు దారాలను అధికంగా దిగుమతి చేసుకునేవారు. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో ఉత్పత్తయ్యే చోటు నుంచి మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో ధర్మవరం తర్వాత ఎమ్మిగనూరులో ఎక్కువమంది నేతన్నలు ఉన్నారు.

జీవనంపై ప్రభావం జిల్లాలో అత్యధికంగా ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, నందవరం, నాగలదిన్నె, కోసిగి గుడేకల్లు, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో పట్టుతో నేసే మగ్గాలు ఉన్నాయి. వీరంతా మాస్టరు వీవర్స్ కింద నేస్తున్నారు. తెలంగాణలోని గద్వాల, ఎమ్మిగనూరు, కోడుమూరు పరిధిలో 400 మంది వ్యాపారులు ఉన్నట్లు అంచనా. వీరంతా ముడి సరకును బెంగళూరు, చీరాల, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తుంటారు. జిల్లాలో 17 వేలకుపైగా పట్టు మగ్గాలు ఉన్నట్లు అంచనా. ధరలు పెరగడంతో మగ్గాల సంఖ్య తగ్గుతోంది. కార్మికులకు ఒక చీర నేసేందుకు వారం నుంచి 16 రోజులు పడుతుంది. కూలీ రూ.1,200 నుంచి రూ.8 వేల వరకు అందుతుంది. జిల్లాలో 300కుపైగా మగ్గాలు తగ్గినట్లు అంచనా. ఈ నేపథ్యంలో కార్మికుల జీవనం దయనీయంగా మారుతోంది.

జిల్లాలో మొత్తం మగ్గాలు 17 వేలు ఒక చీరకు అవసరమైన పట్టు 700 గ్రాములునెలకు అవసరమైన ముడి పట్టు 68 వేల కిలోలు

నెలకు ఒక మగ్గంపై పట్టుచీరల ఉత్పత్తి సరాసరిన 6

నెలకు అవసరమైన పట్టుదారం 38,250 కిలోలు

ప్రస్తుతం కిలో ముడిపట్టు ధర రూ.6,400

మూడు నెలల కిందటి ధర రూ.5,200

# రూ.5 వేల కోట్లతో రెండు వరుసల రైల్వేలైన్

గుంతకల్లు: కేంద్ర ప్రభుత్వం అత్యవసర పనుల జాబితాలో చేర్చి మరో రెండు వరుసల రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధించి సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి పంపాలని ఆదేశించింది. దీంతో గుంతకల్లు డివిజన్ అధికారులు ఆయా సర్వే నివేదికను పూర్తి చేసి నాలుగు రోజుల కిందట రైల్వే బోర్డుకు పంపారు. లైన్ల నిర్మాణానికి రూ. 5 వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు సర్వే నివేదికలో పొందుపర్చారు. రైల్వే లైన్ల పనులకు సంబంధించి గుంతకల్లులోని గేజ్‌కన్వర్షన్ (నిర్మాణాలు) డిప్యూటీ చీఫ్ ఇంజినీరు కార్యాలయానికి చెందిన ఇంజినీర్లు సర్వే చేశారు. గుంతకల్లు డివిజన్ పరిధిలోని గుంతకల్లు- వాడి, గుంతకల్లు - రేణిగుంట, గుంతకల్లు - బళ్లారి సెక్షన్లలో ప్రస్తుతం రెండు వసుల లైన్లు ఉన్నాయి. వీటికి సమాంతరంగా మరో రెండు నిర్మించాలన్న యోచనలో ఉన్నారు. తద్వారా ప్రయాణికుల రైళ్లు, సరకులు, ఖనిజాలను రవాణా చేసే గూడ్సుల రాకపోకల కోసం వేర్వేరుగా ఏర్పాట్లు సమకూరుతాయి.

**ప్రయాణికుల రైళ్లకు వెసులుబాటు**

డివిజన్‌లో గుంతకల్లు- వాడి మధ్య (228.32 కి.మీ.లు), గుంతకల్లు



- రేణిగుంట (305.24 కి.మీ.లు), గుంతకల్లు-బళ్లారి మధ్య (48.66 కి.మీ.లు) పొడవునా ప్రస్తుతం రెండు వరుసల లైన్లు ఉన్నాయి. ఈ మార్గాల్లోనే మరో రెండు లైన్లను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉండడంతో ప్రయాణికుల రైళ్లు, గూడ్సులు సకాలంలో వెళ్లడానికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీన్ని అధిగమించడానికే రైల్వే బోర్డు సమాయత్తమవుతోంది. ప్రభుత్వం ఆయా పనులను త్వరగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో సర్వే పూర్తి చేయాలని సూచించడంతో అధికారులు నివేదిక పంపారు. అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

# హడ్కో సాయం.. టిడ్కోలో కదలికలు

హిందూపురం : ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లకు వచ్చే నెల నుంచి కదలికలు రానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో మొదటి విడత కింద కదిరి, ధర్మవరం, పుట్టపర్తిలో పూర్తయిన ఇళ్లను ప్రభుత్వం త్వరలో లబ్ధిదారులకు అప్పగించనుంది. వీటికి అవసరమైన నిధులు అందించడానికి హడ్కో ముందుకు వచ్చింది. మొదటి విడత ఇళ్ల పంపిణీ పూర్తి కాగానే రెండో విడతలో హిందూపురంతోపాటు జిల్లాలో వివిధ దశల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి మార్చిలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించనున్నారు. ఏడేళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గత వైకాపా పాలనలో వీటిపై ఆశలు సన్నగిల్లినా.. కూటమి ప్రభుత్వం చొరవతో మళ్లీ లబ్ధిదారుల్లో చిగురించనున్నాయి.

మున్సిపాలిటీ : హిందూపురం

డబ్బు చెల్లించిన లబ్ధిదారులు : 2,736



ఇళ్ల కేటాయింపు : 2,516

బ్యాంకుల్లో రుణం పొందినవారు : 380హిందూపురం సమీపంలోని కొటిపి వద్ద జీప్లస్-3 విధానంలో టిడ్కో ఇళ్లు ప్రారంభం కాగా దాదాపు నాలుగు బ్లాకుల్లో 85 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి కిటికీలు, తలుపులు, టైల్స్ ఏర్పాటు చేసి విద్యుత్తు, నీటి సౌకర్యం అందిస్తే వంద శాతం పనులు పూర్తవుతాయి. ఈమేరకు పురపాలక సంఘం అధికారులు మొదటి విడత ఇళ్ల పంపిణీ జరిగిన వెంటనే రెండో విడత కింద పనులు ప్రారంభించేందుకు సిద్ధమవు తున్నారు.

**వచ్చే నెల నుంచి పనులు: మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం** ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూరైన చోట వచ్చే నెలలో వాటిని ప్రభుత్వం లబ్ధిదారులకు అందించనుంది. ఈ కార్యక్రమం పూర్తికాగానే రెండో విడత కింద అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. ఈ పనులు 2026, మార్చికి పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందిచనుంది.

# నట్టేట ముంచిన నాసిరకం విత్తనం

ఉరవకొండ : పత్తి రైతులను నాసిరకం విత్తనం కుదేలు చేసింది. వజ్రకరూరు మండలం ధర్మపురి గ్రామానికి చెందిన కేశవరెడ్డి 14 ఎకరాల్లో, రామిరెడ్డి, ఆయన సోదరుడు హనుమంతురెడ్డి నీటి కుంటల ఆధారంగా 25 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కాయ దశలో ఉంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ.60 వేలు చొప్పున 39 ఎకరాలకుగాను రూ.24 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెప్పారు. పంట బాగా పెరిగి, ఒక్కో



మొక్కకు 60-70 కాయలు రావడంతో సంతోషించారు. అయితే కాయ పగలకుండా నల్లగా మారి, ఎండిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కానరాలేదు. ఏమి చేయాలో అర్థం కాక, పెట్టుబడి పెట్టలేక రైతులు 39 ఎకరాల్లో పత్తి పంటను ట్రాక్టర్లతో దున్ని తొలగించారు. చేతికి వచ్చిన పంట నోటికి అందకుండపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉరవకొండ వ్యవసాయ శాఖ ఏడీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా రైతులు పూర్తి వివరాలు తెలిపితే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. పంట నష్టానికి ప్రధాన కారణాన్ని అన్వేషించే ప్రయత్నం చేస్తాం. నాసిరకం విత్తనం అని తేలితే చర్యలకు ప్రతిపాదిస్తామన్నారు.

# మాతృవందన.. అమ్మలకందేనా!



అనంతపురం : ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పేద గర్భిణులకు ఒక వరం. కేంద్రం రూ.5 వేలు, రాష్ట్ర ప్రభుత్వం జననీ సురక్ష యోజన (జేఎస్‌వై) కింద మరో రూ.వెయ్యి కలిపి మొత్తం రూ.6 వేలు ప్రోత్సాహకం కింద చెల్లిస్తారు. తల్లీబిడ్డకు మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించడం.. పోషణ లోపాన్ని నివారించడమే ఏకైక లక్ష్యంగా అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ఐసీడీఎస్ యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అర్హత కలిగిన ప్రతి గర్భిణికి రూ.6 వేలు ప్రోత్సాహకం అందని ద్రాక్షలా మారింది. లబ్ధిదారుల పేర్ల నమోదులోనే నిర్లిప్తత ఆవహించింది. ఈ ఏడాది మేలో జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి ఐసీడీఎస్ శాఖకు బదలాయించిన తర్వాత పథకం అమలు బాలరిష్టాలను దాటడం లేదు. ఈ ఏడాది జులై నుంచి గర్భిణి, నిర్దేశిత తల్లుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గందరగోళంగా మారింది. అన్ని స్థాయిల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినా నమోదులోనే తప్పటడుగులు వేస్తున్నారు. నిజమైన లబ్ధిదారుల పేర్లు ఈ పథకంలో నమోదు కావడం లేదు.

**ఎంపికలో అస్తవ్యస్తం**

తొలి ప్రసవానికి ఆడ, మగ ఎవరైనా సరే నిర్దేశిత ప్రోత్సాహకం సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితేనే పీఎంఎంవైవీ వర్తించనుంది. మగబిడ్డ అయితే ఆ ప్రోత్సాహక మొత్తాన్ని ఇవ్వరు. ఈ ఏడాది జులై నుంచి గర్భిణి లేదా అప్పటికే ప్రసవం పొందినా సరే ఈ పథకంలో నమోదు చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియ అస్తవ్యస్తం నడుస్తోంది.

**పోషణ్ ట్రాకర్ ప్రకారం లబ్ధిదారుల వివరాలు**

మొత్తం లబ్ధిదారులు : 32,924

ఎంపికైన వారు : 2,102

తిరస్కరణ : 17,700

మిగులు : 13,122

**శింగనమల ప్రాజెక్టు భేష్!**

జిల్లా ఐసీడీఎస్ శాఖలో 11 ప్రాజెక్టుల్లో.. పీఎంఎంవీవై పురోగతిలో శింగనమల ప్రాజెక్టు 78.7 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. కళ్యాణదుర్గం 76.9, నార్పల 75 శాతంతో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక/నమోదులో వెనుకపడిన ప్రాజెక్టుల్లో కంబదూరు, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ ఉండటం గమనార్హం. కంబదూరు ప్రాజెక్టులో ఇప్పటి దాకా కేవలం 77 మంది మాత్రమే లబ్ధిదారులను తేల్చారు. పురోగతి సాధనలో చూస్తే.. అనంత అర్బన్ 44.3 శాతం, అనంత గ్రామీణం 46.6, తాడిపత్రి 50.9, కంబదూరు 52.6 శాతం నమోదుతో చాలా వెనుకపడ్డాయి. ఈ ఏడాది మే నుంచి ఈ పథకం కింద ఏ ఒక్క గర్భిణికి ప్రోత్సాహకం అందలేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అవగతం అవుతోంది.

**ప్రత్యేక దృష్టి సారించాం: అరుణకుమారి, పీడీ, ఐసీడీఎస్**

పథకంలో లబ్ధిదారుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాం. వారం రోజుల్లో పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. అంగన్‌వాడీ కార్యకర్త వద్ద నమోదు చేసుకుంటే.. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు ఆమోదం పొందిన తర్వాత పీడీ లాగిన్‌కు వస్తాయి. ఇక్కడి నుంచి రాష్ట్ర కార్యాలయానికి సిఫార్సు చేస్తున్నాం. ఈ ప్రక్రియపై వేగం పెంచాం. తరచూ సమీక్షలు చేస్తున్నాం. వెనుకపడిన వారితోనూ ప్రత్యేకంగా మాట్లాడుతున్నాం.

# వైకాపా నాయకుడి దుశ్చర్య



కళ్యాణదుర్గం : పురాతన ఆలయాల స్థలాలు కబ్జాకు గురవుతున్నా ఎవరికీ పట్టడం లేదు. కుందుర్పి గ్రామ శివారులోని పురాతన శ్రీకణేబసప్ప ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ సల్థంలో అదే గ్రామానికి చెందిన ఓ వైకాపా నాయకుడు రెండు రోజులుగా తవ్వకాలు చేపడుతున్నారు. గ్రామస్థులకు అనుమానం వచ్చి ఎందుకని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. ఆలయాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఇలా చేసినట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుందుర్పి - కళ్యాణదుర్గం మార్గంలోని ప్రధాన రహదారి నుంచి దయ్యాలదిబ్బ వరకు ఆలయానికి సంబంధించిన 35 సెంట్ల కొండ పోరంబోకు భూమి ఉంది. ఈ స్థలాన్ని ఆలయానికి అప్పగించారు. ఆలయానికి పడమర వైపు గత మూడు నెలలుగా అక్రమ కట్టడాలు వెలిశాయి. గతంలో కొందరు చిల్లర దుకాణాలు ఏర్పాటు చేసుకోగా పంచాయతీ అధికారులు తొలగించారు. ఇదే అదునుగా భావించి సదరు వైకాపా నాయకుడు ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నాడు.

కుందుర్పి మండల కేంద్రంలోని పలు పురాతన ఆలయాలకు సంబంధించి స్థలాలు, పొలాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా స్థలాల్లో నాలుగేళ్లుగా వైకాపా నాయకుల అండదండలతో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. దీనిపై తహసీల్దారు ఓబులేసును వివరణ కోరగా ఆలయ భూముల ఆక్రమణల విషయంలో గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవని, ఎలాంటి కట్టడాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఆయాశాఖల ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

# మొక్కజొన్న ధర నేలచూపు



కళ్యాణదుర్గం : జిల్లాలో మొక్కజొన్నకు గిట్టుబాటు ధర దక్కక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బహిరంగ విపణిలో ధరలు లేక, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కాక అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో ఖరీఫ్ కింద రాయదుర్గం, కళ్యాణదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ, రాప్తాడు, గుంతకల్లు ప్రాంతాల్లో 75 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు అధికారులు నివేదిస్తున్నారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్లు అంచనా. గత 45 రోజులుగా దిగుబడి చేతికందుతున్నా.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోతల ఆరంభంలో 2,100 పలికిన క్వింటాలు మొక్కజొన్నలు, ప్రస్తుతం రూ.1,700కు పడిపోయాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.2,400 ప్రకటిస్తే.. మార్కెట్‌లో క్వింటా రూ.700 తగ్గించారని పంటను ఎలా విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎకరాకు రూ.35 వేలు ఖర్చు చేసినా, 20 క్వింటాళ్ల దిగుబడి అమ్మితే పెట్టుబడి రాక, కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఈలెక్కన ప్రతి రైతు ఎకరాకు రూ.15 వేలు చొప్పున నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు జిల్లా రైతులకు 105 కోట్ల మేర నష్టం వాటిల్లనుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**రైతుకు భరోసా ఏదీ?**

గోవిందప్ప, కురాకులతోట, కళ్యాణదుర్గం మండలం

నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు రూ.1.5లక్షలు పెట్టుబడి వ్యయం చేశా. దళారులు రూ.1,500కు అడుగుతున్నారు. అన్ని ధరలు పెరుగుతున్నా మొక్కజొన్న ధరలు తగ్గుతున్నాయి. ఇలాగైతే పంటలు ఎలా సాగు చేయాలి.

**ప్రభుత్వానికి నివేదించాం**పెన్నేశ్వరి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఇది వరకే ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు మంజూరుకాగానే క్షేత్రస్థాయిలో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# ప్రజారోగ్య శాఖలో అవినీతి అధికారిదే పెత్తనం

పుట్టపర్తి: ప్రజారోగ్య శాఖలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారికి శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల పనులు అప్పగించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. సదరు అధికారి గతంలో పని చేసిన ప్రతిచోటా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు ప్రసన్నం చేసుకుని తనపై చర్యలు లేకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. గతంలో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనా రాజకీయ అండతో తప్పించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పెద్దపీట వేస్తూ రూ.కోట్లు విలువైన అభివృద్ధి పనులను అప్పగించడం గమనార్హం. ఉన్నతాధికారుల ఉదాసీనత వల్లే సదరు అవినీతి అధికారి ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది.

**అవినీతి ప్రస్థానం ఇలా**

పుట్టపర్తి మున్సిపాలిటీలో స్వచ్ఛభారత్ కింద 2014-15 వరకు మరుగుదొడ్లు నిర్మించారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు నిర్మించిన మరుగుదొడ్లతో పాటు సొంతంగా ఇళ్లలో నిర్మించుకున్న మరుగుదొడ్లకు సైతం బిల్లులు మంజూరు చేశారు. ఈ అవినీతి బాగోతంపై అప్పట్లోనే కథనాలు ప్రచురితమయ్యాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కమిటీని నియమించారు. కమిటీలో అప్పటి డీఈ దుశ్వంత్‌తోపాటు సభ్యులు విచారణ చేపట్టి రూ.1.36 కోట్లు అవినీతి జరిగినట్లు తేల్చి.. నివేదికను ప్రభుత్వానికి పంపారు. అప్పటి మంత్రి అండతో ఎలాంటి చర్యలు లేకుండా సదరు ఉద్యోగి జాగ్రత్త పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.సదరు అధికారి పుట్టపర్తి మున్సిపాలిటీ నుంచి మడకశిరకు బదిలీ అయ్యారు. అక్కడ ఆరు నెలలు పాటు విధులు నిర్వర్తించారు. 2017-19 మధ్యలో పనులు చేయకుండానే దాదాపు రూ.21.50 లక్షల వరకు గుత్తేదారుల పేరుతో కాజేసినట్లు విశ్వసనీయ సమాచారం. రెండేళ్ల కిందట ఆయన పదోన్నతి పొందారు. ప్రస్తుతం సత్యసాయి శత జయంతి వేడుకల అభివృద్ధి పనులు అప్పగించారు. ఈ పనుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు అతనిపై దృష్టి సారించకుంటే ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని ఆ విభాగంలోని ఉద్యోగులే చెబుతున్నారు. **పనులపై ప్రత్యేక దృష్టి: రామ్మోహన్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ ఎస్ఈ** జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపం, అవినీతికి తావులేకుండా పర్యవేక్షణ చేస్తున్నాం. గతంలో జరిగిన అవినీతిపై ఇచ్చిన నివేదికను పరిశీలిస్తాం. రూ.40 లక్షల వరకు డీఈ స్థాయిలో బిల్లులు మంజూరు చేసే అవకాశం ఉంది. వాటిపైనా ప్రత్యేక దృష్టి పెడతాం.

# ఉపాధి ఉసూరు

పలమనేరు : జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వం కూలీలకు పనులు కల్పించాలనే ఉద్దేశంతో వివిధ రకాల పథకాలను మంజూరు చేసింది. వీటిలో ఫారం పాండ్లు, సప్లై ఛానల్స్, మామిడి మొక్కలు నాటడం, క్యాటిల్ షెడ్లు నిర్మించుకోవడం వంటివి ఉన్నాయి. ఇందులో సగం కూడా పనులు సాగలేదు. వర్షాల కారణంగా ఉపాధి పనులు బాగా మందగించాయి. కూలీలకు పనులు కల్పించాలని పెట్టుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. గత మూడు నెలలుగా వర్షాలు కురవడంతో కూలీలకు పనులు చేసుకునే అవకాశం కలగలేదు. కూలీలు ఉపాధి లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. బిల్లులు సక్రమంగా అందలేదు. ఆగస్టు వరకు కొన్ని బిల్లులు మంజూరైనా తర్వాత



బకాయిలు రాలేదు. మరో వారం గడిస్తే వరి కోతలు, వేరుసెనగ నూర్పిడి పనులు మొదలవుతాయి. ఇది ఉపాధి పనులకు అడ్డంకిగా మారనుంది.

వివిధ రకాల మొక్కలు నాటడానికి

పంచాయతీలు: 700

పనులు: 1624

విస్తీర్ణం: 2434 ఎకరాలు

నాటిన విస్తీర్ణం: 2063 ఎకరాలు

ఈ ఏడాదిలో వివరాలిలా. (రూ.కోట్లలో..)

పనుల విలువ: 183.95

వేతనాలు: 99.50

బకాయిలు: 14.60

జాబ్‌కార్డులు: 2.39 లక్షలు

పనులు చేసిన వారు: 1.95 లక్షలు

# సమగ్ర నీటి సమాచారం

నంద్యాల : ప్రతి జీవికి నీరు ప్రాణాధారమే. ఏటా ఒకవైపు వరదలు.. మరోవైపు కరవు పరిస్థితులు ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో సాగు, తాగునీటిపై కచ్చితమైన సమాచారం అందించేందుకుగాను రాష్ట్రంలోనే తొలిసారిగా నంద్యాల జిల్లాలో వాటర్ బులెటిన్ ఇవ్వడం ప్రారంభించారు. కలెక్టర్ రాజకుమారి సూచనలతో జలవనరుల శాఖ ప్రతి నెలా వాటర్ బులెటిన్లు ఇచ్చే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. భవిష్యత్తులో నీటి వనరుల నిర్వహణకు మార్గదర్శకంగా నిలిచేలా దీనికి రూపకల్పన చేసింది.కేవలం నీటి సంఖ్యలు, గణాంకాల సమాచారమేకాక రైతులు, ప్రజలు, అధికారులకు ఒక మార్గ సూచికగా బులెటిన్‌ను తీర్చిదిద్దారు. వరద హెచ్చరికలతోపాటు ముందస్తు సమాచారం, ప్రజల భద్రతకు సంబంధించిన సూచనలు ఉంటాయి. ప్రాజెక్టుల వారీగా నీటిమట్టాలు, జలాశయాలు, నదులు, చెరువుల్లో నీటి స్థితి, భూగర్భ జలాల వివరాలు పొందుపరిచారు. నెలవారీగా నీటి లభ్యత, సాగు, తాగునీరు, ఇతర అవసరాలకు అందుబాటులో ఉండే నీటి వివరాలు పొందుపరిచారు. కరవు పర్యవేక్షణ, నీటి కొరతను అంచనా వేయడం.. సంరక్షణపై అవసరమైన సూచనలు ఉంటాయి. ఉదాహరణకు శ్రీశైలం రిజర్వాయరులో ఎంత నీటి మట్టం ఉంది? నిల్వ సామర్థ్యం, ఎంత మేరకు డ్యాం నిండింది.. తాగు, సాగునీటి పరిస్థితి తదితర అంశాలు పొందుపరుస్తారు. ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు గత నెలలో ఎంత నీరు అందించారన్న వివరాలు ఉంటాయి. వర్షపాతం, భూగర్భజల మట్టం వివరాలు తెలుసుకోవచ్చు. **ఉపయోగాలెన్నో..**ప్రతి నెలా విడుదల చేసే నీటి బులెటిన్ల ద్వారా రైతులు నీటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చు.

చురకలు

గురువారం 13 నవంబర్ 2025

# ఘాట్.. గమ్యం చేరలేం!

ఉదయగిరి : 'ఉదయగిరి- బండగానిపల్లి మార్గంలో అసంపూర్తిగా ఉన్న 3.2 కి.మీ. రోడ్డు పూర్తి చేస్తే పది గ్రామాలకు చెందిన సుమారు 14వేల మందికి ప్రయోజనం కలుగుతుంది. ఆ మేరకు పూర్తి చేయాలని 20 ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా.. ఆందోళనలు చేసినా.. ఫలితం లేకుండా ఉందని కొండ కింద పల్లెలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'

**3.2 కి.మీ.లు**

కొండ కింద ఉన్న బండగానిపల్లి, బిజ్జంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, లింగమనేనిపల్లి, కొత్తపల్లి, జి.అయ్యవారిపల్లి, దేకూరుపల్లి, జి.చెర్లోపల్లి, జి.చెరువుపల్లి, సంజీవరాజుపల్లి గ్రామాల ప్రజలు రోజువారీ అవసరాల నిమిత్తం నిత్యం ఉదయగిరికి రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో శకునాలపల్లి మీదుగా కొండ చుట్టూ సుమారు 25 కి.మీ. పైగా తిరిగి వచ్చేవారు. 2005లో నాటి ప్రభుత్వం పది కి.మీ. దూరం ప్రయాణిస్తే చేరుకునేలా.. ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. మార్గం మధ్యలో 3.2 కి.మీ. అటవీశాఖ అభ్యంతరంతో ఆగిపోయింది. ఈ కాస్త పూర్తిచేస్తే తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. అప్పటి నుంచి ప్రజలు విన్నవిస్తూనే ఉన్నారు. ఆందోళనలు సైతం చేపట్టారు. దాంతో నాలుగేళ్ల కిందట అటవీశాఖ కోల్పోతున్న 3.2 కి.మీ.కు ప్రత్యామ్నాయంగా నేలటూరు సమీపంలో కేటాయించారు. రోడ్డు ఏర్పాటుకు అనుమతుల కోసం ఉన్నతాధికారులకు



ప్రతిపాదనలు పంపారు. ఇంత వరకు అనుమతి రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా దృష్టిసారించి.. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**అధికారులు ఏమన్నారంటే...**

అటవీశాఖ కోల్పోతున్న భూమికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిందీ వారి పరిధిలోనే ఉందని చెబుతున్నారని ఆర్అండ్‌బీ డీఈఈ మదన్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్చిస్తున్నామన్నారు. అటవీశాఖ రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాతో మాట్లాడగా.. తమశాఖ ఉన్నతాధికారులు కొన్ని వివరాలు అడిగారని, వాటిని పంపాల్సి ఉందన్నారు.


**నిత్యం నరకం..**అసంపూర్తిగా ఉన్న ఘాట్ రోడ్డు రాళ్లు తేలి.. గుంతలమయంగా మారింది. ఉదయగిరికి వెళ్లేందుకు నిత్యం నరకం చూస్తున్నాం. రాకపోకలు సాగించే క్రమంలో ఎందరో తీవ్ర గాయాలపాలయ్యారు. ఈర్ల శంకర్

# పంచాయతీలపై.. ఏదీ పర్యవేక్షణ!

సర్వేపల్లి : కోవూరుతో పాటు పలు నియోజకవర్గాల్లోని పంచాయతీల్లో అక్రమాలు జరిగాయని, నిధులు భారీగా దుర్వినియోగం చేశారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. విచారణ జరిపిన అధికారులు.. అవి నిజమని తేల్చి.. సర్పంచుల చెక్‌పవర్ రద్దు చేయడంతో పాటు కార్యదర్శులపై వేటు వేశారు. అదే సమయంలో అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వల్లే.. అక్కడ ఆ పరిస్థితులు నెలకొన్నాయన్న విమర్శలు ఉన్నాయి.

పంచాయతీల్లో సర్పంచులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు కాంట్రాక్టర్లు(వెండర్)గా ఉండకూడదు. కార్యదర్శులు రూపాయి కూడా వారి ఖాతాల్లో వేసుకోకూడదు. కానీ, వెంకటాచలం పంచాయతీతో పాటు మరికొన్నిచోట్ల సర్పంచుల కుటుంబ సభ్యులే కాంట్రాక్టర్‌గా ఉండి.. రూ. లక్షల నిధులు వారి ఖాతాల్లో వేసుకున్నారు. కార్యదర్శులు తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. ఏళ్లుగా జరుగుతున్న ఈ తంతును అధికారులు గుర్తించలేకపోవడం.. పరిస్థితికి అద్దం పడుతోంది.

జిల్లాలో పంచాయతీలపై డివిజనల్, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. తరచూ వాటిని సందర్శించి.. రికార్డులు పరిశీలించడంతో పాటు నిధుల వినియోగంపై విచారణ జరపాల్సిన అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండగా- ఆ ఉదాసీన వైఖరే అన్ని అక్రమాలకు కారణమవుతోంది. జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో డీఎల్‌పీవో, మండల స్థాయిలో ఈవోపీఆర్డీలు పర్యవేక్షణ బాధ్యత




తీసుకోవాలి. డీఎల్‌పీవో నెలకు 5 నుంచి 10 పంచాయతీలను తనిఖీ చేయాలి. ఈవోపీఆర్డీలు నెలలో తమ మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో పర్యటించాలి. మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలి. కానీ, చాలాచోట్ల అది పక్కాగా అమలు కావడం లేదు. ఆ క్రమంలోనే భారీగా నిధుల దుర్వినియోగం జరుగుతోందన్న అపవాదు నెలకొంది. ఇక టీపీగూడూరు, వెంకటాచలం, రాపూరు, పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, ఇందుకూరుపేట తదితర మండలాల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందాయి. చాలాచోట్ల ఇంకా విచారణ జరపలేదు. విచారణ చేస్తున్న చోట్లా వాయిదాల పేరుతో కాలయాపన చేస్తున్నారు. వెంకటాచలం మండలంలో ఎనిమిది నెలలపాటు సుదీర్ఘ విచారణ జరిపి.. మొక్కుబడి నివేదిక ఇవ్వడమూ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పరిస్థితులు మార్చాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై డీపీవో శ్రీధర్ స్పందిస్తూ.. త్వరలో జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి.. తనిఖీలు చేయని వారిని గుర్తించడంతోపాటు అన్నిచోట్ల జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

జిల్లాలో మండలాలు: 37
పంచాయతీలు: 722
డివిజన్లు నాలుగు
అందిన ఫిర్యాదులు: 30

# తేల్చకుండానే తాళాలిస్తారా?



అనకాపల్లి : సొంతిల్లంటే చాలామందికి జీవితకాలపు కల. పట్టణ పేదల కోసం నిర్మించిన టిడ్కో గృహాల కేటాయింపులో గత వైకాపా ప్రభుత్వం ఎక్కడలేని రాజకీయాలు చేసింది. లబ్ధిదారుల జాబితాను తారుమారు చేసింది. అంతవరకు అర్హులుగా ఉన్నవారిని పక్కనెట్టింది. ఇదే అన్యాయమంటూ ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగి అర్జీలిచ్చినా ఫలితం లేకుండాపోయింది. పోనీ ఇళ్లయినా అప్పగించిందా అంటే అదీ లేదు. లబ్ధిదారుల ఆశనిరాశల ఊగిసలాటతోనే కాలం గడిచిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చే జూన్ నాటికి జిల్లావ్యాప్తంగా టిడ్కో ఇళ్లను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని చూస్తోంది. ఈ గృహసముదాయాల వద్ద పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కసరత్తు జరుగుతోంది. రోడ్డుపనులు, జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకల నిగ్గు తేల్చకుండానే ఇళ్లను అప్పగిస్తారా అని లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అనర్హులను పక్కనెట్టి అర్హులకు అవకాశం కల్పించాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో అనకాపల్లి జీవీఎంసీ, ఎలమంచిలి, నర్సీపట్నం పురపాలక సంఘాల్లో కలిపి 6184 టిడ్కో ఇళ్లు నిర్మించారు. తెదేపా హయాంలోని లబ్ధిదారుల జాబితాను మార్చేసి.. వైకాపా నేతలు తమ అనుచరులకు కట్టబెట్టేశారు. ఇక్కడ ఉండేందుకు ఇష్టపడక చాలా మంది ఇళ్లను విక్రయించేశారు. ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన 300 చదరపు అడుగుల ఇళ్లను రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అమ్మేసుకున్నారు. దీనిపై ఫిర్యాదులు అంది ఎవరైనా అధికారులు ఫోన్లు చేస్తే మేమే నివాసం ఉంటున్నాం.. అమ్మలేదు అంటూ చెప్పారు. కానీ వాస్తవానికి చాలావరకు చేతులు మారినట్లు అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటి వరకు దాని ఊసే లేదు. అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో 3,400 వరకు టిడ్కో ఇళ్లను నిర్మించారు. విశాఖకు చెందిన ఓ ఎమ్మెల్యే సిఫార్సుతో ఆ జిల్లావాసులకు అనకాపల్లిలో కేటాయించేశారు. దీనిపై అప్పట్లో తెదేపా నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా.. సమస్య పరిష్కారం కాలేదు.

**కావాలనే తొలగించారు**

కె.నూకరాజు, గొల్లవీధి, అనకాపల్లి పట్టణం

తెదేపా ప్రభుత్వంలో మాకు టిడ్కో ఇళ్లు కేటాయించారు. అప్పు చేసి మరీ ముందస్తుగా సొమ్ము చెల్లించాం. తర్వాత ప్రభుత్వం మారడంతో మాపై అక్కసుతో కావాలనే వైకాపా నేతలు జాబితా నుంచి తీసేశారు. చాలాకాలం అధికారుల చుట్టూ తిరిగి అర్జీలిచ్చినా ఇప్పటికీ న్యాయం జరగలేదు.

# పచ్చందం.. తిరుపతికి.. ఆభరణం



తిరుపతి : తిరుపతి విద్యా సంస్థల్లో గత కొన్నేళ్లుగా విస్తృతంగా చేపట్టిన మొక్కల పెంపకం స్థానికంగా పర్యావరణ సంరక్షణ, కాలుష్య నియంత్రణలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి.

**గాలి కాలుష్య నియంత్రణ**

వేలాది వృక్షాలు డస్ట్ పార్టికల్స్, పొగ, వాయు కాలుష్య కారకాలు (ఎన్‌ఓ-2, ఎస్‌ఓ-2) నియంత్రించి గాలి నాణ్యతను మెరుగుపరుస్తున్నాయి. తిరుపతిలో గాలి నాణ్యత సూచీ గత దశాబ్దంలో మెరుగుపడింది. గ్రీన్ క్యాంపస్ ప్రోగ్రామ్‌లు సహకరించాయి.

ఐసర్, ఎస్వీయూ, ద్రవిడియన్ విద్యా సంస్థలు విస్తృత హరిత వాతావరణాన్ని కల్పించాయి.

ఇవి నీడ, తేమతో రెండు నుంచి ఐదు డిగ్రీల ఉష్ణోగ్రతలను తగ్గిస్తాయి.

నీటి పరిరక్షణ, మట్టి సంరక్షణ

వృక్షాల వేర్లు మట్టిని కదలకుండా ఉంచి వర్షపు నీటిని గ్రహించడంలో సహాయపడతాయి.

హిల్ స్లోప్స్ వద్ద ఉన్న విద్యా సంస్థలు వృక్షాల కారణంగా మట్టి క్షీణతను తగ్గించాయి.

**ప్రయోజనాలు ఇవే..**

గాలి శుద్ధి: సీఓ-2, పీఎం ఇతర కాలుష్యకాలు తగ్గింపు
ఉష్ణోగ్రత నియంత్రణ: హీట్ ఐలాండ్ ప్రభావం తగ్గడం
జీవ వైవిధ్య పెంపు: పక్షులు, పురుగులు, చిన్న జంతువుల నివాసం
సామాజిక అవగాహన: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల్లో చైతన్యం

| విద్యా సంస్థ | ప్రత్యేకత |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర వర్సిటీ | - వేలాది వృక్షాలు, వైద్య, దేశీయ జాతి |
| ద్రవిడియన్ యూనివర్సిటీ | - 75వేలకు పైగా చెట్లు, హరిత, ఆయుర్వేదం |
| పద్మావతి మహిళా వర్సిటీ | - 5 వేలకు పైగా వివిధ జాతుల చెట్లు |
| ఐఐఎస్ఈఆర్ తిరుపతి | - స్థానిక జాతివృక్షాలు, బయోడైవర్సిటీ పెంపు |
| రీజినల్ సైన్స్ సెంటర్ | - 2,500కుపైగా చెట్లు, 'టాగ్ ఎ ట్రీ' కార్యక్రమం |
| అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ | - ఎన్ఎస్ఎస్‌ద్వారా రెగ్యులర్ ప్లాంటేషన్ |
| తి.తి. దేవస్థానాలు | - పెద్ద స్థాయిలో విభిన్న జాతుల మొక్కలు |

# కారులో సారు.. కాసులివ్వాలి మీరు!



పాయకరావుపేట : రెండు రోజుల క్రితం ఆటో డ్రైవర్ దేవుడు తుని మార్కెట్ నుంచి కూరగాయల లోడుతో ఎలమంచిలి బయలుదేరాడు. నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం వద్ద ఆర్టీవో తనిఖీ అంటూ ఆటో ఆపి రూ.4 వేలు వసూలు చేశారు. ఈ మొత్తాన్ని వేరే వ్యక్తి నంబరుకు ఫోన్‌పే చేయించుకున్నారు. ఉద్దండపురానికి చెందిన స్వామి అనే ఆటో డ్రైవర్ నుంచి ఇదేవిధంగా వసూలు చేశారు.

శ్రీరాంపురానికి చెందిన గొర్ల నరసింహమూర్తి ఆటో డ్రైవర్ నుంచి ఎలమంచిలి మండలం పులపర్తి వద్ద రూ.మూడు వేలు వసూలుచేసి ఫోన్‌పే చేయించారు..జాతీయ రహదారిపై కొద్దిరోజులుగా నకిలీ రవాణా అధికారులు ఆటో డ్రైవర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. పాయకరావుపేట నుంచి ఎలమంచిలి మధ్య సీసీ కెమెరాలు లేని ప్రాంతాన్ని ఇందుకు వేదికగా చేసుకుంటున్నారు. ఎంవీఐ పేరుతో ఓ వ్యక్తిలో కారులో మాస్కు పెట్టుకుని కూర్చుని ఉంటున్నారు. మరో వ్యక్తి సహాయకుడినంటూ ఖాకీ ప్యాంటు వేసుకుని ఆటోలను ఆపుతున్నాడు. ఆ తర్వాత ఆటోడ్రైవర్ పక్కనే కూర్చుని కేసు రాస్తే రూ. 20 వేలు అవుతుంది, లేకపోతే రూ.అయిదు వేలు ఇస్తే సరిపోతుందని భయపెట్టి.. వారి దగ్గర డబ్బు గుంజుతున్నారు. నగదు లేకపోతే వేరే వ్యక్తుల ఫోన్‌పే నంబర్లకు నగదు బదిలీ చేయించుకుంటున్నారు. దీనిపై ఆటోడ్రైవర్లు కొంతమంది పోలీసుల దృష్టికి సైతం తీసుకువెళ్లారు. అయినా ఎవరూ ఇప్పటివరకు పట్టించుకోవడం లేదు. ఫోన్ పే నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేస్తే నకిలీల లీలలు బయటపడే అవకాశముంది. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఇలా చేస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఈ విషయాన్ని నర్సీపట్నం రవాణాశాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా ఈ వసూళ్లతో తమ కార్యాలయ ఉద్యోగులకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పూర్తిగా ప్రైవేట్ వ్యక్తుల పనే అన్నారు.

# పురాతన మందిరాలు పూడుకుపోతున్నాయ్

పెనుకొండ: శతాబ్దాలుగా రాచరికపు చరిత్ర కలిగిన పెనుకొండలో పలు మందిరాలకు రక్షణ కొరవడింది. పట్టణంలోని తోటగేరిలో నుంచి పాలవక్కిరిబావికి వెళ్లే ప్రధాన మార్గం పక్కన ఉన్న ఓ పురాతన మందిరం భూమిలో కూరుకుపోతోంది. దశాబ్దాల క్రితమే మందిరం ఖాళీగా ఉండడంతో 50ఏళ్లక్రితం స్థానిక యువకులు గరిడి(వ్యాయామం) చేయడానికి వినియోగించేవారు. వర్షాలకు కొట్టుకొచ్చిన మట్టిలో మందిరం కురుకుపోతోంది. ప్రస్తుతం ఆ మందిరంలో చెత్తాచెదారం, వ్యర్థాలతో శిథిలావస్థకు చేరింది. మఠం వీధిలోని ఓ మందిరం సైతం మట్టిలో కూరుకుపోయింది. విలువైన చారిత్రక నిర్మాణాలకు రక్షణ కల్పించి, భవిష్యత్తు తరాలకు చరిత్ర తెలిసేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, పురావస్తుశాఖపై ఉంది. ఈ విషయాన్ని రాష్ట్ర పురావస్తుశాఖ ఏడీ స్వామి నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం గుర్తింపు పొందిన స్మారక చిహ్నాలు, ఆలయాలను మాత్రమే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందన్నారు.



# లైసెన్సు లేకుంటే.. సీజ్

నెల్లూరు : అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం ప్రాంతంలోని ఓ టపాసుల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగి ఏడుగురు మృతి చెందిన దుర్ఘటనతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ ఇప్పటికే తనిఖీలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో లైసెన్స్ లేదని గుర్తిస్తే సంబంధిత యజమానిపై కేసు నమోదు చేయడంతో పాటు దుకాణాన్ని సీజ్ చేస్తామని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేస్తున్నారు. ముఖాముఖిలో ఆయన ఇందుకు సంబంధించిన పలు విషయాలు పంచుకున్నారు.

**ఆరు గోదాములకు నోటీసులు**

జిల్లాలో ఎనిమిది తయారీ కేంద్రాలు, 32 బాణసంచా నిల్వ, విక్రయ కేంద్రాలు ఉండగా- వీటికి శాశ్వత లైసెన్స్ ఉంది. ఇవి కాకుండా ఇప్పటి వరకు ఒక అనధికార తయారీ కేంద్రాన్ని గుర్తించాం. సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేశాం. నిబంధనలకు అనుగుణంగా అన్ని రకాల పరికరాలు ఉంటే.. లైసెన్స్ జారీ చేస్తాం. లేదంటే చర్యలు



తప్పవు. ఇప్పటి వరకు ఆరు గోదాములకు నోటీసులు జారీ చేశాం.

**300కుపైగా దరఖాస్తులు**

దీపావళి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తాత్కాలిక టపాసుల దుకాణాల కోసం 300కుపైగా దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ అధికారులు లక్కీడిప్ ద్వారా వాటికి స్థలాలు కేటాయిస్తారు. ఆయా ప్రాంతాల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. ప్రతి దుకాణం ఎదుట ఇసుకతో కూడిన డ్రమ్ము, బక్కెట్లు ఏర్పాటు చేయాలి. ఖాళీ ప్రాంతంతో పాటు అగ్నిమాపక వాహనాలు తిరిగేలా అనువైన స్థలం ఉండాలి. 200 మైక్రాన్ల ప్లాస్టిక్‌నే వినియోగించాలి.

**తక్షణం స్పందిస్తాం..**

దీపావళి సందర్భంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి ప్రమాదం జరిగినా డయల్ 101, 100, 108కు కాల్ చేయాలి. జిల్లా అగ్నిమాపక కార్యాలయం 0861 -2331051కు తెలిపినా తక్షణం స్పందిస్తాం. వేగంగా కాలే స్వభావం ఉన్న మందుగుండు సామగ్రిని ఇళ్లలో నిల్వ ఉంచరాదు. కిరోసిన్, గ్యాస్ ఉండే గదుల్లో టపాసులు ఉంచకుండా జాగ్రత్త పడాలి.

# అనుమతులు వచ్చినా..అవాంతరమే!

సంగం : పెన్నా నదిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖల ఆటంకాలు తొలగినా.. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అవాంతరం ఏర్పడింది. జూన్ ప్రారంభం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. ఫలితంగా సెమీ మెకనైజ్డ్, ఓపెన్ రీచ్‌లతో పాటు డీసిల్టేషన్ పాయింట్లలో తవ్వకాలు, రవాణా నిలిచిపోయింది. కాగా.. ప్రజల అవసరాల నిమిత్తం నిల్వ కేంద్రాల్లో 24,58,471 టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**గత నెల నుంచి...**



పెన్నాలో గత నెల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమశిల జలాశయంలో నీటి నిల్వ 73 టీఎంసీలు దాటడంతో.. పై నుంచి వస్తున్న వరదను నేరుగా పెన్నాలోకి వదులుతున్నారు. ఫలితంగా ప్రస్తుతం పదివేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. దీనికి తోడు వర్షాల సీజన్ నేపథ్యంలో.. ఈ ఏడాది ఆఖరు వరకు పల్లిపాడు, అప్పారావుపాళెం, మినగల్లు, విరుపూరులో ఇసుక తవ్వకాలు సాధ్యం కాదన్న మాట వినిపిస్తోంది. సంగం, సూరాయపాళెం, పోతిరెడ్డిపాళెం, కలువాయి రాజుపాళెంలో డీసిల్టేషన్ ప్రక్రియ ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నా.. అందుకు ప్రభుత్వ అనుమతి లేదు.

దీనిపై గనులు, భూగర్భ గనులశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వరద ప్రవాహంతో ఇబ్బందులు వాస్తవమేనని, పడవల ద్వారా సేకరణకు త్వరలోనే అనుమతులు వస్తాయన్నారు.

# ఇసుకేస్తే రాలనంతగా అక్రమాలు!

ఒంగోలు: జీఎస్టీ తగ్గింపుతో సిమెంటు ధరలు తగ్గాయామోగానీ ఇసుక ధరలు ఏ మాత్రం తగ్గడం లేదు. ఇసుక సరఫరా కొంతమంది దయదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండడంతో సామాన్య ప్రజలు వారు చెప్పిన ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వినియోగదారులపై భారం తగ్గించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం తమ గాదెలు నిండితే చాలు అన్నట్లు జనం కష్టాలతో మాకేంటి సంబంధం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక సరఫరాలో బాధ్యతగా వ్యవహరించాల్సినవారు ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరించడంతో ప్రజల ఇసుక కష్టాలు తీరడంలేదు.జిల్లాలో అత్యధిక ధర యర్రగొండపాలెం స్టాకు యార్డులో టన్ను రూ.1,500గా నిర్ణయించారు. ప్రైవేటుగా ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే టన్ను రూ.900కు రవాణా ఛార్జీలతో కలిపి ఇంటి వద్దకు తీసుకొస్తారు. ప్రైవేటుగా ఒక వాహనం కూడా బయట నుంచి రానీయడం లేదు. యార్డుకు చెందిన ప్రైవేటు సైన్యం వెంటబడిమరీ కొడుతున్నారు. పశ్చిమ ప్రకాశం అంతటా ఇదే పరిస్థితి. మొన్నటి వరకు ఒంగోలు నగరంలో ఈ పరిస్థితి ఉండేది కాదు.. ప్రస్తుతం ఇక్కడ కూడా మొదలైంది.**పోలీసుల అత్యుత్సాహం**ప్రజలు తమ అవసరాలకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఇసుకను ఎక్కడి నుంచైనా తెచ్చుకొనే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. సమీప వాగుల్లో ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకోవచ్చు. తక్కువ ధరకు ఇసుక ఎవరైనా తెచ్చుకుంటే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. మార్కాపురంలో ఇటీవల నెల్లూరు నుంచి ఇసుక లారీ వస్తే నిలిపేశారు. యార్డు నిర్వాహకులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు వారికి వత్తాసు పలుకుతున్నారు.బయట నుంచి ఇసుక తీసుకొచ్చి కొంతమంది వ్యాపారంగా నడుపుతుండడంతో తాము నష్టపోతున్నామని యార్డు నిర్వాహకులు చెబుతున్నారు. యార్డుకు అద్దె, సిబ్బందికి జీతాలు చెల్లించాలని, దీంతో ఎక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని తమ వాదన వినిపిస్తున్నారు. రవాణా ఛార్జీలు, ఖర్చులు చూసి అధికారులు వారి వాదన నిజమేననే భ్రమలో ఉన్నారు.ఇసుక సరఫరాలో జనం ఇబ్బంది పడుతుండడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని జిల్లా మంత్రి స్వామి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పట్టించుకోవడం లేదు.

# బజారున.. రైతుబజారు

పుత్తూరు :ఉమ్మడి జిల్లాలో చిత్తూరు, తిరుపతి, పలమనేరు, గూడూరులో తప్ప మరెక్కడా రైతుబజారు లేదు. గత ప్రభుత్వంలో పుత్తూరు, నగరి, పలమనేరు, తిరుచానూరు, చంద్రగిరిలో ఏర్పాటు చేయాలనుకున్నారు. పలమనేరులో పూర్తి చేసి ప్రారంభించారు. ఇటీవల తిరుచానూరులో ప్రారంభించారు. చంద్రగిరిలో పునాదుల దశలోనే వదిలేశారు. పుత్తూరులో స్థలం చూడగా.. నగరిలో అదీ లేదు. పుత్తూరులో నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

**ఇవీ ప్రయోజనాలు**

మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించే రైతు బజార్లలో నామమాత్రపు అద్దెకు రైతులు, స్వయం సహాయక సంఘాలకు దుకాణాలు ఇస్తారు.



బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కిలోకు రూ.5 నుంచి రూ.10 తక్కువ ధరకు కూరగాయలు దొరుకుతాయి.

టమాటా, ఉల్లి వంటి వాటి ధరలు పెరిగినప్పుడు ప్రజలకు వాటిని రాయితీపై అందిస్తారు.

**చెప్పినా.. వినరే**

ప్రభుత్వం మార్కెట్ యార్డుల ఆధ్వర్యంలో సీఎంఎఫ్ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని రైతుబజార్లు నిర్మించాలని పచ్చజెండా ఊపింది. అయినా అడుగు పడలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి నిధులు మంజూరు అయ్యేలా చూడాలి.

# సీటిచ్చే.. వసతి 'చేయిచ్చే'..!

తిరుపతి : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. సీటు పొందిన విద్యార్థినుల్లో చాలామందికి వసతి సీటు దొరక్కఆందోళన చెందుతున్నారు.

**తప్పని నిరీక్షణ:** ఈ కళాశాలలో మొత్తం 25 కోర్సులు ఉన్నాయి. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 1500 సీట్లు ఉన్నాయి. ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు మొదటి విడతలో సీట్లు కేటాయించారు. వారిలో 50 శాతం మందికి కూడా వసతి సదుపాయం దక్కకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు... సీటు కోసం రోజూ కళాశాల ఎదుట నిరీక్షిస్తున్నారు.

**ఎన్నాళ్లీ మూసివేత..!**

కళాశాలలో 9 వసతి గృహాలు ఉన్నాయి. వకుళ వసతి గృహంలో గతేడాది ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కళాశాల ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న నూతన వసతి గృహాన్ని మూసేశారు. ఇవీ రెండూ మూతపడ్డాయి.వసతి సీటుకు ఒత్తిడి పెరుగుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు.

విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న గదిని మూసేస్తే సరిపోయేదని, మొత్తం గృహాన్ని మూసేయడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**ఎక్కువ మార్కులొచ్చినా..**

తితిదే విద్యాసంస్థలకు రాయలసీమ జిల్లాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎక్కువగా పేదలే ఇక్కడి కళాశాలలో చేరుతుంటారు. వసతి, భోజనం ఉచితంగా లభిస్తుండటంతో ప్రవేశాలకు డిమాండ్ ఎక్కువ. ప్రస్తుతం 900కు పైగా మార్కులు సాధించిన విద్యార్థినులకు వసతి సీటు దొరక్క నిరాశ చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

**పరిశీలిస్తాం.... చర్యలు తీసుకుంటాం**

– వెంకటసునీల్, డీఈవో, తితిదే

మూడు బ్లాకులు నిరుపయోగంగా ఉన్న విషయం మా దృష్టికి రాలేదు. ఎందుకు వినియోగించకుండా ఉన్నారో కారణాలను విశ్లేషిస్తాం. ఆయా బ్లాక్‌లలో విద్యార్థులకు అనుగుణంగా సౌకర్యాల దృష్ట్యా వాటి స్థితిగతులపై ఆరా తీస్తాం.

# నన్నెవరు ఆపేది.. నన్నా అడిగేది!

పుత్తూరు: ఇటీవల నింద్ర వెలుగు కార్యాలయంలో నిల్వ చేసిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. దీని వెనుక సూత్రధారులు ఎవరో బయటకు రానివ్వలేదు. నారాయణవనంలో మరో నాలుగు టన్నుల బియ్యాన్ని లేబుల్స్‌తో సహా విజిలెన్స్ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నాలుగు రోజుల కిందట తడుకు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టపగలు వేరొక వాహనంలోకి బియ్యం మార్చుతుండగా పట్టుకున్నారు. పేదల బియ్యం గద్దల్లా తన్నుకుపోతున్నారు అక్రమార్కులు. అడ్డుకునే వారు లేకపోవడంతో పేట్రేగిపోతున్నారు. పుష్ప సినిమాలో



ఎర్రచందనం సిండికేట్‌లా సూళ్లూరుపేటకు చెందిన ఓ వైకాపా నాయకుడు తనకే అమ్మాలని అక్రమార్కులకు హుకుం జారీ చేశారు. అతనే సూళ్లూరుపేట, గూడూరు, బీఎన్ కండ్రిగ, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో కిలో బియ్యం రూ.10కి సేకరించి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో సేకరించే వారిని తనకే అమ్మాలని, కిలోకు రూ.17 ఇస్తానన్నారు. తనకు అయితే ఎలాంటి సమస్యలు ఉండవని, అంతా దగ్గరుండి అధికారులే చూసుకుంటారని, ఎవరూ అడ్డుకోరని చెప్పడం గమనార్హం. **కఠిన చర్యలు తప్పవు** – రవికుమార్ డీఎస్పీ, పుత్తూరు

బియ్యం అక్రమ రవాణాపై తరచూ తనిఖీలు చేస్తున్నాం. సమాచారం వచ్చిన వెంటనే దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. కఠిన చర్యలూ తీసుకుంటాం.

# మార్కెట్ పేరుతో మాయాజాలం



అనంతపురం : కూరగాయల మార్కెట్ అంటే ఏయే సౌకర్యాలు ఉండాలి.. నీడ కోసం షెడ్డు, కూరగాయలు పెట్టుకునేందుకు సిమెంట్ దిమ్మెలు, క్రయవిక్రయదారులకు అవసరమైన మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. ఇవేమి లేకుండానే పామిడి మేజర్ పంచాయతీ అధికారులు కూరగాయల మార్కెట్ నిర్మించారు. రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువపై కాంక్రీట్ బెడ్డింగ్ వేసి దానికే కూరగాయల మార్కెట్ అని నామకరణం చేశారు. అంచనాలను నాలుగు, ఐదు రెట్లు పెంచేసి స్థానిక నాయకుడి ద్వారా పనులు చేపట్టారు. ఆగమేఘాలపై మార్కెట్ ప్రారంభోత్సవం చేసేసి అప్పనంగా నిధుల్ని బిల్లులు రూపంలో కట్టబెట్టారు.


**50 మీటర్లకు రూ.25 లక్షలా?**

పామిడిలోని బీసీసీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి కూరగాయల తోపుడుబండ్లను ఒకచోటుకు తరలించాలని అధికారులు ప్రతిపాదించారు. ఇదే క్రమంలో పోలీస్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న పెద్దకాలువ ప్రాంతంలో మార్కెట్ నిర్మించాలని నిర్ణయించారు. రూ.25 లక్షల అంచనాతో పనులు మొదలుపెట్టారు. స్థానిక తెదేపా నాయకుడికి పనులు అప్పగించారు. 50 మీటర్ల మురుగు కాలువపై కాంక్రీట్‌తో బెడ్డింగ్ వేసి వదిలేశారు. ప్రవేశం వద్ద ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కూరగాయల మార్కెట్ అని బోర్డు తయారుచేయించి ప్రారంభోత్సవం చేశారు. 50 మీటర్ల కాంక్రీట్ బెడ్డింగ్ రూ.5 లక్షలకు మించి ఖర్చు కాదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

**పంచేసుకున్నారు..**

కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను దక్కించుకోవడానికి నలుగురు నాయకులు పోటీ పడ్డారు. పంచాయతీ ఖాతాలో నిధులు అందుబాటులో ఉండటంతో అక్రమాలకు తెరలేపారు. నలుగురిలో ఒకరికి పనులు దక్కేలా పావులు కదిపారు. మండలస్థాయి అధికారి సహకారంతో అరకొర పనులు చేసి ఖాతాలో బిల్లులు కాజేశారు. ఇందుకు సహకరించిన మండలస్థాయి అధికారికి సైతం మామూళ్లు ముట్టజెప్పుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్ నిర్మాణంపై స్థానికంగా విమర్శలు రావడంతో తోపుడుబండ్లను అక్కడికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. రోడ్డు పక్కన తోపుడుబండ్లపై కూరగాయలు విక్రయిస్తే జరిమానా విధిస్తామంటూ అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై పామిడి ఎంపీడీవో తేజోష్ణ వివరణ కోరగా నిబంధనల మేరకే కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టాం.. మెజర్‌మెంట్ బుక్‌లోనూ అన్ని వివరాలు పొందుపరిచామని తెలిపారు. ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగలేదన్నారు.

# ఏం చేద్దాం.. ఎలా ఉపయోగిద్దాం!



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వం రుషికొండపై రూ. వందల కోట్ల ప్రజాధనం వ్యయం చేసి విలాసవంత భవనాలు నిర్మించింది. వాటిని ప్రభుత్వ అవసరాలకు కాకుండా జగన్ నివాస అవసరాలకు వీలుగా నిర్మించుకోవడంతో వాటిని దేనికీ వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా... ఆ భవనాల వినియోగంపై ఏ నిర్ణయం తీసుకోలేదు. అయితే... తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఈ భవనాలను ఎలా వినియోగించాలి? అనే అంశంపై ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థ (ఏపీటీఏ) ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీంతో పలువురు తమ ఆలోచనలను పంపుతున్నారు. భవనాలు చూడకుండా ఎలా వినియోగించాలో చెప్పేదెలా అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు.

**అప్పుడలా..**ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రుషికొండపై హరితా హిల్ రిసార్టు నిర్వహించేది.

42 గదులు, సమావేశ మందిరం, వివాహ వేదిక, రెస్టారెంట్ ఉండేవి. ఈ ఒక్క రిసార్టు నుంచే ఏపీటీడీసీకి ఏటా రూ.7 కోట్ల ఆదాయం వచ్చేది. రాష్ట్రంలో మిగిలిన అన్ని రిసార్టుల కలిపితే ఇంత వచ్చేది. రిసార్టు నుంచి తీరం అద్భుతంగా కనిపించేది. సీజన్‌లో ఇక్కడ గది దొరకాలంటే చాలా కష్టంగా ఉండేది.

భవనాలు నిర్మించి 15 ఏళ్లు కాకమునుపే కూల్చేశారు.

**ఇప్పుడిలా..**

గత వైకాపా ప్రభుత్వంలో ఆ భవనాలను కూల్చి 9.88 ఎకరాల్లో 13,140 చదరపు మీటర్లలో భవనాలు నిర్మించారు.

రూ.452 కోట్ల ప్రజాధనం వెచ్చించారు. విదేశాల నుంచి తీసుకువచ్చిన సామగ్రితో గదులు అలంకరించారు.

వేంగి, గజపతి, కళింగ, విజయనగర పేరుతో ప్యాలెస్‌లా నిర్మించారు. భవనాల ముందు సుందరీకరణకు లక్ష మొక్కలతో ఉద్యానవనం అభివృద్ధి చేశారు.

కొంతకాలంగా ఖాళీగా వదిలేయడంతో గదులు దుమ్ము పట్టాయి. తీరం నుంచి వచ్చే ఉప్పు గాలికి పలునిర్మాణాలు, సామగ్రి తుప్పు పడుతున్నాయి. వర్షానికి అక్కడక్కడ సీలింగ్ నుంచి నీరు కారుతోంది.

మెయిల్ చేయండి..

ఆసక్తి ఉన్న వారు ఈ భవనాలను దేనికి వినియోగించాలో తమ అభిప్రాయాలు తెలియజేయొచ్చు.

జాతీయ, అంతర్జాతీయంగా ఆతిథ్యరంగంలో అనుభవం కలిగిన నిర్వాహకుల

అభిప్రాయం తెలుసుకునేందుకు శుక్రవారం విజయవాడలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. %rushikonda.suggestions @aptdc.ap.gov.in% కు మెయిల్ చేయొచ్చు.

# ఆవేదనలో ఆసరా..



నర్సీపట్నం : మగువల కన్నీటి కష్టాలను పరిష్కరించే దిశగా అంతటా ముందడుగు పడుతోంది. మహిళల సాధికారికతకు కృషి చేయడమే కాకుండా వారికి ఏ సమస్య వచ్చినా అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జెండర్ రిసోర్స్ కేంద్రాలు (జీఆర్సీ)ను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే రావికమతం, నక్కపల్లిలో సేవలు అందిస్తున్నాయి. నర్సీపట్నం, కె.కోటపాడుకు కొత్తగా మంజూరయ్యాయి. మరో మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలున్నాయి.

సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటుచేసుకుంటున్న పలు ఘటనలతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలత చెందడం మినహా ఎవరికీ చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోతే మానసికంగా కుంగిపోతున్నారు. పోలీసు స్టేషన్ వరకు వెళ్లలేక మిన్నకుండిపోతున్నారు. ఇలాంటి వారందరికీ జీఆర్సీతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులే వీటిని నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కమిటీలు బాధిత మహిళలకు దన్నుగా నిలిచి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు తోడ్పాటునందిస్తాయి. కేంద్రాల్లోనే ఒకటి రెండు రోజులు వసతి సదుపాయం కలిస్తారు.

ప్రత్యేక కమిటీలు మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయి. పొదుపు సంఘాల్లోని మహిళల్లో చదువుతున్న వారు ఆర్పీలుగా సేవలందిస్తున్నారు. సమాజంలోని స్త్రీలు ఎవరైనా సరే ఈ కేంద్రాలను ఆశ్రయించి సాయం పొందవచ్చని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజరు రత్నప్రభ చెప్పారు.

జిల్లాలో తొలుత మంజూరైన రావికమతంలోని ఈ కేంద్రం ఆ ప్రాంతంలో మహిళల పరిష్కారానికి కృషి చేస్తోంది. నెల రోజుల కిందట నక్కపల్లిలో కేంద్రం ఏర్పాటైంది. ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించడంతో కొత్తగా నర్సీపట్నం, కె.కోటపాడుల్లో త్వరలోనే వినియోగంలోకి రానున్నాయి. నర్సీపట్నంలోని మహిళా సమాఖ్య మండల కార్యాలయంలోనే జీఆర్సీ ఏర్పాటు కానుంది. వీటిల్లో అన్యాయానికి గురైన వారికి కౌన్సిలింగ్ ఇస్తారు. అవసరమనుకుంటే వారిని సంబంధిత శాఖల ఉన్నతాధికారుల వద్దకు పంపుతారు. అప్పటికీ పరిష్కారం లభించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి సహకారం అందిస్తారు.

# గోరుకల్లు నీరు.. అందని తీరు

డోన్ : డోన్ నియోజకవర్గానికి తాగునీరు అందించే కీలకమైన గోరుకల్లు ప్రాజెక్టు పనులు గడువులోగా పూర్తయ్యేలా అగుపించడం లేదు. ప్రస్తుతానికి బేతంచెర్ల మండలంలోని కొన్ని గ్రామాలకు నీరు అందినా.. నియోజకవర్గంలో కీలకమైన డోన్ పట్టణం, మండలంలో మాత్రం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మరోవైపు ప్యాపిలి మండలంలోనూ పలుచోట్ల పైపులైన్ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పూర్తిస్థాయిలో డోన్ నియోజకవర్గ దాహార్తిని తీర్చే గోరుకల్లు నీరు వచ్చే ఏడాదిలోనే పూర్తయ్యే సూచనలు కన్పిస్తున్నాయి.

**70 శాతం పూర్తి**

డోన్ నియోజకవర్గంలోని 131 గ్రామాలకు తాగునీటికి ఉద్దేశించిన గోరుకల్లు ప్రాజెక్టు నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితమే ప్రారంభించారు. రూ.351 కోట్ల వ్యయంతో దీన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా 591 కి.మీ.ల మేర పైపులైన్ పనులు చేపట్టాల్సి ఉండగా.. 70 శాతం మేర పూర్తయింది. పట్టణ ప్రాంతంలో ఒక్కొక్కరికీ 135 లీటర్లు, గ్రామాల్లో 100 లీటర్ల తాగునీరు ఇవ్వాల్సి ఉంది. జలాశయం నుంచి 0.50 టీఎంసీల నీటిని తీసుకునేలా ప్రణాళికలు రూపొందించి



నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 36 గ్రామాలకు తాగునీరు అందుతోంది.

**వచ్చే ఏడాదికే అవకాశం**

నియోజకవర్గంలో డోన్ పట్టణ సమీపంలోని నగరవనం ప్రాంతంలో రెండు మూడు చోట్ల, డోన్ కొండ ప్రాంతంలో కొన్ని చోట్ల, ప్యాపిలి మండలంలోని హుసేనాపురంతో పాటు జలదుర్గం తదితర ప్రాంతాల్లో అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పనులు ముందుకు సాగక గడువు పెరుగుతూనే పోతోంది. మరోవైపు డోన్ నుంచి ప్యాపిలి వెళ్లే జాతీయ రహదారిలో పలుచోట్ల పైపులు అలాగే ఉన్నాయి. నిర్మాణాలకు సంబంధించిన పనులు 10 శాతం మేర పూర్తికావాల్సి ఉంది. దీంతో జనవరిలోగా డోన్‌కు, వచ్చే మార్చి, జూన్, జులైలోగా నియోజకవర్గానికి అంతటికీ నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# అడగుకో అగాధం.. గజానికో గుంత!

శృంగవరపుకోట : ఈ రెండు గ్రామాలే కాదు.. జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గంలో క్వారీలున్న ప్రతి గ్రామానిదీ ఇదే పరిస్థితి. అసలే గ్రామీణ రహదారులు.. అడుగడుగునా గుంతలు.. ఏళ్లుగా కానరాని మరమ్మతులు, నిర్వహణ.. దీనికితోడు నిత్యం క్వారీల నుంచి మితిమీరిన లోడ్లతో భారీ వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా మారుతున్నాయి.

**52 రాతి క్వారీల పరిధిలో..**

జిల్లాలోని ఎస్.కోట, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, జామి మండలాల పరిధిలో మొత్తం 83 రాతి క్వారీలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 52 వరకు పనిచేస్తున్నాయి. ఎస్.కోటలో 15, వేపాడలో 18, కొత్తవలసలో 13, జామిలో 6 క్వారీల్లో తవ్వకాలు సాగుతున్నాయి.

**ఎక్కడెక్కడ ఎలా?**గ్రామీణ దారుల్లో 10 టన్నుల లోడు సామర్థ్యం మేరకే వాహనాలు తిరిగేలా నిర్మాణం ఉంటుంది. కానీ భారీ వాహనాలు 50 నుంచి 60 టన్నుల సామర్థ్యంతో వెళ్తున్నాయి.

శృంగవరపుకోట మండలంలోని కొత్తూరు నుంచి కొండమల్లిపూడికి సుమారు 5 కి.మీ మే క్వారీ లారీలు అధికంగా తిరగడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. కొండమల్లిపూడి, మల్లిపూడి, కాశీపతి రాజుపురం గ్రామస్థులతోపాటు రైతులకు ఈ దారిలో పంట భూములున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం పడినా గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఆలుగుబిల్లి, చామలాపల్లి, పుణ్యగిరి, కొత్తూరు ఇదే పరిస్థితి.

వేపాడ మండలంలోని జాకేరు–బొద్దాం, సోంపురం–వల్లంపూడి, సోంపురం–ఆనందపురం, వీలుపర్తి–వావిలపాడు, వీలుపర్తి–కడకొండ, బొద్దాం– రామస్వామిపేట రోడ్లు గుంతలుగా మారాయి.

జామి మండలం జామి–లక్ష్మీపురం, కొత్తవలస మండలంలో కొత్తవలస నుంచి విజయనగరం, సబ్బవరం, కె.కోటపాడు రహదారులు అధ్వానంగా మారి జనం యాతన పడుతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం..**

ఎస్.కోట మండలంలో కొత్తూరు నుంచి కొండమల్లిపూడి రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లతో, వేపాడ మండలంలో బొద్దాం–కళ్లెంపూడి రోడ్డు మరమ్మతుకు రూ.1.10 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం. మిగిన వాటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.స్వామినాయుడు, డీఈ, పంచాయతీరాజ్, ఎస్.కోట


**నిత్యం అవస్థలే..**

నా పేరు సుబ్రహ్మణ్యం. మాది వేపాడ మండలం జాకేరు. గ్రామానికి వచ్చే రోడ్డంతా రాళ్లుతేలడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం పడితే అడుగేయలేం.

**పిల్లలు బడికెళ్లాలంటే భయమేస్తోంది..**

నా పేరు శ్యామ్. మాది ఎస్.కోట మండలం కొండమల్లిపూడి. రోజూ పిల్లలు పాఠశాలకు వెళ్లి, వచ్చేవరకూ భయమే. గ్రామానికి 108 వాహనం కూడా రావడం లేదు.

# కాలుష్యం కమ్మేసింది.. కోపంతో ఎరుపెక్కింది



విజయనగరం : వందల ఎకరాలకు సాగునీరు అందించే చెరువది.. పశుపక్షాదులకు ఆసరాగా నిలిచే నీటివనరది.. భూగర్భ జలాల పెంపునకు ఆస్కారం కలిగించే కల్పతరువది.. కానీ నేడు కోపంతో ఎరుపెక్కింది.. ఎవరి పాపమో తెలియదు గానీ ఎర్రటి సంద్రమై బోరుమంటోంది.జామి మండలంలోని అలమండ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న చెరువు ఇటీవల ఒక్కసారిగా ఎర్రగా మారిపోయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో పలు రకాల పరిశ్రమలు ఉండడం, దుమ్ము, ధూళి, వ్యర్థజలాల కారణంగా ఇలా మారిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పుడప్పుడూ ఇలా జరుగుతోందని పేర్కొంటున్నారు. దీంతో అటుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## అగ్గి రాజేస్తున్న మెహ్రీన్ రెడ్ హాట్ లుక్

కాలం సాగుతూనే ఉంటుంది. అది ఎవరికోసమో ఆగదు. మిగిలి ఉన్న కాలంలో ఏం సాధించామన్నదే ఇక్కడ ముఖ్యం. ఇది రంగుల ప్రపంచంలో నటీమణులకు వర్తిస్తుంది. అందాల నటి మెహ్రీన్ ఫీర్జదా కెరీర్ పై ఎన్నో హెూప్స్‌తో ముందుకు సాగుతోంది. కెరీర్ లో నవతరం హీరోలతో పాటు, అగ్ర హీరోల సరసనా అవకాశాలు అందు కుంది ఈ బ్యూటీ. కాజల్ తర్వాత మళ్లీ అంతటి అందమైన నవ్వు మోము మెహ్రీన్ సొంతమని అభిమానులు కితాబిచ్చేస్తుంటారు. అయితే కాజల్ అగర్వాల్ అంతటి పెద్ద హీరోయిన్ గా ఎదగడంలోన ఈ బ్యూటీ తడబడింది. కెరీర్ పరంగా ఆశించినది జరగకపోయినా, కనీసం వ్యక్తిగత జీవితంలో సెటిల్ అవ్వాలనే ప్రయత్నం కూడా సఫలం కాకపోవడం నిరాశపరిచింది. ఇంతకుముందు పెళ్లితో లైఫ్ లో సెటిలవ్వాలని భావించినా కొన్ని కారణాల వల్ల నిశ్చితార్థం తర్వాత బ్రేకప్ అయింది. ఇటీవల సినీ కెరీర్ కూడా ఆశించినంతగా లేదు. రెండేళ్ల క్రితం స్పార్క్ లైఫ్ అనే చిత్రంలో నటించింది. ఈ చిత్రంలో విక్రాంత్ సరసన నాయికగా నటించింది. ఆ తర్వాత తమిళ చిత్రం



ఇంద్ర సన్ నెక్ట్స్ లో విడుదలైంది. ఇవేవీ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయినా సినీ కెరీర్ గురించి అంతగా దిగులు చెందలేదని మెహ్రీన్ చెబుతోంది. తన వ్యక్తిగత ఆనందాన్ని మించినది లేదని ఈ బ్యూటీ నమ్ముతోంది. కొన్నిటికి దారులు మూసుకుపోయినా, మెహ్రీన్ మాత్రం పాజిటివ్ యాటిట్యూడ్ తో ఇతరులలో స్ఫూర్తి నింపుతోంది. ఇప్పటికీ నటిగా తన ప్రయత్నాల విషయంలో ఎక్కడా తగ్గడం లేదు. ఇటీవల ఎక్కువ సమయం ప్రయాణాలతో గడుపుతున్నానని, ఫోటోలు తీసుకో వడం, సరదాగా గడిపేయడమే తన జీవన విధానం అని మెహ్రీన్ చెప్పకనే చెబుతోంది. ఈ భామ తాజా ఫోటో క్లిక్స్ తో అభిమానులను అలరించేందుకు వచ్చింది. ఇన్ స్టా ఫీడ్ నుంచి రెడ్ హాట్ డ్రెస్ లో ఫోజులిచ్చిన కొన్ని ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. మూడు పదుల వయసులో మెహ్రీన్ పూర్తి పరిణతి చెందిన బ్యూటీ. తనదైన అందం, చిరునవ్వుతో ఆకర్షిస్తోంది. అద్భుతమైన ఎరుపు రంగు గౌనులో మెహ్రీన్ అందం మరింత ఇనుమడించింది. భారీ రా జప్రాకారంలో మెహ్రీన్ రాణిలా కనిపిస్తోంది. నేపథ్యంలో అద్భుతమైన కోట ధేధీప్యమైన కాంతులతో మెరిసిపోతోంది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. మెహ్రీన్ అందచందాలకు యువతరం ఎప్పటిలాగే ఫిదా అవుతోంది. చక్కనమ్మ రెడ్ హాట్ థై స్లిట్ లుక్ ప్రస్తుతం ఇంటర్నెట్ లో అగ్గి రాజేస్తోంది.

## ఫోటోలు మార్ఫింగ్‌లో అసలు నిజం తెలుసుకుని షాకైన అనుపమ

రీసెంట్ టైమ్స్ లో ఇంటర్నెట్ ను విచ్చలవిడిగా వాడటం బాగా అలవాటుగా మారిపోయింది. ఇంటర్నెట్ ను వాడుతూ ఎలాంటి భయం లేకుండా ఎంతకైనా తెగించడం చాలా కామనైపోయింది. అందులో భాగంగానే ఈ మధ్య కాలంలో సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో స్టార్ల పేరిట ఫేక్ అకౌంట్స్ క్రియేట్ చేసి వాళ్ల ఫోటోలను డిపీలుగా పెట్టుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కొందరు.. సెలబ్రిటీల ఫేమ్ ను వాడుకుంటూ మోసం చేస్తుంటే, మరికొందరు సెలబ్రిటీల ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్ లో వైరల్ చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ దారుణాలు పెరిగిపోయాయి. అందుకే వాటిని భరించలేక సెలబ్రిటీలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేయడం, కోర్టుకు వెళ్లడం లాంటివి చేస్తున్నారు.

**పోలీసులను ఆశ్రయించిన అనుపమ...** ఇప్పుడు సౌత్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ కు కూడా ఇలాంటి ఇబ్బందే ఎదురైంది. అనుపమ ఫోటోలను మార్ఫింగ్ చేసి, ఆమె ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అకౌంట్స్ కు ట్యాగ్ చేస్తుండటం ఎక్కువవడంతో అనుపమ ఈ విషయంపై



కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ ఘటనపై స్పందిస్తూ అనుపమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, తన గురించి అలా అసభ్యకర పోస్టులు చేసిందెవరో తెలిసిపోయిందంటూ పోస్ట్ చేశారు.

**అనుపమపై 20 ఏళ్ల అమ్మాయి ట్రోలింగ్....** ఆ పోస్ట్ లో అనుపమ ఇలా రాసుకొచ్చింది. కొన్నాళ్ల కిందట తన గురించి తప్పుడు వార్తలను, మార్ఫింగ్ ఫోటోలను పంచుతున్న ఓ అకౌంట్ కనిపించిందని, అదే వ్యక్తి ఎన్నో ఫేక్ అకౌంట్స్ ను క్రియేట్ చేసి, తనపై అవమానకార కామెంట్స్ చేస్తూ హేట్రెడ్ ను స్ప్రెడ్ చేశారని, దీంతో తాను కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, విచారణలో ఇదంతా చేస్తున్నది ఒక 20 ఏళ్ల అమ్మాయి అని తెలిసి తాను షాకైనట్టు అనుపమ రాసుకొచ్చారు.

**సెలబ్రిటీలకు కూడా హక్కులుంటాయి...** ఆమె వయసును దృష్టిలో ఉంచుకుని ఆమె ఎవరనేది తాను బయటపెట్టాలనుకోవడం లేదని, కానీ చట్టపరమైన చర్యలు మాత్రం తీసుకుంటానని చెప్పిన అనుపమ, సెలబ్రిటీలకు కూడా సాధారణ మనుషుల్లానే హక్కులుంటాయని, ఆన్‌లైన్ వేధింపులు శిక్షార్హ నేరమని పేర్కొన్నారు. ఈ విషయం ద్వారా తానో విషయం చెప్పాలనుకుంటున్నానని, స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్ కు యాక్సెస్ ఉన్నంత మాత్రాన ఇతరులను వేధించడం, వారి పరువు తీస్తూ, ద్వేషాన్ని వ్యాప్తి చేసే హక్కు ఎవరికీ ఉండదని, ఆన్ లైన్ లో చేసే ప్రతీ పనికి జవాబుదారీతనం తప్పదని అనుపమ చెప్పారు. ఇక అనుపమ కెరీర్ విషయానికొస్తే ఈ ఇయర్ అనుపమ ఏకంగా ఆరు సినిమాలు చేసింది. త్వరలో అనుపమ లాక్‌డౌన్ అనే తమిళ సినిమాలో కనిపించనున్నారు.




## ఆ లుక్స్ తోనే గూస్‌బంప్స్ వచ్చాయి



నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ది ప్యారడైజ్. హిట్3 తర్వాత నాని చేస్తున్న ది ప్యారడైజ్ కు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. దసరా సినిమాతో ఫస్ట్ అటెంప్ట్ తోనే మంచి హిట్ ను ఖాతాలో వేసుకోవడంతో పాటూ ఆ సినిమాతో నాని తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కూడా నిలబెట్టుకున్నారు శ్రీకాంత్. ఆ నమ్మకంతోనే ఇప్పుడు నాని మరోసారి శ్రీకాంత్ కు ఛాన్స్ ఇచ్చారు.

**ది ప్యారడైజ్ రా స్టేట్‌మెంట్స్ కు భారీ రెస్పాన్స్...** దసరా సినిమా తర్వాత నాని- శ్రీకాంత్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా శ్రీకాంత్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని ఆల్రెడీ రిలీజైన గ్లింప్స్ తోనే క్లారిటీ వచ్చింది. ది ప్యారడైజ్ నుంచి రా స్టేట్‌మెంట్ పేరుతో వచ్చిన గ్లింప్స్ కు ఆడియన్స్ నుంచి ఏ స్థాయి రెస్పాన్స్ వచ్చిందో కొత్తగా చెప్పనక్కర్లేదు.

**డిఫరెంట్ లుక్ లో కనిపించనున్న నాని...** దసరాతో నానిని మాస్ హీరోగా ప్రెజెంట్ చేసిన శ్రీకాంత్ ఈసారి ది ప్యారడైజ్ ఇంకా కొత్తగా ప్రెజెంట్ చేయనున్నారని లుక్ చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ది ప్యారడైజ్ మూవీ గురించి దసరా సినిమాలో కీలక పాత్రలో నటించిన దీక్షిత్ శెట్టి రీసెంట్ గా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను రీసెంట్ గా ది ప్యారడైజ్ సెట్స్ కు వెళ్లానని దీక్షిత్ చెప్పారు.

**దసరా కంటే భారీగా..** ది ప్యారడైజ్ కోసం వేసిన సెట్, ఆ సెటప్ నెక్ట్స్ లెవెల్ లో ఉన్నాయని, ది ప్యారడైజ్ తెలుగు సినిమాకు గేమ్ ఛేంజర్ అవుతుందని, షూటింగ్ టైమ్ లో నాని లుక్ చూశాక తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ది ప్యారడైజ్ మూవీ దసరా సినిమా కంటే చాలా భారీగా ఉ ండబోతుందని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానున్న ది ప్యారడైజ్ లో మోహన్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో కనిపించనుం డగా, అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

## రెహమాన్ కాన్సర్ట్.. క్లిక్కయ్యిందా లేదా?



స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఏ ఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్.. హైదరాబాద్ శివార్లలోని రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి చాలా గ్రాండ్ గా జరిగిన ఆ ఈవెంట్ కు పెద్ద ఎత్తున అభిమానులు, మ్యూజిక్ లవర్స్ తరలి వచ్చారు. రెహమాన్ తన లైవ్ మ్యూజిక్ అండ్ సాంగ్స్ తో ఓ రేంజ్ లో సందడి చేశారు. అందుకు సంబంధించిన వీడియోస్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అదే సమయంలో కాన్సర్ట్ కు వెళ్లి వచ్చిన వారు.. నెట్టింట రెస్పాండ్ అవుతున్నారు. చాలా మంది నుంచి మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. నిజానికి.. రెహమాన్ లైవ్ కాన్సర్ట్ కు మంచి క్రేజ్ ఉంటుంది. కానీ ఈసారి హైదరాబాద్ కాన్సర్ట్ కు నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వినిపిస్తోంది. అందుకు ముఖ్యంగా రెండు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి.. మొత్తం కాన్సర్ట్ కేవలం మూడు గంటల్లో కంప్లీట్ అవ్వడం పట్ల అనేక మంది నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో రెహమాన్.. తెలుగు సాంగ్స్ చాలా తక్కువ పాడారని చెబుతున్నారు. టాలీవుడ్ లో సూపర్ ఫ్యాన్ బేస్ సొంతం చేసుకున్న ఆయన.. అలా చేయడం పట్ల పెదవి విరుస్తున్నారు.

అయితే ఇప్పటి వరకు తెలుగులో పలు స్ట్రయిట్ మూవీస్ కు రెహమాన్ వర్క్ చేసిన విషయం తెలిసిందే. ఆయా సినిమాల సాంగ్స్ అనుకున్నంత స్థాయిలో హిట్ అవ్వలేదు. కానీ ఆయన వర్క్ చేసిన మిగతా భాషల చిత్రాల డబ్బింగ్ వెర్షన్ల పాటలు మాత్రం తెలుగు సినీ ప్రియులను ఆకట్టుకున్నాయి. చాలా మంది ఫేవరెట్ గా నిలిచాయి. ఇప్పుడు వాటిని కూడా రెహమాన్ పాడకపోవడంతో అనేక మంది మ్యూజిక్ లవర్స్.. నిరాశ వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇంకొందరు అయితే.. వేల రూపాయలు వెచ్చించి టికెట్స్ కొనుగోలు చేశామని.. కానీ తాము సాటిస్ఫై అవ్వలేదని కామెంట్లు పెడుతున్నారు. రెహమాన్ ఫ్యాన్స్ మాత్రం ఓకే అని చెబుతున్నారు. దీంతో రెహమాన్ లైవ్ కాన్సర్ట్.. అందరినీ సాటిస్ఫై చేయలేదని చెప్పాలి. ఫ్యాన్స్ ను తప్ప మిగతా మ్యూజిక్ లవర్స్ ను అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేదు. అంచనాలను తాకలేదు. బ్లాక్ బస్టర్ గా నిలవలేదు. అయితే రెహమాన్ రీసెంట్ గా కంపోజ్ చేసిన టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది మూవీలోని చికిరి చికిరి సాంగ్ లైవ్ ప్రెజెంటేషన్ ప్రతి ఒక్కరినీ మెప్పించడం విశేషం.

## కాంతార రుక్మిణి మళ్ళీ ట్రెండింగ్.. ఎందుకంటే..?

కన్నడ భామ రుక్మిణి వసంత్ కి లక్కు మామూలుగా లేదని చెప్పొచ్చు. ఎందుకంటే ప్రస్తుతం సౌత్ లో కాదు కాదు నేషనల్ వైడ్ గా అమ్మడు మరోసారి ట్రెండింగ్ లో ఉంది. సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో ప్రేక్షకుల మనసులు దోచేసింది రుక్మిణి. ఆ సినిమాలో ఆమె కోజప్ షాట్స్ ని చాలా పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆ సినిమాతో పాపులర్ అయిన రుక్మిణి తమిళంలో వరుస సినిమాలు చేస్తుంది. ఐతే రీసెంట్ గా వచ్చిన కాంతారా చాప్టర్ 1 లో కనకావతి రోల్ లో అదరగొట్టేసింది రుక్మిణి.

**కాంతారా 1 లో ఆమె లుక్స్ మైండ్ లో నుంచి పోవట్లేదు..** కాంతారా చాప్టర్ 1 బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంలో రిషబ్ శెట్టి యాక్టింగ్ ఎంత ఇంప్రెస్ చేసింది కనకావతి రోల్ లో రుక్మిణి వసంత్ కూడా అదే రేంజ్ లో ఇంప్రెస్ చేసింది. రుక్మిణి వసంత్ ఫ్యాన్స్ కి అయితే కాంతారా లో ఆమె లుక్స్ మైండ్ లో నుంచి పోవట్లేదు అనే రేంజ్ లో ఇంపాక్ట్ చూపించింది. కాంతారా 1 థియేట్రికల్ రన్ నడుస్తున్న రోజులు రుక్మిణి వసంత్ సోషల్ మీడియాని ఊపేసింది. సినిమాలో ఆమె



లుక్స్ అయితే వర్ణించడానికి మాటల్లేవ్ అనేలా ఉన్నాయని డిస్కస్ చేశారు. ఇక ఇప్పుడు మళ్లీ కాంతారా చాప్టర్ 1 లో రుక్మిణి రోల్ గురించి ఆమె లుక్స్ గురించి సోషల్ మీడియాలో మరోసారి హడావిడి చేస్తున్నారు. కాంతారా చాప్టర్ 1 సినిమా ఈమధ్యనే ఓటీటీ రిలీజైంది. అమెజాన్ ప్రైమ్ లో సినిమా స్ట్రీమింగ్ అవుతుంది.

ప్రైమ్ వీడియోస్ లో రిలీజైన కాంతారా 1 మళ్లీ వార్తల్లో నిలుస్తుంది. రిషబ్ యాక్టింగ్ గురించి అతని టేకింగ్ అదే డైరెక్షన్ గురించి సూపర్ అనేస్తున్నారు ఆడియన్స్. ఇక అదే క్రమంలో హీరోయిన్ రుక్మిణి వసంత్ గురించి కూడా మళ్లీ ట్రెండింగ్ చేస్తున్నారు.


**ఎన్టీఆర్ డ్రాగన్ లో రుక్మిణి..** కాంతారా 1 లో రుక్మిణి తప్ప మరో హీరోయిన్ ని ఊహించలేకపోతున్నాం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏది ఏమైనా రుక్మిణి వసంత్ కి కాంతారా మంచి క్రేజ్ ఏర్పడేలా చేసింది. ఆమె మీద ఉన్న అంచనాలకు చేస్తున్న పాత్రలు తోడై అమ్మడికి విపరీతమైన ఫాలోయింగ్ తెస్తున్నాయి. ఐతే రుక్మిణి వసంత్ నెక్ట్స్ ఎన్టీఆర్ డ్రాగన్ లో హీరోయిన్ గా నటిస్తుంది. తెలుగులో స్ట్రైట్ గా నిఖిల్ తో ఒక సినిమా చేసింది రుక్మిణి.

కానీ దాన్ని ఎవరు పట్టించుకోలేదు. కానీ కాంతారా 1 ఇచ్చిన క్రేజ్ తో తప్పకుండా రుక్మిణి చేసే ప్రతి సినిమా మంచి స్కోప్ దొరికే ఛాన్స్ ఉంటుంది. కొందరైతే నేషనల్ క్రష్ ట్యాగ్ ని రష్మిక నుంచి రుక్మిణికి ఇచ్చేయాలని కోరుతున్నారు. మరి ఈ సరికొత్త నేషనల్ క్రష్ ఎలాంటి పాత్రలు, సినిమాలు చేసి మెప్పిస్తుందో చూడాలి.

## మృణాల్ చేతిలో అదొక్కటే.. రీజన్స్ ఏంటి..?

బాలీవుడ్ లో సీరియల్స్ చేసి ఆ క్రేజ్ తో సిల్వర్ స్క్రీన్ ఛాన్స్ లు అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. హను రాఘవపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన సీతారామం సినిమా సూపర్ హిట్ అవ్వడంతో మృణాల్ ఠాకూర్ కి తెలుగులో మంచి పాపులారిటీ వచ్చింది. ఆ నెక్ట్స్ నానితో హాయ్ నాన్న చేసి మెప్పించింది మృణాల్ ఐతే థర్డ్ ప్రయత్నంగా విజయ్ దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది కానీ అది వర్క్ అవుట్ అవ్వలేదు. 3 సినిమాలు తీస్తే రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగా అయినా కూడా మృణాల్ కి తెలుగులో సరైన అవకాశాలు రావట్లేదు.

**మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క సినిమా..** నిజంగానే మృణాల్ కి ఛాన్స్ లు రావట్లేదా ఒకవేళ వచ్చినా ఆమె కాదంటుందా అన్నది తెలియదు కానీ మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క తెలుగు సినిమా ఉంది. అది కూడా ముందు ఒక హీరోయిన్ తో ఆ ప్రాజెక్ట్ అనుకుని టీజర్ కూడా చేశాక మధ్యలో ఆ హీరోయిన్ హ్యాండ్సప్ చెప్పడంతో మృణాల్ కి ఛాన్స్ దక్కింది. ఒకవేళ ఆ హీరోయిన్ కొనసాగి ఉంటే ఆ అవకాశం కూడా ఉండేది కాదు. మృణాల్ ఠాకూర్ డెకాయిట్



సినిమా నెక్ట్స్ ఇయర్ మార్చిలో రిలీజ్ అవుతుంది. ఈ సినిమాతో పాటు అల్లు అర్జున్ అట్లీ కాంబో సినిమాలో ఒక రోల్ చేస్తుందని వార్తలు వస్తున్నాయి కానీ అది అఫీషియల్ అనౌన్స్ మెంట్ రాలేదు. ఐతే తెలుగులో పరిస్థితి ఇలా ఉండగా ఇంకా బాలీవుడ్ లో మృణాల్ తన ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అక్కడ స్టార్ అవ్వాలన్న తన కల కోసం మృణాల్ ఎలాంటి ఆఫర్ వచ్చినా కాదనకుండా చేస్తుంది.

**టాలీవుడ్ మీదే మృణాల్ ఫోకస్..** హిందీలో సినిమాలు చేస్తున్నా కూడా తన ఫోకస్ అంతా టాలీవుడ్ మీదే మృణాల్ పెట్టింది. అందుకే ఇక్కడ ఏ సినిమా ఛాన్స్ వచ్చినా కాదనకుండా చేయాలని చూస్తుంది. తెలుగులో చేసిన 3 సినిమాల్లో రెండు సక్సెస్ అయినా కూడా మృణాల్ ఠాకూర్ ని ఎవరు పట్టించుకోవట్లేదు. ఐతే ఆడియన్స్ మాత్రం మృణాల్ కి మళ్లీ మళ్లీ అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం అడివి శేష్ డెకాయిట్ ఒక్కటే ఆమె చేస్తుండగా ఆ సినిమా రిలీజ్ తర్వాత ఏమైనా మృణాల్ కి అవకాశాలు వస్తాయేమో చూడాలి. మృణాల్ మాత్రం తన హెూప్స్ ని వదులుకోకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉంది. తెలుగు, హిందీతో పాటు తమిళంలో కూడా తన ఎంట్రీ ఇవ్వాలని చూస్తుంది మృణాల్. కాకపోతే అమ్మడికి అక్కడ నుంచి ఛాన్స్ లు రావట్లేదు. తెలుగులో మాత్రం మృణాల్ ఎలాంటి సినిమా అయినా చేసి తీరుతా అని కాన్ఫిడెంట్ గా చెబుతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536